

ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి

ప్రభాత
వెలుగు
07.02.2019
www.v6velugu.com
గురువారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 352 పేజీలు: 12+12+16 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL





శబరిమలకు మహిళలు రావచ్చు

ఏ వయసు వారైనా ప్రవేశానికి అభ్యంతరం లేదు

- సుప్రీం ముందు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు
- మొన్నటివరకు వ్యతిరేకత.. ఇప్పుడు యూ టర్న్
- వివక్ష చూపొద్దనే ఈ నిర్ణయమని ప్రకటన
- సెప్టెంబర్ 28 నాటి తీర్పును గౌరవిస్తున్నామని వ్యాఖ్య
- రివ్యూ పిటిషన్లపై సుప్రీం తీర్పు రిజర్వ్
- బోర్డు తీరును తప్పుబట్టిన హిందూ సంఘాలు, కాంగ్రెస్, బీజేపీ

న్యూఢిల్లీ: శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళల ప్రవేశంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తున్నట్లు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) స్పష్టం చేసింది. తీర్పు అమలు కోసం కొంత గడువు కావాలని నవంబర్‌లోనే సుప్రీం కోర్టును బోర్డు కోరింది. బుధవారం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ల విచారణ సందర్భంగా తమ నిర్ణయాన్ని వెల్లడించింది. ఇది బోర్డు సమావేశంలో తీసుకున్న

మిగతా 2లో

ఎన్టీపీసీ కరెంట్‌లో 85% మనకే

టీఎస్‌టీపీపీలో ఉత్పత్తయ్యే 4,000 మెగావాట్లలో రాష్ట్రానికే కేటాయింపు

కేంద్ర కేబినెట్ ఆమోదం



హైదరాబాద్,వెలుగు: పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఎన్టీపీసీ నిర్మిస్తున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ)లో ఉత్పత్తయ్యే 4,000 మెగావాట్ల కరెంటులో 85% వాటా రాష్ట్రానికే దక్కనుంది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. టీఎస్‌టీపీపీలో తొలిదశలో 800 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లు, రెండో దశలో అంతే సామర్థ్యంతో మరో మూడేసి యూనిట్లు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం తొలిదశ యూనిట్ల నిర్మాణం జరుగుతోంది. ఈ రెండు యూనిట్లు 2021 నాటికి ఉత్పత్తిని ప్రారంభిస్తాయని అంచనా. రూ.11,811.26 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన ఈ ప్రాజెక్టుకు 2018 మార్చి నాటికి రూ.1,849 ఖర్చు చేశారు. తెలంగాణలో 4,000 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన విద్యుత్కేంద్రాన్ని నిర్మించాలని ఏపీ విభజన చట్టంలోని పదమూడో షెడ్యూల్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే. మరోవైపు, జార్ఖండ్‌లోనూ 4,000 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న పట్రాట్ థర్మల్ పవర్ స్టేషన్ ఉత్పత్తయ్యే విద్యుత్‌లో 85% ఆ రాష్ట్రానికే కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

“ ప్రతి గ్రామానికి సంబంధించి ఐదేళ్ల పక్కా ప్రణాళిక ఉండాలె. ఊరికి ఏం అవసరాలున్నాయి, అభివృద్ధి పనులు ఏం చేయాలి, గ్రామాన్ని ఎట్లా తీర్చిదిద్దాలి, ఈ రోజు గ్రామం ఎట్లా ఉంది, ఐదేండ్ల తర్వాత ఎట్లా ఉండాలె.. అనే ఆలోచన చెయ్యాలె. గ్రామానికి వచ్చే నిధులేమిటి.. ఎంత మొత్తంలో వస్తాయి అనే అంచనా ఉండాలె. దానికి తగ్గట్లు ప్లాన్ చేసుకోవాలె.

కొత్తగా ఎన్నికైన సర్పంచులకు శిక్షణ ఇచ్చే రిసోర్స్ పర్సన్స్‌తో ప్రగతి భవన్‌లో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



పల్లె సల్లగుండాలె

గ్రామాల సమగ్రాభివృద్ధితోనే ఆధునిక తెలంగాణ: కేసీఆర్

- ఐదేండ్లకు పక్కా ప్లాన్ తయారుచేసుకోవాలి
- సర్పంచ్‌లు, కార్యదర్శులు ముందుచూపుతో వెళ్లాలి
- నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలి
- ‘గ్రీన్ విలేజ్.. క్లీన్ విలేజ్’ నినాదంతో సాగాలి
- రోడ్లపై చెత్త వేస్తే రూ. 500 జరిమానా తప్పదు
- వచ్చే ఐదేళ్లలో రాష్ట్రానికి రూ. 45 వేల కోట్లు వస్తాయి
- ఆర్నెల్లకోసారి కలుద్దాం.. సమీక్షించుకుందాం..
- పంచాయతీ రిసోర్స్‌పర్సన్లకు సీఎం దిశానిర్దేశం
- ప్రగతి భవన్‌లో సాయంత్రం వరకు భేటీ
- శ్లోకాలు, పద్యాలు, ప్రముఖుల గాథలతో
- స్ఫూర్తిదాయకంగా సాగిన ప్రసంగం
- పంచాయతీ విధులు, నిధుల గురించి వివరణ

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని ప్రతి పల్లె పచ్చగా ఉండాలని, అన్ని వసతులు, వనరులు అందుబాటులో ఉండాలని సీఎం కేసీఆర్ సూచించారు. ప్రతి అవసరాన్ని గుర్తించి దాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ప్లాన్ ప్రకారం పోతేనే అన్ని పనులు సక్రమంగా పూర్తవుతాయని తెలిపారు. ‘గ్రీన్ విలేజ్, క్లీన్ విలేజ్’ నినాదంతో ముందుకు సాగాలన్నారు. కొత్త సర్పంచ్‌లకు, గ్రామ కార్యదర్శులకు జిల్లాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన రిసోర్స్ పర్సన్లతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ప్రగతిభవన్‌లో జరిగిన ఈ సమావేశానికి 300 మందికిపైగా వివిధస్థాయి అధికారులు, ఉద్యోగులు, కొందరు సర్పంచ్‌లు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. దాదాపు ఆరు గంటల పాటు సీఎం కేసీఆర్ ప్రసంగించారు. అందులో గంట పాటు రిసోర్స్ పర్సన్ల అనుమానాలను నివృత్తి చేశారు. సర్పంచ్ లకు, కార్యదర్శులకు శిక్షణ ఎలా ఇవ్వాలన్న దానిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడి మాదిరిగా కర్తవ్య బోధన చేశారు. సందర్భోచితంగా పద్యాలు, శ్లోకాలు చెప్పారు. ఛలోక్తులు విసురుతూ నవ్వులు పూయించారు. గ్రామానికి ఏమేం కావాలో ముందుగా స్పష్టత ఉండాలని, దీనిపై సర్పంచులు, కార్యదర్శులకు అవగాహన కల్పించాలని, గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలో వారికి వివరించాలని రిసోర్స్ పర్సన్లకు సీఎం సూచించారు. ఐదేళ్లకు తగ్గట్టు పక్కా ప్రణాళికను రూపొందించుకునేలా సర్పంచ్‌లకు, కార్యదర్శులకు సహకరించాలన్నారు. పల్లెల్లో రోడ్లు, మంచి నీరు, విద్యుత్ సరఫరా లాంటి ముఖ్యమైన పనులన్నింటిని ప్రభుత్వమే నేరుగా చేపడుతున్నదని, ఇతర సమస్యలపై దృష్టి సారించాలని ఉద్బోధించారు. పచ్చదనం, పరిశుభ్రత, శ్మశాన వాటికల (వైకుంఠధామాలు) నిర్మాణంపై పంచాయతీలు ప్రత్యేక దృష్టి సారించాలని, ‘గ్రీన్ విలేజ్.. క్లీన్ విలేజ్’ నినాదంతో ఈ పనులు చేపట్టాలని పిలుపునిచ్చారు. పంచాయతీలకు ఎక్కడెక్కడి నుంచి నిధులు వస్తాయో సర్పంచ్‌లకు వివరించాలని, పన్నులు కూడా ఎలా సమకూరుతాయో విడమర్చి చెప్పాలని దిశానిర్దేశం చేశారు.

మిగతా 3లో

ప్రగతిభవన్ స్కూల్లో.. కేసీఆర్ సారు
రిసోర్స్‌పర్సన్లకు టీచర్‌లా కర్తవ్యం బోధించిన ముఖ్యమంత్రి
03

బిహారీ పంచతంత్రం

మిత్రభేదాలు, మిత్రలాభాల వేదిక

- ప్రతిసారీ మారిపోతున్న పొత్తులు
- ఈసారి స్పష్టంగా సమీకరణాలు
- బీజేపీ దోస్తీతో నిలదొక్కుకున్న నితీశ్
- జైలుపాలైనా పట్టుసడలని లాలుప్రసాద్
- తేజస్వి నాయకత్వంలో ఆర్జేడీకి కొత్త జోష్



పంచతంత్రం నీతికథలు తెలియనివాళ్లు బీహార్ రాజకీయాన్ని చూసి తెలుసుకోవచ్చు. తెలిసినవాళ్లు ఇక్కడి నేతలను చూసి ప్రాక్టికల్‌గా అవగాహన పెంచుకోవచ్చు. ఇందులో మిత్రలాభం, మిత్రభేదం, యుద్ధాలు, సంధులు అన్నీ కనిపిస్తాయి. ఎప్పటికప్పుడు అవసరాన్ని బట్టి, పరిస్థితులను బట్టి పొత్తులను, మిత్రులను తేలికగా మార్చుకునే ప్రత్యేకమైన రాజకీయానికి బీహార్ వేదిక. వారి ఎత్తులను పట్టించుకోకుండా విలక్షణమైన తీర్పులిచ్చే ఓటర్లు కూడా ఇక్కడి ప్రత్యేకత.

ఉత్తరప్రదేశ్ తర్వాత దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న బీహార్ చిత్రంపై ఈరోజు ‘వెలుగు’ ప్రత్యేక కథనం.

02



గోడ కడతా.. అడ్డుపడొద్దు

డెమోక్రాట్లకు డొనాల్డ్ ట్రంప్ పిలుపు

న్యాయంగా వస్తే ఎవరైనా రావొచ్చు

05



‘పవిత్ర బంధం’ ఝాన్సీ సూసైడ్

ప్రేమ వ్యవహారమే కారణం!

02

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
70.00	70.00	70.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
71.00	70.00	72.00

ప్రేమించలేదని కత్తితో 15 వేట్లు

ఇంటర్ స్టూడెంట్‌పై ఉన్మాది దాడి

- మెడ, వీపు, తల, చేతులపై తీవ్ర గాయాలు
- ప్రాణాపాయ స్థితిలో బాలిక
- బర్కత్‌పురలో నడిరోడ్డుపై పట్టపగలే దారుణం
- నిందితుడు భరత్ ఉండేది
- బాధితురాలి ఇంటి పొరుగునే



హైదరాబాద్, వెలుగు: పట్టపగలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా మైనర్‌బాలిక(17)పై ఓ ప్రేమోన్మాది కొబ్బరి బొండాలు నరికే కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాలిక చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. బుధవారం హైదరాబాద్‌లోని బర్కత్‌పుర సత్యానగర్‌లో ఈ దారుణం జరిగింది. నిందితుడిని బాలిక ఇంటి పక్కనే ఉండే భరత్ (19)గా పోలీసులు గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రేమించాలంటూ వేధింపులు

బర్కత్ పుర సత్యానగర్ కు చెందిన రాములు వీఎస్టీ లో కాంట్రాక్ట్ ఉద్యోగి. భార్య ఉదయ గృహిణి. ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. రెండో కుమార్తె ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. పక్కింట్లో ఉండే భరత్ డిగ్రీ చదువుతున్నాడు. కొంత కాలంగా ప్రేమ పేరుతో బాలికను

మిగతా 4లో



మొబైల్‌కు ఎస్సెమ్మెస్

అర్హుల వివరాలను పోర్టల్‌లో రాష్ట్ర ప్రభుత్వం అప్‌లోడ్ చేయాలి. రైతుల పేరు, వయసు, కులం, జెండర్ వివరాలతో పాటు ఆధార్ నంబరు తప్పనిసరి. ఆధార్ లేకపోతే ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ నంబర్‌తోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు, బ్యాంకు అకౌంట్ నంబరు, సర్వే నంబరు, మొబైల్ నంబరు వివరాలు నమోదు చేయాలి. నంబరు ఇచ్చిన రైతులకు అకౌంట్‌లో డబ్బులు జమ అయితే మెసేజ్ వస్తుంది.

పీఎం కిసాన్.. ఊర్ల ఉన్నోళ్లకే

పథకం మార్గదర్శకాలు విడుదల

- 25లోగా లబ్ధిదారుల వివరాలివ్వండి
- పీఎం కిసాన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయండి
- రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం
- ఉమ్మడి కుటుంబాలకు షరతులు
- తప్పుడు వివరాలిస్తే సొమ్ము రికవరీ

హైదరాబాద్, వెలుగు: గ్రామాల్లో నివాసం ఉండే వారికే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తిస్తుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉమ్మడి కుటుంబంలోని కుటుంబాలకు ఐదెకరాల్లోపు భూమి ఉంటే వారు అర్హులేనని వెల్లడించింది. ఐదు ఎకరాల లోపు భూమి వేర్వేరు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నా, వేర్వేరు గ్రామాల్లో ఉన్నా పథకం వర్తిస్తుందని చెప్పింది. ఈ మేరకు బుధవారం పీఎం కిసాన్‌కు సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసింది. లబ్ధిదారుల వివరాలను ఈ నెల 25లోగా పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఆలోపు అప్‌లోడ్ చేసిన వారికే రూ.2 వేలు బదిలీ అవుతాయని పేర్కొంది. తొలి విడత ఇన్‌స్టాల్‌మెంట్‌కు 2018 డిసెంబర్ 1 నుంచి

మిగతా 4లో

‘పవిత్ర బంధం’ ఝాన్సీ సూసైడ్



- ప్రేమ వ్యవహారమే కారణం!
- ఫ్యాన్‌కు ఉరేసుకుని హైదరాబాద్‌లో ఆత్మహత్య

సికింద్రాబాద్, వెలుగు: ‘పవిత్ర బంధం’ సీరియల్‌తో ఫేమస్ అయిన టీవీ నటి సువ్వాడ ఝాన్సీ (21) బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ప్రేమ వ్యవహారమే ఆమె సూసైడ్‌కు కారణమని తెలుస్తోంది. కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం వాడాలి గ్రామానికి చెందిన సువ్వాడ వెంకటేశ్వర్లు, అన్నపూర్ణల కుమార్తె ఝాన్సీ. అక్కడే ఇంటర్ వరకు చదివింది. యాక్టింగ్ మీద ఇంట్రెస్ట్‌తో మూడేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చి ఎస్ఆర్ నగర్‌లోని శ్రీనగర్ కాలనీలో సోదరుడు దుర్గాప్రసాద్‌తో కలిసి ఉంటోంది. వచ్చిన కొన్నాళ్లకే సీరియల్స్‌లో అవకాశాలు దొరకడంతో నటిస్తోంది. ఈ క్రమంలోనే ఆమెకు విజయవాడకు చెందిన సూర్య అలియాస్ నానీ పరిచయమయ్యాడు. అది కొన్నాళ్లకే ప్రేమగా మారింది. రెండు నెలల క్రితం ప్రేమ విషయాన్ని ఝాన్సీ ఇంట్లో చెప్పింది. తల్లిదండ్రులు సూర్యను ఇంటికి పిలిపించి మాట్లాడారు. ఇరు కుటుంబాల మధ్య ఆర్థిక అసమానతలున్నాయని, ఇంట్లో ఒప్పించిన తర్వాతే పెళ్లి చేసుకోవాలని సూచించారు. పెళ్లి చేసుకోవాలని కొన్నాళ్లపాటు ఝాన్సీపై ఒత్తిడి తెచ్చిన సూర్య.. ఆ తర్వాత ఆమెకు దూరమైనట్టు తెలుస్తోంది. అంతకు ముందే సూర్య సూచన మేరకు ఝాన్సీ సీరియల్స్‌లో నటించడం మానేసింది. సూర్య దూరం కావడం, సీరియల్స్ లో అవకాశాలు సన్నగిల్లడంతో మనస్తాపం చెందిన ఝాన్సీ ఆత్మహత్య చేసుకుందని భావిస్తున్నారు. సూసైడ్‌కు ముందు ఆమె సూర్యతో చాటింగ్ చేసిందని, సెల్ఫ్ వీడియో రికార్డ్ చేసిందని అంటున్నారు.

సూర్యపై కేసు

తమ కూతురు సంక్రాంతికి ఇంటికొచ్చి నాలుగు రోజుల క్రితమే హైదరాబాద్ వచ్చేసిందని తల్లిదండ్రులు చెప్పారు. మంగళవారం రాత్రి కూడా తమతో మంచిగానే మాట్లాడిందని, ఇంతలోనే ఇలా జరిగిందని విలపించారు. వారి ఫిర్యాదు మేరకు సూర్యపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఆర్‌నగర్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం డెడ్‌బాడీని కుటుంబసభ్యులు సొంతూరుకు తరలించారు.

సూర్య వల్లే చనిపోయింది

ప్రేమ పేరుతో సూర్య మోసం చేసి, పెళ్లి చేసుకోకపోవడంతోనే మా కూతురు చనిపోయింది. సూర్యపై పోలీసులు చర్యలు తీసుకోవాలి.

- ఝాన్సీ తల్లి అన్నపూర్ణ

రాజకీయాలతో మీకేం పని?

- మీ హద్దుల్లో మీరుండండి
- పాక్ ఆర్మీకి సుప్రీం వార్నింగ్

ఇస్లామాబాద్: రాజకీయ వ్యవహారాలలో సైన్యానికి ఏం పనంటూ పాకిస్థాన్ సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. రాజకీయాల్లో సైనిక ఉన్నతాధికారుల జోక్యాన్ని తప్పుబడుతూ ఇకపై ఆ వ్యవహారాల్లో కలగజేసుకోవద్దని ఆర్మీని హెచ్చరించింది. చట్టపరిధికి లోబడి తమ తమ హద్దుల్లో ఉండాలంటూ ఉన్నతాధికారులకు సూచించింది. ఈమేరకు జస్టిస్‌క్వాజీ ఫయాజ్ ఇసా, జస్టిస్ ముషిర్ ఆలంలతో కూడిన సుప్రీం బెంచ్ బుధవారం ఈ తీర్పు వెలువరించింది. ఎన్నికల్లో జోక్యం చేసుకోవద్దని పేర్కొంది. ఆర్మీ చెప్పుచేతల్లో నడిచే ఇంటర్‌సర్వీసెస్‌ఇంటలిజెన్స్(ఐఎస్ఐ) కూడా చట్టపరిధిలో పనిచేయాలని ఆదేశించింది. సైనికులు రాజకీయపరంగా ఎలాంటి కార్యకలాపాల్లో పాల్గొనద్దంటూ ఆదేశించింది. అదేవిధంగా రాజకీయ, రాజకీయేతర సంస్థలకు ఆందోళన చేసే హక్కుకు పరిమితులు ఉంటాయని స్పష్టం చేసింది. ప్రజల హక్కులకు భంగం కలిగించకుండా ఆందోళనలు చేసుకోవచ్చని పేర్కొంది. 2017లో తెహ్రీక్‌లబ్బాయిక్ పాకిస్థాన్ (టీఎల్ పీ) నిర్వహించిన ఓ ఆందోళన కార్యక్రమంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారని కోర్టు వివరించింది. ఇస్లామాబాద్‌కు వెళ్లే నేషనల్ హైవేపై టీఎల్‌పీ ధర్నా నిర్వహించడం వల్ల ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారని గుర్తుచేసింది. ఇక ఫత్వాల పేరుతో ఇతరులను బాధపెట్టే అధికారం ఎవరికీ లేదని సుప్రీం ధర్మాసనం తేల్చిచెప్పింది.

శబరిమలకు మహిళలు రావచ్చు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయమని టీడీబీ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. మతాచారాలు అందరికీ సమానంగా ఉంటాయని, జీవ సంబంధిత లక్షణాల కారణంగా మహిళలపై వివక్ష చూపడం సరికాదని పేర్కొన్నారు. కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళల ప్రవేశానికి అనుమతినిస్తూ గత ఏడాది సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. దీనిపై కేరళ సహా పలు రాష్ట్రాల్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో తీర్పును సమీక్షించాలంటూ కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. సమీక్షించొద్దని మరికొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై బుధవారం సీజేఐ రంజన్ గొగొయ్ నేతృత్వంలో జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్, ఏఎం ఖన్విల్కర్, డీవై చంద్రచూడ్, ఇందు మల్హోత్రాతో కూడిన సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టింది. టీడీబీ తరఫున సీనియర్ లాయర్ రాకేశ్ ద్వివేది వాదనలు వినిపించారు. తమకు ఇష్టమైన మతాచారాన్ని పాటించే హక్కు పౌరులకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 25(1) కల్పించిందంటూ బెంచ్ దృష్టికి తీసుకొచ్చారు. శబరిమల అంశంలో సుప్రీంకోర్టు తీర్పును అంగీకరిస్తున్నామని, తీర్పును సమీక్షించాలని కోరడం లేదని స్పష్టం చేశారు. శబరిమల ఆలయ బాధ్యతలను ట్రావెన్‌కోర్ దేవోసం బోర్డు నిర్వహిస్తోంది. బోర్డు తాజా నిర్ణయంతో ఇక ముందు మహిళల ప్రవేశంపై పెద్దగా సమస్యలు ఉత్పన్నం కాకపోవచ్చని న్యాయనిపుణులు అంటున్నారు.

తీర్పును పక్కనబెట్టాలి: నాయర్ సర్వీస్ సొసైటీ

అన్ని వయసుల మహిళలను అనుమతించాలన్న సుప్రీం కోర్టు తీర్పును పక్కనపెట్టాలని కోర్టు ముందు నాయర్ సర్వీస్ సొసైటీ వాదనలు వినిపించింది. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా రుతుక్రమం కలిగిన స్త్రీలను గుడిలోకి అనుమతించడం లేదని, ఇది వివక్ష కిందికి రాదని సొసైటీ తరఫున సీనియర్ లాయర్ కే పరాశరన్ తెలిపారు. సెప్టెంబర్ 28 నాటి సుప్రీం తీర్పుపై మొత్తం 64 పిటిషన్లు, రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. అయ్యప్పకు కొన్ని నిబంధనలు ఉన్నాయని, ఆలయం సంప్రదాయం ప్రకారం అన్ని వయసుల మహిళలు దర్శించుకోవడం కుదరదని పలువురు పిటిషనర్ల తరఫు లాయర్లు వాదించారు. అయితే సమయం తక్కువగా ఉన్నందున కోర్టు కేవలం 8 నుంచి 9 మంది వాదనలు మాత్రమే వింది. తీర్పును రిజర్వ్‌లో పెడుతున్నట్లు ప్రకటించింది.

బోర్డుపై హిందూ సంఘాలు, ప్రతిపక్షాల ఆగ్రహం

టీడీబీ యూ టర్న్ తీసుకోవడంపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తరతరాలుగా వస్తున్న ఆలయ సంప్రదాయాన్ని బోర్డు పక్కనబెట్టిందని, కేరళ ప్రభుత్వానికి తలొగ్గే మాట మార్చిందని ఆరోపిస్తున్నాయి. గతంలో సుప్రీం తీర్పును వ్యతిరేకించిన బోర్డు.. ఇప్పుడు గౌరవిస్తున్నట్లు చెప్పడమేమిటని ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేతిలో బోర్డు కీలుబొమ్మగా మారిందని ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల ఆరోపించారు. భక్తుల మనోభావాలను, సంప్రదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గౌరవించడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధరన్ పిళ్లై దుయ్యబట్టారు. శబరిమల సంప్రదాయాన్ని, భక్తుల మనోభావాలను రక్షించుకోవడం తమ బాధ్యత అని పందళం రాయల్ ఫ్యామిలీ సభ్యుడు శశికుమార్ వర్మ అన్నారు. బోర్డు తీరును ఆయన తప్పుబట్టారు. కాగా, ఆరోపణలపై బోర్డు అధ్యక్షుడు ఎ.పద్మకుమార్ స్పందిస్తూ.. ‘బోర్డు ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గలేదు. సెప్టెంబర్ 28 నాటి సుప్రీం తీర్పుపై బోర్డు సమావేశంలో సమగ్రంగా చర్చించాం. దేవుడి సన్నిధిలో వివక్షకు తావు లేదు. అందుకే కోర్టు తీర్పును గౌరవిస్తున్నట్లు తెలిపాం’ అని అన్నారు. శబరిమల అయ్యప్ప ఆలయ సంప్రదాయాల ప్రకారం 10 నుంచి 50 ఏళ్ల లోపు వయసు మహిళలకు అనుమతి లేదు. దీనిపై గత ఏడాది సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. అన్ని వయసుల మహిళలను అనుమతించాలని స్పష్టం చేసింది. తీర్పుపై పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. హిందుత్వ సంఘాలతో పాటు బీజేపీ, కాంగ్రెస్‌కూడా వ్యతిరేకించాయి. సుప్రీం తీర్పు నేపథ్యంలో 10 నుంచి 50ఏళ్ల లోపు కొందరు మహిళలు అయ్యప్పను దర్శించుకునేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. జనవరి 2న బిందు, కనకదుర్గ అనే ఇద్దరు మహిళలు ఆలయంలోకి ప్రవేశించి అయ్యప్ప దర్శనం చేసుకున్నారు. దీంతో ఆలయాన్ని సంప్రోక్షణ కూడా చేశారు. ఆలయంలోకి వెళ్లిన ఒక మహిళపై ఆమె అత్తింటివారు దాడి చేశారు. ఈ వివాదం కాస్తా రాజకీయ వివాదంగా మారింది. దీనిపై కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ నేతలు పరస్పరం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు.



కేసు తిరిగి చేపట్టొద్దు: కేరళ సర్కార్

రివ్యూ పిటిషన్లను తాము వ్యతిరేకిస్తున్నామని కేరళ ప్రభుత్వం స్పష్టం చేసింది. రివ్యూ పిటిషన్ల రూపంలో కేసును తిరిగి చేపట్టవద్దని ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. సుప్రీం కోర్టు తీర్పును తాము మొదటి నుంచి గౌరవిస్తున్నామని, అందుకనుగుణంగానే ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రివ్యూ పిటిషన్లు కొట్టేయాలని కోరారు. ‘హిందూ సంప్రదాయం ప్రకారం మహిళలను ఆలయంలోకి ప్రవేశించకుండా ఆంక్షలు విధించాల్సిన పని లేదు. దీన్ని కోర్టు గుర్తించింది. కేవలం ఒక ఆలయ సంప్రదాయాన్ని మతాచారంగా చెప్తే చట్ట ప్రకారం చెల్లదు’ అని పేర్కొన్నారు. అయ్యప్పను దర్శించుకునేందుకు వేలాది మంది మహిళలు ఎదురుచూస్తున్నారని, సెప్టెంబర్ 28 నాటి తీర్పును యథాతథంగా అమలు చేయాలని రేష్మ, షాలినా అనే ఇద్దరు యువతులు తమ పిటిషన్‌లో కోరారు. వీరిద్దరూ ఇటీవల అయ్యప్పను దర్శించుకొనేందుకు వెళ్లి నిరసనల కారణంగా వెనుదిరిగారు. అయ్యప్పను దర్శించుకొన్న బిందు, కనక దుర్గ అనే మహిళలు కూడా పిటిషన్ దాఖలు చేశారు. గత తీర్పు మహిళల గౌరవాన్ని, సమానత్వాన్ని ప్రతిబింబించిందని, రివ్యూ పిటిషన్లను తాము వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐఎఫ్ఎస్ పరీక్షలో మనోడికి ఫస్ట్ ర్యాంక్

హైదరాబాద్, వెలుగు: ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు నిర్వహించిన పరీక్షల్లో తెలంగాణ అభ్యర్థి మందాడి నవీన్‌రెడ్డి జాతీయ స్థాయిలో టాప్ ర్యాంక్ సాధించారు. ఐఎఫ్ఎస్ తుది ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) బుధవారం విడుదల చేసింది. హైదారాబాద్‌కు చెందిన పసుపులేటి మోనిక కిషోర్ 41వ ర్యాంకు సాధించారు. మొత్తం 89 మంది ఐఎఫ్ఎస్‌కు ఎంపిక కాగా, అనంతపురానికి చెందిన సి.చైతన్యకుమార్‌రెడ్డి 42వ ర్యాంకు పొందారు.

వాద్రాను విచారించిన ఈడీ

మనీలాండరింగ్ ఆరోపణలపై ప్రశ్నలు ● ఈడీ ఆఫీసుకు వాద్రాను తీసుకెళ్లిన ప్రియాంక

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ ఆరోపణలపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్‌వాద్రాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం విచారించింది. లండన్‌లో అక్రమంగా ఆస్తులు పోగేశారనే ఆరోపణలపై నాలుగు గంటలపాటు పలు ప్రశ్నలు సంధించింది. అక్కడ తనకెలాంటి ఆస్తులు లేవని వాద్రా చెప్పినట్లు సమాచారం. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు కోర్టు తిరస్కరించడంతో వాద్రా బుధవారం ఉదయం ఈడీ విచారణకు హాజరయ్యారు. ఆర్థిక అవకతవకల ఆరోపణలపై ఆయన దర్యాప్తు సంస్థల ఎదుట హాజరవడం ఇదే తొలిసారి.



ప్రియాంక పార్టీ బాధ్యతలు స్వీకరించేందుకు వెళుతూ తన భర్తను ఈడీ ఆఫీసు ముందు డ్రాప్ చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేకే వాద్రాపై బీజేపీ కక్ష సాధింపు ధోరణికి దిగుతోందని ప్రియాంక విమర్శించారు.

బిహారీ పంచతంత్రం

మిత్రభేదాలు, మిత్రలాభాల వేదిక ● ఈసారి స్పష్టంగా సమీకరణాలు

వెలుగు బ్యూరో

బీహార్‌లో అధిపత్యం సాధించేవారికి ఢిల్లీలో పవర్ రాకపోయినా చక్రం తిప్పడానికి అవకాశం ఉంటుంది. దీంతో స్థానిక పార్టీలతో పాటు జాతీయ పార్టీలు నిలదొక్కుకోవడానికి ప్రయత్నిస్తుంటాయి. ఈసారి ఎన్నికల్లో బీహార్ లో బీజేపీ, జేడీయూ, ఎల్జేపీ కూటమిగా బరిలోకి దిగుతున్నాయి. మరోవైపు కాంగ్రెస్, ఆర్జేడీ, ఆర్ఎల్ఎస్పీ, హిందుస్థానీ అవామీ మోర్చా మరో కూటమిగా తలపడుతున్నాయి. పాత మిత్రుడు నితీశ్ కుమార్ మళ్లీ కలవడంతో 2014 విజయాన్ని నిలబెట్టుకుంటామన్న ధీమాలో బీజేపీ ఉంది.

ఒక్కోసారి ఒక్కో తీర్పు

2014 ఎన్నికల్లో బీజేపీ, ఎల్జేపీ, ఆర్ఎల్ఎస్పీ కలిసి పోటీ చేస్తే జేడీయూ, సీపీఐ జట్టుకట్టాయి. ఆర్జేడీ, కాంగ్రెస్, ఎన్సీపీ మరో కూటమిగా బరిలో నిలిచాయి. మోడీ హవాలో బీజేపీ కూటమి సత్తా చాటింది. బీజేపీ 22 స్థానాలు, ఎల్జేపీ 6, ఆర్ఎల్ఎస్పీ 3 సీట్లు సాధించాయి. మొత్తం 40 సీట్లలో 31 సీట్లు ఎన్డీయే సొంతమయ్యాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న నితీశ్, మిత్రపక్షాలు రెండే స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మూడో కూటమిలో ఆర్జేడీ 4, కాంగ్రెస్ 2, ఎన్సీపీ ఒక్క స్థానంతో పరువు నిలబెట్టుకున్నాయి. అయితే ఈసారి సమీకరణాలు మారిపోవడంతో ఆసక్తి పెరుగుతోంది. బీజేపీ, జేడీయూ చేతులు కలిపాయి. ఎల్జేపీ వీరితోనే ఉన్నా మరో మిత్రపక్షం ఆర్ఎల్ఎస్పీ దూరమైంది. ఎన్డీయేలో జేడీయూ చేరిక మోడీకి కలిసొచ్చే బలమే. అయితే దీనివల్ల బీజేపీ కొంత ఇబ్బంది కూడా ఎదుర్కొంటోంది. సీట్ల పంపకం మొదట్లో అస్సలు తెగలేదు. చివరికి అమిత్ షా స్వయంగా వెళ్లి సీట్ల వాటాను ఖరారు చేశారు. చెరో 17 సీట్లలో పోటీచేయాలని నిర్ణయించుకున్నారు. అయితే గత ఎన్నికల్లో బీజేపీ 22 ఎంపీ సీట్లు గెలిచింది. పొత్తు కోసం గెలిచిన సీట్లను కూడా వదులుకోవాల్సి వచ్చింది. ఎల్జేపీకి మిగిలిన 6 సీట్లు కేటాయించారు. మొన్నటివరకు ఎన్డీయేలో ఉన్న ఆర్ఎల్ఎస్పీ అధినేత ఉపేంద్ర కుష్వాహ సీట్ల వాటాపై అసంతృప్తితోనే దూరమయ్యారు. కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి యూపీఏలో చేరారు.

అటువారిటు, ఇటువారటు

గత ఎన్నికల్లో కాంగ్రెస్ తో జోడీ కట్టిన జేడీయూ ఇప్పుడు బీజేపీతో చేరితే కాంగ్రెస్... ఆర్జేడీ వైపు చేరింది. తర్వాత 2015 అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా జేడీయూ, ఆర్జేడీ చేతులు కలిపాయి. మహాఘటబంధన్ గా ఏర్పడి బీజేపీని ఓడించాయి. దీనివల్లే నితీశ్ మరోసారి అధికారం దక్కించుకున్నారు. రెండేళ్లకే ఈ దోస్తీకి తెరపడింది. 2017లో కూటమికి గుడ్ బై చెప్పిన నితీశ్ ఎన్డీయేలో చేరి అధికారంలో కొనసాగారు. దీంతో కాంగ్రెస్ తో కలిసి మహాఘటబంధన్ ను ఆర్జేడీ కొనసాగిస్తోంది. ఇందులో ఎన్సీపీ, లెఫ్ట్ పార్టీలు, మాజీ సీఎం జీతన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్థానీ అవామ్ మోర్చా, శరద్ యాదవ్ లోక్ తాంత్రిక్ జనతాదళ్ కూడా ఉన్నాయి. వారికి ఆర్ఎల్ఎస్పీ తోడైంది. ఎస్పీ, బీఎస్పీ కలిసే అవకాశాలున్నాయి. ఆర్జేడీకి సొంత బలంగా ఉండగా కాంగ్రెస్ కు కాస్త ఓటు బ్యాంక్ ఉంది.

ఉపఎన్నికల్లో ఆర్జేడీ పైచేయి

బీజేపీ, జేడీయూ పొత్తు తర్వాత రెండు పార్టీలకు ఉపఎన్నికలు షాక్ ఇచ్చాయి. లాలుప్రసాద్ అవినీతి కేసులో జైలుకుపోయినా ఆ పార్టీ బలం తగ్గలేదు. ఉపఎన్నికల్లో అరారియా లోక్ సభ సీటుతో పాటు జహానాబాద్ ఆర్జేడీ ఖాతాలో పడ్డాయి. భబువాలో గెలిచి బీజేపీ పరువు కాపాడుకుంది. తర్వాత జోకిహట్ అసెంబ్లీ ఉపఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నితీష్ కేబినెట్ లోని సగంమంది మంత్రులు మకాం వేసి పనిచేసినా గెలుపు దక్కలేదు.

కులమే అందరి బలం


బీహార్ లో ఎవరెన్ని ఎత్తులు, పైఎత్తులు వేసినా కులం కార్డులే ఇక్కడ గేమ్ ని ఆడిస్తాయి. రాష్ట్రంలో ఓబీసీలు, ఈబీసీలు 51 శాతం ఉన్నారు. ఇందులో ఈబీసీలు 26 శాతం ఉంటే తర్వాత యాదవులు 14 శాతం ఉంటారు. ముస్లింలు 17 శాతం, మహాదళితులు 16 శాతం, అగ్రకులాలవారు 15 శాతం జనాభా ఉన్నారు. నితీశ్ సొంతం వర్గం కుర్మీలు నాలుగు శాతం. ఆర్ఎల్ఎస్పీ అధినేత ఉపేంద్ర కుష్వాహకు చెందిన కుష్వాహ వర్గం 8 శాతం మంది ఉన్నారు. ఇక ఆదివాసీలు ఒకటిన్నర శాతం ఉన్నారు. వీరిలో అగ్రకులాలు, కుర్మీలుగా తమకు అండగా ఉంటారని జేడీయూ, బీజేపీ నేతలు నమ్ముతున్నారు. అటు యాదవులు, మైనారిటీలు తమతో ఉంటారని ఆర్జేడీ కూటమి నేతలు నమ్ముతున్నారు. జితిన్ మాంఝీ ఉండడం వల్ల దళితులు, కుష్వాహ రాకతో ఆ వర్గం అండ దొరికిందంటున్నారు.



పాత మిత్రుడే పాత శత్రువు



బీహార్ రాజకీయం ఐదేళ్లలో ఊహించని మలుపులు తిరుగుతూ వచ్చింది. 2013లో మోడీ బీజేపీ ప్రధాని అభ్యర్థి కావడాన్ని వ్యతిరేకిస్తూ నితీశ్ ఎన్డీయే నుంచి బయటికొచ్చారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో మోడీ హవా ముందు బీహార్ లో జేడీయూ, ఇతర విపక్షాలు కొట్టుకుపోయాయి. లోక్ సభ ఎన్నికల్లో ఓటమికి నైతిక బాధ్యతగా సీఎం పదవికి నితీశ్ రాజీనామా చేసి తన అనుచరుడు జితిన్ రామ్ మాంఝీని పెట్టారు. ఎనిమిది నెలల తర్వాత నితీశ్ మళ్లీ సీఎం కావాలనుకున్నా రాజీనామా చేయడానికి మాంఝీ ఒప్పుకోలేదు. బీజేపీ అండ ఉన్నా చివరికి బలనిరూపణకు ముందే రాజీనామా చేశారు. ఆర్జేడీ, కాంగ్రెస్ మద్దతుతో నితీశ్ మళ్లీ సీఎం అయ్యారు. 2015 అసెంబ్లీ ఎన్నికల నాటికి నితీశ్ ఒంటరిగా పోతే బీజేపీ గెలుస్తుందని సర్వేలు అంచనా వేశాయి. దీంతో చిరకాల శత్రువైన లాలుతో దోస్తీకి సిద్ధపడ్డారు నితీశ్. బీజేపీని ఓడించడం ఆర్జేడీకి, కాంగ్రెస్ కు కూడా అవసరమే. అలా మహాఘటబంధన్ ఏర్పాటైంది. సీఎం నితీశేనని లాలుతోనే చెప్పించారు. ఇద్దరితో సోనియా కూడా ప్రచారం చేశారు. మోడీ కూడా బీహార్ పై వరాలు కురిపించారు. ఏకంగా లక్షా 65వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించారు. అయినా బీహారీలు లాలు, నితీశ్ జోడీకి జైకొట్టారు. 243 స్థానాల్లో ఆర్జేడీ 80, జేడీయూ 71, కాంగ్రెస్ 27 సీట్లు గెలుచుకున్నాయి. ఆర్జేడీకే ఎక్కువ సీట్లు వచ్చినా మాట ప్రకారం నితీశ్ నే సీఎం పీఠంపై కూర్చోబెట్టారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీహార్ లోనే మోడీకి రెండో ఎదురుదెబ్బ తగిలింది. కేబినెట్ లో లాలూ చిన్న కొడుకు తేజస్వియాదవ్ డిప్యూటీ సీఎంగా, పెద్ద కొడుకు తేజ్ ప్రతాప్ యాదవ్ మంత్రిగా చేరారు. 20 నెలల తర్వాత లాలు కుటుంబంపై అవినీతి ఆరోపణలు రావడంపై నితీశ్ వివరణ అడగడం దుమారం రేపింది. మాటామాటా పెరిగి లాలు కుటుంబంతో వేగలేనంటూ సీఎం పదవికి నితీశ్ రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థి అయిన బీజేపీతోనే చేతులు కలిపారు. కమలం మద్దతుతో మళ్లీ సీఎం అయ్యారు. సొంత పార్టీ నేత శరద్ యాదవ్ వ్యతిరేకించినా ఆయన్నే పార్టీ నుంచి బహిష్కరించారు. శరద్ రాజ్యసభ సభ్యత్వంపైనా వేటు వేయించారు. తన క్లీన్ ఇమేజ్ ను కాపాడుకోవడం, మోడీ హవా, ఇంకో దిక్కు లాలూపై కేసులు తనకు ఇబ్బంది కాకుండా నితీశ్ అడుగులు వేసినట్లు భావిస్తున్నారు. బీజేపీతో కలిస్తే కేంద్రసాయంతో పాటు పార్టీకి పదవులు కూడా వస్తాయని భావించారు. అలా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పదవిని పార్టీ నేతకు ఇప్పించారు. లోక్ సభ ఎన్నికలే లక్ష్యంగా స్కీములు, శంకుస్థాపనలతో రాష్ట్రాన్ని చుట్టేస్తున్నారు నితీశ్. అయితే ముజఫర్ పూర్ బాలికల షెల్టర్ లో లైంగిక వేధింపుల కేసు ఆయన్ను ఇరకాటంలో పెట్టింది. ఈ కేసులో సూత్రధారితో రాష్ట్ర మంత్రి మంజువర్మ భర్తకు సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలతో ఆమె రాజీనామా చేశారు. ఈ కేసు నితీశ్ సర్కారును ఇప్పటికీ వెంటాడుతోంది.



2014 బీహార్ లోక్ సభ బలాబలాలు (40)

బీజేపీ	ఎల్జేపీ	ఆర్ఎల్ఎస్పీ	జేడీయూ	ఆర్జేడీ	ఎన్సీపీ	కాంగ్రెస్
22	06	03	02	04	01	02

2015 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు (243)

జేడీయూ	ఆర్జేడీ	బీజేపీ	కాంగ్రెస్
72	80	48	26

తేజస్వి సన్నాఫ్ లాలు

ప్రతిపక్షంలో లాలుప్రసాద్ కుటుంబానికి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. దాణా స్కాం కేసుల్లో ఆయనకు శిక్షలు ఖరారు కావడంతో జైల్లో ఉంటున్నారు. దీనికి తోడు ఆయన కూతురు, రాజ్యసభ ఎంపీ మీసాభారతిపై ఈడీ కేసులు నమోదయ్యాయి. ఆమె కూడా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పుడు ఇద్దరు కొడుకులే పార్టీని నడిపిస్తున్నారు. చిన్న కొడుకు తేజస్వినే పార్టీకి పెద్దదిక్కుగా మారారు. లాలు బాటలోనే పార్టీని బలంగా నడిపిస్తున్నారు. ఉపఎన్నికల్లో వరుస విజయాలతో సత్తా చాటుకున్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే తమ కుటుంబాన్ని టార్గెట్ చేశారని తేజస్వి ప్రచారం చేస్తున్నారు. సీఎం నితీశ్ కు గట్టి సవాలు విసురుతున్నారు. ఇటు రాష్ట్ర రాజకీయాలతో పాటు అటు జాతీయ రాజకీయాల్లోనూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. కర్నాటక సీఎంగా కుమారస్వామి ప్రమాణానికి హాజరయ్యారు. మూడేళ్ల కింద వరకు ఆయనెవరో పెద్దగా తెలియదు. లాలు కొడుకుగా, రంజీ క్రికెటర్ గా కొంతమందికి మాత్రమే తెలుసు. 2015 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏకంగా డిప్యూటీ సీఎం అయ్యి అందరినీ ఆకర్షించారు. కటిఫ్ తర్వాత కుటుంబాన్ని, పార్టీని సంక్షోభం చుట్టుముట్టిన సమయంలో పార్టీ బాధ్యతలను తలకెత్తుకున్నారు. రాజకీయ అనుభవం లేకపోయినా సమర్థుడిగా పేరుతెచ్చుకున్నారు. లాలు అందుబాటులో లేకపోయినా పార్టీని నడిపించే నేత ఉన్నాడన్న ధీమాను పార్టీ కేడర్ కు ఇచ్చారు. రాష్ట్రంలో బీజేపీయేతర పార్టీలకూ ఇప్పుడు ఆయనే ఆశాకిరణం. పెద్దగా చదువుకోకపోయినా ధాటి ప్రసంగాలతో తేజస్వి జనాన్ని ఆకట్టుకుంటున్నారు. జేడీయూ, బీజేపీ సర్కారుపై విరుచుకుపడుతున్నారు. ముజఫర్ పూర్ కేసుపై ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ఆయన చేపట్టిన ధర్నాలో రాహుల్ సహా విపక్ష నేతలంతా పాల్గొన్నారు. నితీశ్ నమ్మించి మోసం చేశారని చాచా ఫట్లు అంటూ సెటైర్లు ప్రచారం చేస్తున్నారు. ఇవన్నీ జనంలో లాలు కుటుంబంపై సానుభూతి పెంచుతున్నట్లు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ మాత్రం భవిష్యత్ లో నితీశ్ తో పని ఉండొచ్చన్న అంచనాతో ఆచితూచి విమర్శలు చేస్తోంది.



పల్లె సల్లగుండాలె





బుధవారం ప్రగతి భవన్‌లో రిసోర్స్ పర్సన్లతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

టీచర్‌గా మారిన కేసీఆర్

రిసోర్స్‌పర్సన్లకు కర్తవ్యాన్ని బోధించిన సీఎం ■ పద్యాలు, శ్లోకాలు, చలోక్తులు

- భోజన సమయంలో ఆత్మీయ పలకరింపులు
- రిసోర్స్ పర్సన్ల ఆనందం

హైదరాబాద్, వెలుగు: ‘అన గననగ రాగ మతిశయిల్లుచునుండు.. తిన గతినగ వేము తియ్యనుండు’.. ‘నయమున బ్రాలున్ ద్రావరు, భయమునను విషమ్మునైనా భక్షింతురుగా..’ వంటి వేమన, సుమతి శతక పద్యాలతో, ‘ఆరంభింపరు నీచ మానవులు విఘ్నా యాస సంత్రస్తులై’ వంటి సుభాషితాలతో సీఎం కేసీఆర్ రిసోర్స్ పర్సన్లకు కర్తవ్యబోధ చేశారు. ఒక టీచర్ లా వారికి పంచాయతీ వ్యవస్థపై సమగ్ర అవగాహన కల్పించారు. జిల్లాల్లో సర్పంచ్‌లకు, గ్రామ కార్యదర్శులకు ఎలా శిక్షణ ఇవ్వాలో సూచించారు. బుధవారం ప్రగతి భవన్‌లో జరిగిన రిసోర్స్ పర్సన్ల సమావేశంలో సుమారు ఆరుగంటల పాటు సీఎం ప్రసంగించారు. అందులో ఓ గంటపాటు అనుమానాలను నివృత్తి చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి స్వాగతోపన్యాసంతో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. మధ్యహ్నం 2 గంటల వరకు మొదటి విడత సమావేశం జరిగింది. అనంతరం గంటపాటు భోజన విరామం ఇచ్చారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 వరకు కొనసాగింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ సమావేశాన్ని మొత్తం సీఎం కేసీఆర్ ఒంటి చేత్తో నడిపించారు. గంటల కొద్ది నిలబడి ఆయనే ప్రసంగించారు. సందర్భోచితంగా పద్యాలు, శ్లోకాలు వినిపిస్తూ మాట్లాడారు. స్ఫూర్తిదాయకమైన వ్యక్తుల గురించి చెప్పి ఉత్సాహపరిచారు. ఛలోక్తులు విసురుతూ నవ్వులు పూయించారు. సీఎంతో భేటీ తమకు జీవితంలో ఎన్నడూ మరిచిపోలేని అనుభూతి అని పలువురు రిసోర్స్ పర్సన్లు ఆనందం వెలిబుచ్చారు.

పద్యాలు.. కర్తవ్యాలు

‘అనగననగ రాగ మతిశయిల్లుచునుండు’ అనే వేమన పద్యం వినిపించి గ్రామాల్లో సంస్కరణల అమలు నిరంతర ప్రక్రియగా సాగాలని, ఇలా కొంత కాలం చేస్తే ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అది అలవాటుగా మారుతుందని సీఎం తెలిపారు. ‘నయమున బ్రాలున్ ద్రావరు, భయమునను విషమ్మునైనా భక్షింతురుగా’ అంటూ సుమతి శతకం పద్యాన్ని సోదాహరణగా చెబుతూ విధి నిర్వహణలో అవినీతికి, నిర్లక్ష్యానికి పాల్పడితే చర్యలు తప్పవన్నారు. భయం ఉంటేనే బాగా పని చేస్తారని, పాలన కూడా పాదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. భగవద్గీతలోని ‘జాతస్యహి మరణం ధృవం’ అనే శ్లోకాన్ని చదివి ‘పుట్టిన వారు గిట్టక మానరు. కాబట్టి చనిపోయిన తర్వాత కూడా వారికి మర్యాదగా, గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించాలి. అది మన సంప్రదాయం. దీనికోసం అన్ని వసతులున్న శ్మశాన వాటికలు నిర్మించాలి’ అని సూచించారు. ‘బతికినంత కాలం కులం పేరిట, మతం పేరిట కొట్టుకు చచ్చినం, చనిపోయిన తర్వాతనైనా ఒకే దగ్గర అంత్యక్రియలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి’ అని అన్నారు. ‘ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై’ అనే ఏనుగు లక్ష్మణకవి సుభాషితం ఆయన వినిపిస్తూ.. గ్రామాల వికాసానికి మంచి సంకల్పంతో నడుం బిగించాలని, తెలంగాణ ఉద్యమం నాటి స్ఫూర్తితో సాగాలని పిలుపునిచ్చారు.

మంత్రముగ్ధులైన అధికారులు

రిసోర్స్ పర్సన్లుగా ఎంపికైన ఎంపీడీవోలు, ఎన్జీవో ప్రతినిధులు, ఇతర అధికారులు, కొందరు సర్పంచ్‌లు సమావేశంలో పాల్గొన్నారు. బడిలో విద్యార్థులకు పాఠాలు చెప్పే గురువులా సీఎం తమకు అన్ని అంశాలపై అవగాహన కల్పించారని వాళ్లు అన్నారు. సాధారణంగా ఎంపీడీవోలు జిల్లా కలెక్టర్‌తోనే ఎక్కువ సమావేశాలకు హాజరవుతుంటారు. ముఖ్య కార్యదర్శి తో చాలా అరుదుగా సమావేశమవుతుంటారు. అలాంటిది సాక్షాత్తూ సీఎం కేసీఆర్ తమ కోసం ఒక రోజంతా కేటాయించటం, అడిగిన సందేహాలకు సమాధానాలు ఇవ్వటం, భోజనాలు చేసే సమయంలో ఆత్మీయంగా పలకరించటం పట్ల వారంతా హర్షం వ్యక్తం చేశారు.

స్ఫూర్తిప్రదాతల గాథలు

రిసోర్స్ పర్సన్లకు లోతైన అవగాహన, స్ఫూర్తి కలిగించే దిశలో కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన స్ఫూర్తిప్రదాతల గాథలు వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో వారు సాధించిన విజయాలు, అవి దేశానికి ఉపయోగపడిన విధానాన్ని అభివర్ణించారు. నెహ్రూ ప్రభుత్వంలో మొదటి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ మంత్రి ఎస్.కె. డే పంచాయతీ రాజ్ ఉద్యమానికి పురుడు పోసిన విధానాన్ని తెలిపారు. ఆయన సలహాలు, సూచనల మేరకే నాటి ప్రధాని నెహ్రూ నీటి పారుదల నిర్మాణానికి, వ్యవసాయ రంగాభివృద్ధికి చర్యలు తీసుకున్నారన్నారు. గ్రామాల వికాసం కోసం నాడు ఎస్.కె. డే హైదరాబాద్ లో నెలకొల్పిన ఎన్ఐఆర్‌డీ గురించి వివరించారు. ఎస్.కె.డే చొరవతోనే షాద్ నగర్, పటాన్ చెరు బ్లాకులు ఏర్పడ్డాయన్నారు. కొంకణ్ ప్రాంతంలో ప్రజలను చైతన్య పరిచి, ఎత్తు పల్లాలుండే భూభాగంలో వ్యవసాయం ఎలా చేయాలో చేసి చూపించిన బండార్కర్ గురించి పరిచయం చేశారు. మహారాష్ట్రలోని వన్రాయ్ సొసైటీ స్వచ్ఛందంగా గ్రామాల్లో వైకుంఠ ధామాలు నిర్మించి, చేసిన సేవను వివరించారు. కూసం రాజమౌళి కృషి వల్ల వరంగల్ జిల్లా గంగదేవిపల్లి ప్రపంచానికే ఎలా ఆదర్శ గ్రామమైందో తెలిపారు. మహిళల సాధికారితకు నిజామాబాద్ జిల్లా అంకాపూర్ ఉదాహరణ అన్నారు. గ్రామాల స్వయం సమృద్ధికి, లాభదాయక వ్యవసాయానికి రోల్ మోడల్ అని చెప్పారు. దోమలు లేకుండా పరిసరాలను ఎలా కాపాడుకోవచ్చో హైదరాబాద్ శివారు ప్రగతి రిసార్ట్స్ చేసి చూపించిందన్నారు. వాటిని సందర్శించాలని సూచించారు.



భోజన సమయంలో రిసోర్స్ పర్సన్లతో ముచ్చటిస్తున్న సీఎం కేసీఆర్



గ్రామ పెద్దలు కుర్చీల్లో కూర్చోగా కింద గోడకు ఆనుకుని కూర్చున్న సర్పంచ్ బాలప్ప (ఫైల్)

మహబూబ్‌నగర్ ఘటనపై సీఎం సీరియస్

హైదరాబాద్, వెలుగు: మహబూబ్ నగర్ జిల్లా మద్దూర్ మండలం పెదిరిపాడు సర్పంచ్ బాలప్పను గ్రామ పెద్దలు కింద కూర్చోబెట్టిన ఘటనను సీఎం కేసీఆర్ తీవ్రంగా ఖండించారు. ఈ ఉదంతం మంగళవారం ‘వెలుగు’లో ప్రచురితం కావడం తెలిసిందే. దీనికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ‘‘ఇది చాలా సీరియస్ అంశం. భవిష్యత్ లో ఇలాంటివి పునరావృతమైతే సహించేది లేదు’’ అని ఆగ్రహించారు.

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం పురోభివృద్ధి సాధిస్తాయని, పల్లెల వేదికగానే ప్రగతి ప్రణాళికలు అమలు కావాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. సర్పంచులు, కార్యదర్శులు ఈ పనులపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలన్నారు. విధుల నిర్వహణ విషయంలో దుర్వినియోగానికి పాల్పడినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా తగు చర్యలు తీసుకునే విధంగా కఠిన చట్టాన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు. రిసోర్స్ పర్సన్లు జిల్లాల్లో నిర్వ హించే శిక్షణలో సర్పంచులు, కార్యదర్శులకు తమ విధులు, బాధ్యతలు తెలిసేలా విడమర్చి చెప్పాలన్నారు. గ్రామ సమగ్ర స్వరూపాన్ని మార్చేలా, ఆధునిక తెలంగాణను తీర్చిదిద్దేలా సర్పంచులు, కార్యదర్శులను చేంజ్ ఏజెంట్లుగా మార్చాలని, అందుకు రిసోర్స్ పర్సన్లు మెంటర్లుగా వ్యవహరించాలని సూ చించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, లోపాలు, సమస్యలపై సమీక్షించేందుకు ప్రతి ఆరు నెలలకొకసారి రిసోర్స్ పర్సన్లతో సమావేశమవుతానని సీఎం ప్రకటించారు.

పుష్కలంగా నిధులు

గ్రామాల అభివృద్ధికి నిధులు పుష్కలంగా ఉన్నాయని సీఎం వివరించారు. 14వ ఆర్థిక సంఘం ద్వారా రూ. 1628 కోట్ల నిధులు విడుదలయ్యాయని, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ద్వారా మరో రూ. 1628 కోట్లు విడుదల చేశామన్నారు. దీంతో మొత్తం నిధులు రూ.3256 కోట్లకు చేరాయని తెలిపారు. 500 జనాభా ఉన్న గ్రామానికి సగటున రూ. 8 లక్షల నిధులు అందుతాయన్నారు. జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలకు నిధులు పెరుగుతాయని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 3500 కోట్లు వస్తాయని, కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిధులు అన్నీ కలిపి రూ. 7236 కోట్లు అవుతాయని సీఎం వివరించారు. వీటితో పాటు రాష్ట్ర బడ్జెట్‌లో కూడా నిధులు కేటాయిస్తామన్నారు. అన్ని నిధులు గ్రామాల అభివృద్ధికి ఖర్చు పెట్టాలని సూచించారు. వచ్చే ఐదేళ్లలో రూ. 40 వేల కోట్ల నుంచి రూ. 45 వేల కోట్ల నిధులు రానున్నాయని, వీటితో అద్భుతంగా పల్లెలను అభివృద్ధి చేయొచ్చన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ కింద కంపెనీలు కూడా విరాళాలు ఇస్తాయని, స్వచ్ఛందంగా కొంత మంది ముందుకొచ్చి నిధులు ప్రకటిస్తారని, కొందరు శ్రమదానంలో పాల్గొంటారని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పంచాయతీల్లో 100 శాతం పన్నులు వసూలు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. అలా చేయని పక్షంలో గ్రామ కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ లు పంచాయతీలోనే నివాసం ఉంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామ అవసరాలను, సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆయన సూచించారు. గ్రామ సభను విధిగా రెండు నెలలకు ఒకసారి నిర్వహించాలని, పంచాయతీ సమావేశాన్ని నెలకు ఒకసారి చేపట్టాలన్నారు. గ్రామ రికార్డులను సరైన పద్ధతిలో నిర్వహించాలని తెలిపారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వీధి లైట్ల నిర్వహణ, మరమ్మతులు, వివాహాల నమోదు రిజిస్టర్ పాటించాలన్నారు. కొత్త పంచాయతీల్లో ఆస్తుల మ్యుటేషన్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

ప్రతి ఇంటికి ఆరు మొక్కలు

పల్లెల్లో ప్రతి ఇంటికి ఆరు మొక్కలకు తగ్గకుండా పంపిణీ చేయాలని సీఎం కేసీఆర్ సూచించారు. ఆ మొక్కలు పెరిగి పెద్దవయ్యే వరకు రక్షించాలన్నారు. పల్లెల్లో పచ్చదనం పెంపుదల బాధ్యత పంచాయతీలదేనన్నారు. ప్రతి ఊళ్లో నర్సరీ తప్పనిసరి అన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే రూ. 500 జరిమానా

‘పల్లెల్లో వీధులన్నీ అద్దాల మాదిరిగా మెరవాలి. ఎట్టి పరిస్థితుల్లో రోడ్లపై చెత్త కనిపించొద్దు. ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తే రూ. 500 తగ్గకుండా జరిమానా విధించాలి’ అని సీఎం ఆదేశించారు. పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇంటి నుంచి చెత్తను సేకరించడానికి ట్రైసైకిల్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎండిపోయిన బోర్లను అందుబాటులోకి తెస్తామని, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో ఉన్న కలుపు మొక్కలను తొలగించాలని ఆదేశించారు.

కూసం రాజమౌళిపై ప్రశంసలు

జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు గెలుచుకున్న వరంగల్ జిల్లా గంగిదేవిపల్లి మాజీ సర్పంచ్ కూసం రాజమౌళిని వేదిక మీదకు సీఎం ఆహ్వానించారు. సభకు ఆయన్ను పరిచయం చేశారు. సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చే రిసోర్స్ పర్సన్ గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ నాయకుడని కొనియాడారు. రాజమౌళి ని ఆదర్శంగా తీసుకొని గ్రామ జ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించానని సీఎం గుర్తు చేశారు.

టీఆర్ఎస్‌కు 14, కాంగ్రెస్‌కు 02



రాష్ట్రంలో 'లోక్‌సభ' ఫలితాలపై వీడీపీ అసోసియేట్స్ అంచనా

ఏపీలో వైఎస్సార్సీపీకి 21, టీడీపీకి 4 సీట్లు

హైదరాబాద్, వెలుగు

రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో టీఆర్ఎస్ 14 సీట్లను కైవసం చేసుకుంటుందని వీడీపీ అసోసియేట్స్ సంస్థ తాజా సర్వేలో వెల్లడైంది. కాంగ్రెస్ పార్టీ రెండు చోట్ల, మజ్లిస్ పార్టీ ఒక స్థానంలో విజయం సాధిస్తాయని పేర్కొంది. వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే పరిస్థితి ఏమిటన్న కోణంలో ఈ సంస్థ సర్వే నిర్వహించింది. ఆ ఫలితాలను బుధవారం ట్విటర్‌లో పోస్టు చేసింది. తెలంగాణలో బీజేపీ తన సిట్టింగ్ సీటైన సికింద్రాబాద్‌ను కోల్పోతుందని తెలిపింది. టీఆర్ఎస్‌కు 42.85శాతం, కాంగ్రెస్‌కు 34.2శాతం, బీజేపీకి 12.10శాతం, మజ్లిస్‌కు 4శాతం, ఇతరులకు 6.85శాతం ఓట్లు వస్తాయని వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లో అధికార టీడీపీకి గట్టి దెబ్బ తగలనుందని అంచనా వేసింది. అక్కడి మొత్తం 25 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ 4 చోట్ల మాత్రమే గెలుస్తుందని, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 21 స్థానాలను కైవసం చేసుకుంటుందని వీడీపీ అసోసియేట్స్ తన సర్వేలో తేల్చింది. వైఎస్సార్సీపీకి 45శాతం, టీడీపీకి 37.20శాతం, బీజేపీకి 7.13శాతం, జనసేనకు 5.90శాతం, కాంగ్రెస్‌కు 2.20శాతం, సీపీఎంకు 0.24శాతం, సీపీఐకి 0.20శాతం, ఇతరులకు 2.13శాతం ఓట్లు వస్తాయని వివరించింది.

బెంగాల్‌లో బీజేపీకి 15 సీట్లు

పశ్చిమ బెంగాల్‌లో అధికార టీఎంసీకి 27, బీజేపీకి 15 సీట్లు వస్తాయని వీడీపీ అసోసియేట్స్ సర్వేలో తేలింది. అక్కడ మొత్తం 42 లోక్‌సభ స్థానాలు ఉండగా.. 2014 ఎన్నికల్లో టీఎంసీ 34 చోట్ల, బీజేపీ 2 చోట్ల గెలిచింది. సీబీఐ ఎపిసోడ్‌తో బీజేపీకి లాభం చేకూరనుందని తాజా సర్వేను బట్టి తెలుస్తోంది.

జయరాం హత్యకేసు తెలంగాణకు బదిలీ

అమరావతి, వెలుగు: కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ చిగురుపాటి జయరాం హత్యకేసు తెలంగాణకు బదిలీ అయింది. ఈ కేసులో వ్యవహారాలన్నీ తెలంగాణతో ముడిపడి ఉండడంతోనే జయరామ్ కేసును రాష్ట్రానికి బదిలీ చేస్తున్నట్లు ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ బుధవారం మీడియాతో చెప్పారు. "చిగురుపాటి జయరామ్ హత్యకేసును తెలంగాణకు బదిలీ చేస్తున్నాం. న్యాయపరమైన అనుమతులు రాగానే కేసు బదిలీ అవుతుంది"అని డీజీపీ అన్నారు. విచారణలో తెలంగాణ పోలీసుల ప్రమేయం ఉండడం, పద్మశ్రీ ఆరోపణల నేపథ్యంలో కేసును బదిలీ చేయకుండా మరిన్ని వివాదాలకు తావు ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ పోలీసులు ఈ కేసును విచారించాలంటూ పద్మశ్రీ మంగళవారం మీడియాతో చెప్పిన విషయం తెలిసిందే.

ట్విట్టర్‌లోకి మాయావతి

హైదరాబాద్, వెలుగు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ బహుజన్ సమాజ్‌పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి కొత్త నిర్ణయం తీసుకున్నారు. ప్రముఖ సోషల్ మీడియా వేదిక ట్విట్టర్‌లోకి అడుగుపెట్టారు. ప్రజలు, మీడియాకు చేరువయ్యేందుకు మాయావతి ట్విట్టర్‌లో చేరారని, @SushriMayawati ద్వారా అందుబాటులో ఉంటారని పార్టీ కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. దేశంలోని ప్రముఖ సమస్యలు, జాతీయ రాజకీయాలపై తన ఆలోచనలు పంచుకుంటారంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీతో బీఎస్పీ పొత్తు పెట్టుకున్న విషయం తెలిసిందే. ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌కు ట్విట్టర్‌లో 89 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు.

మిడ్ మానేరు టు గౌరవెల్లి

- **1.50 లక్షల ఎకరాలకు కాళేశ్వరం నీళ్లు**
- **ప్రజాప్రతినిధులు, ఇంజినీర్ల సమావేశంలో నిర్ణయం**

హైదరాబాద్, వెలుగు: వచ్చే వానాకాలంలో కాళేశ్వరం నీటిని గౌరవెల్లికి తరలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మిడ్ మానేరు నుంచి గౌరవెల్లి రిజర్వాయర్‌కు పైన 70వేల ఎకరాలు, గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ల కింద మరో 80వేల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలని నిర్ణయించింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద కాలువలో భాగంగా నిర్మిస్తున్న మిడ్‌మానేరు, మోతె, నారాయణపూర్, తోటపల్లి, గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లను జూన్ నెలాఖరుకు పూర్తి చేయాలని బుధవారం నిర్వహించిన ప్రజాప్రతినిధులు, ఇంజినీర్ల సమావేశంలో నిర్ణయం జరిగింది. మిడ్ మానేరుకు నిత్యం చేరే రెండు టీఎంసీల్లో ఒక టీఎంసీని రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీకి, ఇంకో టీఎంసీని మానేరు నది ద్వారా ఎల్ఎండీకి, గ్రావిటీ కెనాల్ ద్వారా గౌరవెల్లికి తరలించనున్నారు. ఎస్సారెస్పీపై భారాన్ని తగ్గించేందుకు తలపెట్టిన ఈ లింక్‌ను వీలైనంత త్వరగా పూర్తిచేసి ఆయకట్టుకు నీరందించే చర్యలకు శ్రీకారం చుట్టారు. చొప్పదండి నియోజకవర్గంలో మోతె, నారాయణపూర్ రిజర్వాయర్లకు కొత్తగా టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాలని నిర్ణయించారు. ఈ రెండు రిజర్వాయర్లకు సంబంధించిన భూ సేకరణ సమస్యను తాము పరిష్కరిస్తామని కరీంనగర్ ఎంపీ బి.వినోద్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. భూసేకరణ వేగంగా పూర్తిచేసి పనులు ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించారు.

ప్రేమించలేదని 15 కత్తి వేట్లు

(మొదటిపేజీ తరువాయి)

వేధించేవాడు. ప్రతిరోజూ ఇంటి నుంచి కాలేజ్ వరకు వెంటపడి వేధించేవాడు. వేధింపులు ఎక్కువ కావడంతో బాలిక కుటుంబ సభ్యులు గత నెలలో షీటీమ్స్‌కు ఫిర్యాదు చేశారు. సైఫాబాద్‌లోని భరోసా సెంటర్‌లో భరత్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా అతడిలో మార్పు రాకపోగా బాలికపై కక్ష పెంచుకున్నాడు. దాడికి ప్లాన్ చేశాడు. రెండు రోజుల క్రితం బాలిక తల్లికి ఫోన్ చేసి అమ్మాయిని చంపుతానని బెదిరించినట్టు తెలిసింది.

పక్కా ప్లాన్ ప్రకారమే..


బుధవారం ఉదయం 8.45 ప్రాంతంలో ఆమె కాలేజ్‌కు బయలుదేరగానే.. భరత్ తనను ప్రేమించాలంటూ వెంటపడ్డాడు. అంగీకరించకపోవడంతో వెంట తెచ్చుకున్న కొబ్బరి బొండాల కత్తితో దాడి చేశాడు. తొలుత మెడపై.. ఆ తర్వాత వీపు, తల.. అడ్డుకునేందుకు యత్నించిన బాధితురాలి చేతులపైనా వేటు వేశాడు. ఎడమ చేతి వేలు తెగిపోవడంతోపాటు తల భాగంలోని నరాలు చిట్లాయి. దీంతో తీవ్రంగా రక్తస్రావం అయ్యింది. ప్రాణాలు కాపాడుకునేందుకు కేకలు వేస్తూ ఓ ఇంట్లోకి వెళ్లినా అతడు ఆమెను వెంటాడి మరీ నరికాడు. అడ్డుకునేందుకు అక్కడున్న వారెవరూ ప్రయత్నించలేదు. అరుపులు విన్న బాలిక పిన్ని, చెల్లి అక్కడికి వచ్చేసరికి ఆమె రక్తపుమడుగులో పడి ఉంది. అపస్మారకస్థితిలో ఉన్న బాలికను ఆమె బాబాయ్ మలక్‌పేటలోని యశోద ఆస్పత్రికి తరలించారు.

పరిస్థితి విషమం

బాధితురాలి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి డాక్టర్లు ట్రీట్‌మెంట్ చేస్తున్నారు. చాలా చోట్ల లోపలి కండ దెబ్బతినడంతో రక్తం చాలా పోయి బీపీ లెవల్స్ పూర్తిగా పడిపోయాయి. దీంతో కోమాలోకి వెళ్లకుండా చికిత్స అందిస్తున్నారు. తలకు వెనుక భాగంలో కత్తి గాటుతో తలలోని బోన్స్ పగిలి మెదడుకు తగిలే అవకాశం ఉందని, అది ప్రాణాలకే ప్రమాదమని డాక్టర్లు చెబుతున్నారు. మరో 48 నుంచి 72 గంటలు దాటితే కానీ ఏమీ చెప్పలేమన్నారు. బీపీ కంట్రోల్ అయ్యాక అవసరమైతే ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. బాధితురాలి మెడ, వీపు, తల, చేతులపై 15 కత్తి పోట్లు గుర్తించామన్నారు. కాగా, భరత్‌ను బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఈస్ట్‌జోన్‌డీసీపీ రమేశ్ రెడ్డి చెప్పారు. అతడిపై ఐపీసీ సెక్షన్ 307తోపాటు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు.

ఎలుకలో చుంచు కిడ్నీలు పెంచారు

- **మనుషుల అవయవాల పెంపుపై కొత్త ఆశలు**
- **ఎద్దు, ఒంటె, ఆవులు అనువైనవని భావిస్తున్న సైంటిస్టులు**



ఒక్క ప్రయోగం మానవాళి భవిష్యత్‌పై కొత్త ఆశలు మొలకెత్తించింది. అవయవ దానం దొరకక చావు తప్ప మరే గత్యంతరం లేదనుకున్న వారినీ బతికించే అవకాశం ఉన్న ఒకే ఒక్క దారది. ఆ వైపుగా తొలి అడుగుపడింది. తొలిసారిగా చుంచు కిడ్నీలను, ఎలుకలో పెంచి జపాన్‌లోని నేషనల్ ఫిజియోలాజికల్ సైన్సెస్ ఇనిస్టిట్యూట్ (ఎన్పీఎస్ఐ) సైంటిస్టులు చరిత్ర సృష్టించారు. ఇలానే మనుషుల అవయవాలను, ఇతర జీవుల్లో పెంచి అవసరమైనప్పుడు ట్రాన్స్ ప్లాంటేషన్ చేయాలనేది దీని వెనుకున్న అసలైన ఉద్దేశం. ఏళ్లుగా సాగిస్తున్న పరిశోధనలో కీలక ఘట్టాన్ని అధిగమించామంటూ బుధవారం సైంటిస్టులు చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా హర్షాతిరేకాలు రేకెత్తించింది. తొలుత ఓ చుంచులోని ప్లూరిపొటెంట్ (ఏ అవయవంగానైనా రూపాంతరం చెందగలదు) కణజాలాన్ని సేకరించిన సైంటిస్టులు దాన్ని గర్భంతో ఉన్న ఎలుక పిండంలోకి జొప్పించారు. అంతకుముందు ఎలుక పిండంలో తయారవుతున్న కిడ్నీ కణాలను జీన్ ఎడిట్ చేసి తొలగించారు. కొన్నాళ్లకు ఎలుక పిండం, చుంచు కణజాలాన్ని తనలో కలిపేసుకుంది. ఆ తర్వాత మెల్లగా ఎలుకలో లోపించిన కిడ్నీలుగా దాన్ని రూపాంతరం చెందించింది. ఎలుక పొట్టలో కిడ్నీ ఎదుగుదలను సైంటిస్టులు ప్రతి రోజూ గమనిస్తూ వచ్చారు. పక్క ఫొటోలో ఉన్నది ఎలుక పిండంలో పూర్తిగా ఎదిగిన చుంచు కిడ్నీలే.

పుట్టగానే చచ్చిపోయిన ఎలుక పిల్ల


గర్భంలో బాగా ఎదిగిన పిండానికి ఎలుక జన్మనిచ్చిందని సైంటిస్టులు వెల్లడించారు. అయితే కొద్ది నిమిషాల్లోనే అది చనిపోయిందని చెప్పారు. చుంచు కిడ్నీ వల్లే ఇలా జరిగిందా అనే కోణంలో అన్ని రకాలు పరీక్షించామన్నారు. కిడ్నీలు మూత్ర వ్యవస్థతోనూ, దాని ట్యూబులతోనూ సరిగా అమరి ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. చివరికి తల్లి పాలు తాగకపోవడంతోనే అది చనిపోయిందని నిర్ధారణకు వచ్చినట్లు వెల్లడించారు. తల్లి ఎలుకలో ఉన్నప్పుడు పిండాన్ని జీన్ ఎడిట్ చేసే క్రమంలో 'వాసన'ను పసిగట్టే కణాలు కూడా తొలగిపోయాయని తెలిపారు. అందుకే అది తల్లిని గుర్తించి పాలు తాగలేకపోయిందని పేర్కొన్నారు.

రివర్స్ ప్రయోగం ఫెయిల్

ఎలుకల్లో చుంచు కిడ్నీలను పెంచగలిగిన సైంటిస్టులు, చుంచుల్లో ఎలుక కిడ్నీల్ని పెంచడంలో మాత్రం ఫెయిల్ అయ్యారు. ఎలుక కణజాలం కిడ్నీ తయారు కావడానికి రెండుగా విడిపోకపోవడంతోనే ఈ టెస్టు ఫెయిలైందని వెల్లడించారు. ఇందుకు కారణాన్ని కనుగొనేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు.

మనిషి అవయవాల పెంపు సవాలే

ఇతర జీవుల్లో మనుషుల అవయవాలు పెంచడం పెద్ద సవాలేనని ఎన్పీఎస్ఐ సైంటిస్టులు అభిప్రాయపడ్డారు. మనిషి కణజాలాన్ని ఇతర జీవుల పిండాల్లో ప్రవేశపెడితే అది ఏ అవయవంగా మారుతుందో చెప్పలేమని తెలిపారు. ఎక్కువగా మెదడు లేదా ప్రత్యుత్పత్తి అవయవాలుగా మారే అవకాశాలు ఉన్నాయన్నారు. మానవ అవయవాల పెంపుకు పందులు బాగా పనికొస్తాయని తొలుత అభిప్రాయపడినట్లు చెప్పారు. కానీ పందుల పిండం ఎదిగే కాలం 25 వారాలు మాత్రమే. మనుషుల్లో 40 వారాల పాటు పిండం ఎదుగుతుంది. దీంతో ఆవు, ఎద్దు, ఒంటెలపై దృష్టి పెట్టామని చెప్పారు. వీటిలో పిండం ఎదిగే కాలం, మనిషి పిండం ఎదిగే కాలానికి సమానం. వీటిపై ప్రయోగం జరపడానికంటే ముందు టెక్నికల్‌గా ఎదురయ్యే సవాళ్లు, నైతిక సమస్యలపై పెద్ద ఎత్తున చర్చ జరగాల్సిన అవసరం ఉందని సైంటిస్టులు అన్నారు. త్వరలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా, ఎలుకల్లో చుంచుల అవయవాలు పెంచే ప్రయత్నం చేస్తామని చెప్పారు.



హైదరాబాద్ ఐటీలో దూసుకెళ్తోంది. దేశంలో ఐటీ ఇండస్ట్రీ అంటే హైదరాబాద్ అనేలా గుర్తింపు తెచ్చుకుంటోంది. ఇక్కడ కాస్ట్ ఆఫ్ లివింగ్ తక్కువగా ఉండటం, కంపెనీలకు సర్కారు ఇన్సెంటివ్‌లు ఇవ్వడం, టాలెంట్ పూల్ ఎక్కువగా ఉండటం నగరానికి కలిసొస్తోంది. హైదరాబాద్‌లో చిన్నాపెద్దా కలిపి 5 వేలకుపైగా ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు ఉన్నాయి. నగరం నుంచి 2017–18లో రూ.93 వేల కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయి. ఇందులో 70 శాతం ఔట్ సోర్సింగ్ ద్వారా జరుగుతున్నవేనని అంచనా.

హైదరాబాద్.. ఔట్‌సోర్సింగ్ అడ్డా

పెద్ద పెద్ద ప్రాజెక్టులనూ ఆకర్షిస్తున్న చిన్న కంపెనీలు

వెలుగు, హైదరాబాద్

ఔట్‌సోర్సింగ్ ప్రాజెక్టులు చేయడంలో గతంలో చైనా ముందుండేది. ఇప్పుడు ఇండియా టాప్‌లో ఉంది. ఔట్‌సోర్సింగ్ ప్రాజెక్టులు చేస్తున్న టాప్ టెన్ నగరాల్లో ఆరు నగరాలు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ, ముంబై, పుణె ఇండియాకు చెందినవే. మిగతావి ఐర్లాండ్‌కు చెందిన డబ్లిన్, ఫిలిప్పీన్స్‌కు చెందిన మటకి, చైనాలోని షాంఘై, బీజింగ్ నగరాలు. హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీల్లో డేటా అనాలటిక్స్, టెస్టింగ్‌పై పనిచేసే కంపెనీలే ఎక్కువ. విదేశాల్లో డెవలప్ చేసిన ఏ ఐటీ ప్రొడక్ట్, యాప్, సర్వీస్ అయినా టెస్టింగ్ చేయడం, డేటా అనలటిక్స్ వర్క్ హైదరాబాద్‌కు చెందిన కంపెనీలకే వస్తోంది.

చిన్న కంపెనీలు కూడా..

పెద్ద కంపెనీల్లో పనిచేసే కొందరు సాఫ్ట్‌వేర్ ఎంప్లాయీస్ బయటికి వచ్చి సొంతంగా చిన్న కంపెనీలు పెడుతున్నారు. తమ కున్న పరిచయాలతో విదేశీ ప్రాజెక్టులు సంపాదించుకుంటున్నారు. ఆ ప్రాజెక్టుకు సరిపోయేలా కొందరు ఫ్రెషర్స్‌ను రిక్రూట్ చేసుకుని పని పూర్తి చేస్తున్నారు. ఇలాంటి ప్రాజెక్ట్ బేస్డ్ కంపెనీలు ఇటీవల బాగా పెరిగాయి. ఇవి హైదరాబాద్‌లో వెయ్యికిపైగా ఉంటాయని అంచనా. టెంపరరీగా ఫ్రెషర్స్‌ని తీసుకొని ఔట్ సోర్సింగ్ ప్రాజెక్టులు చేస్తున్న కంపెనీల్లో 30 వేల మందికిపైగా పనిచేస్తున్నారు.

టైమింగ్స్ అనుకూలమే..

హైదరాబాద్‌లో ఉన్న ఐటీ, బీపీవో కంపెనీల్లో సగానికిపైగా ఈవినింగ్, నైట్ షిఫ్ట్‌లలో పని చేస్తాయి. అంటే విదేశీ కంపెనీలకు అనుగుణంగా వారి టైమింగ్స్‌లో ఇక్కడ పనిచేస్తున్నాయి. ఇక్కడి టెకీలు కోడ్ లాంగ్వేజ్ సహా ఏ కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చినా త్వరగా నేర్చుకుంటున్నారు. ఇవి అనుకూలంగా మారుతున్నాయి. హైదరాబాద్ కంపెనీలకు ఔట్‌సోర్సింగ్ ప్రాజెక్టులు ఇచ్చేవాటిలో అమెరికా, యూరోపియన్ దేశాల కంపెనీలే ఎక్కువ. ఆయా దేశాల్లో వేతనాలు ఎక్కువ, ప్రాజెక్టులు పూర్తి చేయాలంటే చాలా ఖర్చవుతుంది. దాంతో హైదరాబాద్‌లోని కంపెనీలకు ఔట్‌సోర్సింగ్ చేస్తున్నాయి.

- **విదేశాల్లోని ఐటీ, బీపీఓ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, యానిమేషన్ రంగాలకు టెక్ సపోర్ట్**
- **బెస్ట్ టాలెంట్ పూల్, ఆన్‌టైమ్‌లో ప్రాజెక్టుల పూర్తి**

40%

ఇండియాకు వస్తున్న ఔట్‌సోర్సింగ్ ప్రాజెక్టుల్లో హైదరాబాద్‌కు దక్కేవి.

యానిమేషన్ కంపెనీలూ..

ఐటీ కంపెనీలతో పాటు యానిమేషన్ ప్రాజెక్టులు హైదరాబాద్‌కు ఎక్కువగా వస్తున్నాయి. హాలీవుడ్, కొరియన్, జపనీస్ సినిమాలకు యానిమేషన్స్ చేస్తున్నారు. అలాంటి పనులను ఇక్కడికొచ్చి మరీ పూర్తి చేయించుకు వెళ్తున్నారు. ఫైనాన్షియల్ ప్రాజెక్టులు పూర్తిచేసి పెట్టడంలో మన ఐటీ కంపెనీలు ముందున్నాయి.

– తేజారెడ్డి, టెక్టోట్రాన్ సీఈవో

మనకు ఫుల్ డిమాండ్

హైదరాబాద్‌లో 5 లక్షల మంది ఐటీ ఉద్యోగులు పని చేస్తున్నారు. చాలా అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ సెంటర్లు ఏర్పాటు చేసుకుంటున్నాయి. మన ఐటీ ఎగుమతుల్లో 25 నుంచి 30 శాతం ఔట్ సోర్సింగ్ ప్రాజెక్టుల ద్వారా వచ్చేవే. ప్రొడక్ట్ బేస్డ్ కన్నా సర్వీస్ బేస్డ్ ప్రాజెక్టులపైనే ఎక్కువ వర్క్ చేస్తున్నారు. ప్రొడక్ట్ బేస్డ్ ప్రాజెక్టులొస్తే ఉద్యోగాలు పెరుగుతాయి.

– సందీప్ మక్తాల, తెలంగాణ ఐటీ అసోసియేషన్ ప్రెసిడెంట్

ఒకే ఫ్రేంలో చంద్రుడు, భూమి

చూడు ఒకవైపే చూడు, రెండో వైపు చూడాలనుకోకు తట్టుకోలేవ్.. అన్న సినిమా డైలాగ్ చంద్రుడి విషయంలో చక్కగా సరిపోతుంది. చంద్రుడిపై మనిషి కాలుమోపి సంవత్సరాలు గడిచాయి. అయినా చందమామ ముఖమే తప్ప వీపుచూసే అవకాశం నిన్నమొన్నటి వరకూ దొరకలేదు. ఎందుకంటే చంద్రుడు ఎప్పుడూ భూమికి అభిముఖంగానే ఉంటాడట. ఆ కొరత తీరేలా చైనా ఉపగ్రహం ఓ చక్కని ఫొటో పంపించింది. చంద్రుడి చుట్టూ తిరుగుతున్న లాంగ్జియాంగ్–2 శాటిలైట్ తీసిన ఈ ఫొటో అత్యంత అరుదైందనే చెప్పొచ్చు. ఒకే ఫ్రేంలో చంద్రుడి వీపు భాగం.. ఆ వెనకే చిన్నబాల్‌సైజులో నీలిరంగులో మెరుస్తున్న భూమిని ప్రొఫెషనల్ కెమెరామెన్‌లా బంధించింది. గతేడాది జూన్‌లో అంతరిక్షంలోకి వెళ్లిన ఈ ఉపగ్రహం ఈ నెల 3న ఈ అద్భుతమైన ఫొటోను తీసి పంపించింది.



పీఎం కిసాన్ ఊర్లఉన్నోళ్లకే

(మొదటిపేజీ తరువాయి)

2019 మార్చి 31ను లెక్కలోకి తీసుకుంటున్నట్టు చెప్పింది. తొలి జాబితా ఈ ఏడాది వరకే అమలులో ఉంటుందని వెల్లడించింది. లబ్ధిదారులు గ్రామంలోనే ఉంటున్నామని వ్యక్తిగత హామీ పత్రం (సెల్ఫ్ డిక్లరేషన్) ఇవ్వాలని, సెల్ఫ్ డిక్లరేషన్ అవాస్తవమైతే సొమ్మును రికవరీ చేసుకోవడంతో పాటు న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

మార్గదర్శకాలివే

- ఉమ్మడి కుటుంబానికి 25 ఎకరాలుండి 5 కుటుంబాలకు తలా 5 ఎకరాలుంటే ప్రతి కుటుంబానికి పథకం వర్తిస్తుంది.
- ఉమ్మడి కుటుంబంలోని 12 కుటుంబాలకు 40 ఎకరాలు ఉంటే వారిలో 4 కుటుంబాలకు రెండున్నర ఎకరాలు చొప్పున, మరో 8 కుటుంబాలు 3 ఎకరాల 30 గుంటల చొప్పున ఉంటే పీఎం కిసాన్ వర్తిస్తుంది.
- 25 ఎకరాల భూమి ఉన్న 4 కుటుంబాల్లో ఒక కుటుంబానికి 13 ఎకరాల ముప్పై గుంటలు ఉండి మిగతా 3 కుటుంబాలు మూడెకరాల ముప్పై గుంటలు ఉంటే తక్కువ భూమి ఉన్న కుటుంబాలకు వర్తిస్తుంది.
- నాలుగున్నర ఎకరాల భూమి వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నా, వేర్వేరు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నా, ఒక గ్రామంలో గానీ వేర్వేరు గ్రామాల్లో ఉన్నా అర్హులే.
- భూ యజమాని చనిపోతే కుటుంబంలో అర్హులైన వారి పేరు 2018 డిసెంబర్ 1-2019 ఫిబ్రవరి 1లోగా భూ రికార్డుల్లో చేర్చి ఉండాలి.



భూ యజమాని భూమి అమ్మినా, బహుమతిగా ఇచ్చినా, వారసత్వపు హక్కు ఇచ్చినా గడువులోగా రికార్డుల్లో చేర్చితే తొలి విడత సొమ్ము ఇస్తారు.

- అర్హుల వివరాలను పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు.

5 ఎకరాల్లోపు భూమి ఉన్నా..

- రాజ్యాంగ పదవుల్లో ఉన్న రైతులకు పథకం వర్తించదు.
- మాజీ మంత్రులు, ప్రస్తుతం కొనసాగుతున్న వారు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, మేయర్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, పదవీవిరమరణ చేసిన, ప్రస్తుతం కొనసాగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, స్వయం ప్రతిపత్తి సంస్థల ఉద్యోగులు (క్లాస్ ఫోర్త్ ఎంప్లాయిస్‌తో సహా)లూ అనర్హులు.
- 10 వేలకు పైగా పెన్షన్ వస్తున్న వాళ్లు.. డాక్టర్లు, లాయర్లు, చార్టర్డ్ అకౌంటెంట్‌లు, ఆర్కిటెక్టులు తదితర ప్రొఫెషనల్స్‌కు వర్తించదు.

'లోక్‌పాల్'కు దరఖాస్తులు పంపండి

న్యూఢిల్లీ: లోక్ పాల్ చట్టం అమల్లోకి వచ్చిన ఐదేళ్ల తర్వాత కమిటీ నియామకంపై ముందడుగు పడింది. లోక్‌పాల్ సభ్యుల నియామకానికి కేంద్రం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం ఓ ప్రకటనలో కోరింది. చిత్తశుద్ధి, అత్యుత్తమ సామర్థ్యం, ప్రత్యేక జ్ఞానంతోపాటు అవినీతి వ్యతిరేక విధానం, ప్రజా పరిపాలన, విజిలెన్స్, ఫైనాన్స్, బ్యాంకింగ్, లా, మేనేజ్ మెంట్ తదితర అంశాలపై కనీసం 25 ఏళ్ల నైపుణ్యం ఉండాలని పేర్కొంది. ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పింది.

నిబంధనలివీ..

- చైర్మన్ పదవికి చీఫ్‌జస్టిస్ ఆఫ్‌ఇండియాగా, సుప్రీం న్యాయమూర్తిగా చేసిన వారు అర్హులు.
- 45ఏళ్లకు తక్కువ వయసుంటే అనర్హులు.
- లోక్ పాల్ చట్టంలోని రూల్స్ ప్రకారం చైర్‌పర్సన్, గరిష్ఠంగా మరో 8 మంది సభ్యులు ఉండాలి. అందులోనూ నలుగురు జ్యుడీషియల్ మెంబర్లు అయి ఉండాలి.
- సభ్యుల్లో కనీసం 50 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ, మహిళలై ఉండాలి.
- చైర్మన్, సభ్యులు ఐదేళ్లు పదవుల్లో ఉంటారు. లేదా 70 ఏళుల వచ్చే వరకు ఉంటారు.
- లోక్‌పాల్ చైర్మన్ జీతభత్యాలు సీజేఐతో సమానంగా ఉంటాయి. సభ్యుల జీతభత్యాలు సుప్రీంకోర్టు జడ్జితో సమానంగా ఉంటాయి.
- ఒకసారి లోక్‌పాల్ కమిటీలో నియమితులైన వారిని, రీ అపాయింట్ చేయరు.

గురువారం | హైదరాబాద్
07.02.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu



గోడ కడతా, అడ్డుపడొద్దు

స్టేట్ ఆఫ్ ది యూనియన్ స్పీచ్ లో డెమొక్రాట్లకు ప్రెసిడెంట్ ట్రంప్ పిలుపు

వాషింగ్టన్: దేశంలోకి అక్రమ వలసలను అడ్డుకునేందుకు మెక్సికో బోర్డర్‌లో గోడకట్టాల్సిందేనని అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్‌ట్రంప్‌మరోసారి తేల్చి చెప్పారు. ప్రతీకార రాజకీయాలను వీడి కలిసి రావాలంటూ బుధవారం డెమోక్రాట్లకు పిలుపునిచ్చారు. ఈ విషయంలో పట్టింపులకు పోతే అమెరికన్ల నెత్తిపై మరోసారి షట్‌డౌన్‌భారం తప్పదని చెప్పారు. ఈ పరిస్థితిని తప్పించేందుకు సహకరించాలని కోరారు. ఈమేరకు 'స్టేట్‌ఆఫ్‌ది యూనియన్' స్పీచ్‌లో ట్రంప్‌డెమోక్రాట్లను అభ్యర్థించారు. అమెరికా ప్రెసిడెంట్‌గా తన ఎన్నికపై అనవసర ఆరోపణలు మానుకోవాలని సభ్యులకు సూచించారు. ఇప్పటి వరకు తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను పరిశీలించాలని చెప్పారు. దాదాపు గంటన్నర(82 నిమిషాలు) పాటు సాగిన తనస్పీచ్ లో అమెరికన్ల ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తానని ట్రంప్ చెప్పారు. దీనికోసం పార్టీలకతీతంగా పనిచేస్తున్నానని ఆయన చెప్పుకున్నారు. ఓ మంచి పనికోసం ఇలాంటి చిన్న చిన్న పరిమితులను దాటడం తప్పుకాదని వివరించారు. అక్రమంగా దేశంలోకి అడుగుపెడుతున్న వారివల్ల అమెరికన్ల జీవితం కల్లోలంగా మారుతోందన్నారు. కొంతమంది ఉద్యోగాలు కోల్పోతుంటే, మరికొంతమంది తక్కువ జీతానికే పనిచేస్తున్నారని చెప్పారు. క్రైంరేటు కూడా దారుణంగా పెరిగిపోతోందని ట్రంప్‌చెప్పారు. సరిహద్దుల్లో గోడ కట్టాలనే ప్రతిపాదన చాలాకాలం నాటిదేనని అన్నారు. ఇప్పుడు సభలో కూర్చున్న వాళ్లలో చాలామంది గతంలో దీనికి అనుకూలంగా ఓటేశారని, అయినా ఇప్పటి వరకు బోర్డర్‌లో ఎలాంటి గోడ కట్టలేదని ట్రంప్‌చెప్పారు.

ఏంటీ ఎస్‌ఓటీయూ?

స్టేట్ ఆఫ్ ది యూనియన్(ఎస్‌ఓటీయూ) అంటే.. కాంగ్రెస్ సభ్యులను ఉద్దేశించి ప్రెసిడెంట్ ఇచ్చే ప్రసంగం. ఏటా సభ్యులందరినీ పిలిచి గతేడాది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, సాధించిన విజయాలు, వచ్చే ఏడాది తీసుకోబోయే నిర్ణయాలు, రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వబోతోంది.. తదితర వివరాలను ప్రెసిడెంట్ తన స్పీచ్ లో వెల్లడిస్తారు.

పాత గాయాలను నయం చేసుకుందాం..

దేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న రాజకీయ ప్రతిష్టంభనను తొలగించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని ట్రంప్‌సభ్యులకు విజ్ఞప్తి చేశారు. అంతా కలిసి పాత గాయాలను నయంచేసుకుందామని ప్రతిపాదించారు. అమెరికా భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకుందామని అన్నారు. శాంతియుతంగా ఉంటూ ధర్మాన్ని అనుసరించే చోట యుద్ధానికి తావులేదని ప్రెసిడెంట్‌ట్రంప్‌చెప్పారు. సమీప భవిష్యత్తులో దేశం ఎదుర్కోబోయే అతిపెద్ద సవాల్ అక్రమ వలసలేనని హెచ్చరించారు. దీనిని అడ్డుకోవడానికి గోడ నిర్మాణం విషయంలో కలిసి రావాలని కోరారు. మెక్సికో బోర్డర్‌లో గోడ నిర్మాణానికి సంబంధించి 5.7 బిలియన్ డాలర్లు కేటాయించాలన్న ట్రంప్ సర్కారు ప్రతిపాదన ఇప్పటికీ ఆమోదం పొందలేదు. స్పెండింగ్‌బిల్లు పెండింగ్‌లో పడడంతో ఏకంగా అమెరికా షట్‌డౌన్‌కు దారితీసింది. 35 రోజుల పాటు కొనసాగిన షట్‌డౌన్‌తర్వాత డెమోక్రాట్ల డిమాండ్‌మేరకు ట్రంప్ తాత్కాలికంగా ఎత్తివేశారు. ఈ నెల 15 వరకు ప్రభుత్వ కార్యకలాపాలు యథావిధిగా జరిగేందుకు అంగీకరించారు. ఈ సమయంలో మెక్సికో బోర్డర్‌వాల్‌నిర్మాణానికి అవసరమైన నిధులకు సంబంధించి డెమోక్రాట్లతో చర్చలు జరపనున్నట్లు ట్రంప్‌వివరించారు.

నా వల్లే ఉత్తర కొరియాతో యుద్ధం తప్పింది

ఉత్తర కొరియాతో వార్ ముప్పు తప్పడానికి కారణం తానేనని ట్రంప్‌అన్నారు. ప్రెసిడెంట్ పదవిలో తాను కాకుండా మరెవరున్నా నార్త్‌కొరియాతో ఈపాటికి పెద్ద యుద్ధమేచేసి ఉండేవాళ్లమన్నారు. నార్త్‌కొరియా ప్రెసిడెంట్‌కిమ్‌జోంగ్ ఉన్‌తో ఈ నెలాఖరులో వియత్నాంలో భేటీ అవుతానని చెప్పారు.

లీగల్‌గా ఎవరొచ్చినా స్వాగతిస్తాం

న్యాయంగా, చట్టబద్ధమైన మార్గాల్లో వలస వచ్చిన వారికి వెల్‌కం చెబుతామని ట్రంప్‌అన్నారు. అలా వచ్చిన వారికే అమెరికాలో చోటు ఉంటుందన్నారు. ఇలా వచ్చిన వారు దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. అక్రమంగా వచ్చే వారి వల్ల దేశానికి ముప్పు పొంచి ఉంటుందని హెచ్చరించారు. అక్రమ వలసలను అడ్డుకోవడానికి ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలో పోర్ట్‌ల దగ్గర డ్రగ్ డిటెక్షన్ టెస్టుల నిర్వహణ, పిల్లలతో స్మగ్లింగ్ చేయడంపై కఠిన నిషేధం, బోర్డర్‌వాల్‌నిర్మాణం లాంటివి ఎన్నో ఇందులో ఇమిడి ఉన్నాయని చెప్పారు.

ముగింపులేని పోరాటం చెయ్యబోం..

గొప్ప విజ్ఞతగల దేశాలు ఎన్నటికీ ముగింపులేని పోరాటాలు చేయవని ట్రంప్‌చెప్పారు. ఇస్లామిక్‌స్టేట్ టెర్రరిస్టులపై అమెరికా ఆర్మీ పైచేయి సాధించిన విషయాన్ని సభలో ప్రస్తావించారు. మిడిల్ ఈస్ట్‌దేశాల్లోని అమెరికా బలగాలను వెనక్కి పిలిచే సమయం వచ్చిందని అన్నారు. అఫ్గానిస్తాన్‌సమస్యకూ ఓ పరిష్కారం దొరకాల్సి ఉందన్నారు. చైనాతో వ్యాపార ఒప్పందాలకు సంబంధించి దూకుడుగా వెళుతున్నట్లు పేర్కొన్నారు.

ఇండియన్లకు వర్క్ పర్మిట్లుండాల్సిందే

లేకుంటే వెనక్కి పంపిస్తామన్న నేపాల్

కఠ్మాండు, న్యూఢిల్లీ

భౌగోళికంగా అన్నదమ్ముల్లాంటి ఇండియా నేపాల్‌లు బంధాల పరంగా అంతకంతకూ దూరమవుతున్నాయి. ఆంక్షలులేని సరిహద్దు, వ్యాపారం, ఒకే మతం, దగ్గరగా ఉండే ఆచారవ్యవహారాలు.. ఇవేవీ రెండు దేశాలను శాశ్వత మిత్రులుగా ఉంచలేకపోతున్నాయి. ఈమధ్యే 200, 500, 2000 రూపాయల ఇండియన్ కరెన్సీ నోట్లను నిషేధించిన నేపాల్ ప్రభుత్వం తాజాగా తమ దేశంలో పనిచేస్తున్న ఇండియన్లందరూ తప్పనిసరిగా వర్క్‌పర్మిట్లు పొందాలని ఆదేశించింది. కాలపరిమితిలోపు వర్క్‌పర్మిట్లు పొందనివాళ్లను నిర్దాక్షిణ్యంగా వెళ్లగొడతామని హెచ్చరించింది. ఈ మేరకు నేపాల్ కార్మికశాఖ బుధవారం ఆదేశాలు జారీచేసింది. దేశాలుగా ఆవిర్భవించిన నాటి నుంచి ఇండియా-నేపాల్‌ల మధ్య వర్క్‌పర్మిట్ లాంటి ఆంక్షలేవీ లేవు. ఎగుమతులు, దిగుమతుల మీద కూడా ఎలాంటి పన్నులు లేవు.

ప్రస్తుతం నేపాల్‌లో సుమారు 15 లక్షల మంది ఇండియన్లు ఉపాధి పొందుతున్నారు. ఎవరెవరు ఎక్కడెక్కడ ఏయే పనులు చేస్తున్నారో సమగ్ర వివరాలు పంపాల్సిందిగా ఆయా ఖార్ఖానాలు, సంస్థలకు కార్మిక శాఖ బుధవారమే లేఖలు రాసింది. నేపాల్ వర్క్ పర్మిట్ ఆంక్షలపై ఇండియన్ గవర్నమెంట్ స్పందించాల్సిఉంది. అక్కడ పనిచేస్తున్న ఇండియన్ల తో పోల్చుకుంటే ఇక్కడ ఉపాధి పొందుతోన్న నేపాలీల సంఖ్య చాలా ఎక్కువ. తాజా గణాంకాల ప్రకారం ఇండియాలో వర్క్ చేస్తున్న నేపాలీల సంఖ్య 60 లక్షల పైమాటే!

నేడు కీలక భేటీ.. అంతలోనే!

ఇండియా-నేపాల్‌ల మధ్య అమలులో ఉన్న వ్యాపార, వాణిజ్య ఒప్పందాలకు సంబంధించి గురువారం రివ్యూ మీటింగ్ ప్రారంభం కానుంది. సెంట్రల్ నేపాల్‌లోని పొఖారా సిటీలో రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి రెండు దేశాల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఈ భేటీలో తాము ప్రధానంగా రెండు అంశాలపై ఫోకస్ పెట్టామని, వాణిజ్య లోటును పూడ్చుకోవడం ఒకటైతే, ఇండియాకు ఎగుమతులు పెంచాలన్నది రెండో అంశమని నేపాల్ పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ రవి శంకర్ సైజూ మీడియాకు తెలిపారు. పేరుకు స్వేచ్ఛా వాణిజ్యమే అయినా నేపాల్ వస్తువులపై ఇండియా భారీగా పన్నులు విధిస్తోందని ఆయన ఆక్షేపించారు. ఒప్పందాలకు విరుద్ధంగా ఇండియా మా వస్తువులపై పన్నులు వసూలు చేస్తోందన్నారు. రివ్యూ మీటింగ్‌కు ముందే వర్క్ పర్మిట్లపై ఆంక్షలు విధించడం ద్వారా నేపాల్ తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పింది.

నేపాల్ -ఇండియాల మధ్య ఎప్పటి నుంచో టారిఫ్ ఫ్రీ ట్రేడ్ నడుస్తోంది. పౌరుల రాకపోకలకు వీసా కూడా అక్కర్లేదు. ల్యాండ్‌లాక్ కంట్రీ అయిన నేపాల్.. దాదాపు ప్రతి అవసరానికి ఇండియాపైనే ఆధారపడేది. 2015లో ఇండియా అప్రకటితంగా నేపాల్‌ను దిగ్బంధించి, నిత్యావసరాల సరఫరాని అడ్డుకున్న ఘటన రెండు దేశాల ఆత్మీయతను తెంచేసింది. అన్ని రకాలుగా చైనా దన్నుగా నిలుస్తుండటంతో నేపాల్.. ఊహించినదానికంటే వేగంగా ఇండియాకు దూరమైపోతోంది.



నేపాల్– ఇండియా ద్వైపాక్షిక బంధాలు

నేపాల్ విదేశీ వాణిజ్యంలో మూడింట రెండు వంతులు ఇండియాతో సాగుతాయన్నది తెలిసిందే. ఇతర దేశాలతో సాగే వాణిజ్యం కూడా ఇండియా మీదుగా జరగాల్సిందే. నేపాల్ ఎగుమతి దిగుమతుల్లో 90 శాతానికి పైగా మన భూభాగం ద్వారా సాగుతున్నాయి.

నేపాల్‌లో పనిచేస్తున్న ఇండియన్లు: సుమారు 15 లక్షలు	ఇండియాలో నేపాలీలు: దాదాపు 60 లక్షలు
ఇండియాకు నేపాల్ ఎగుమతులు: 2,985 కోట్లు	ఇండియా నుంచి దిగుమతులు: 36,579 కోట్లు
రెండు దేశాల మధ్య వాణిజ్యం విలువ: (2016–17 నాటికి) 39,564 కోట్లు	నేపాల్ వాణిజ్య లోటు: 33,594 కోట్లు

ఆఫీసులో ప్రియాంక



ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ప్రియాంక గాంధీ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. మనీ లాండరింగ్‌కేసు విచారణ కోసం తన భర్త రాబర్ట్ వాద్రాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయం దగ్గర కారులో డ్రాప్‌చేసిన ఆమె అక్కడ నుంచి.ఢిల్లీ అక్బర్‌రోడ్డులోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయాలని కి చేరు కున్నారు. ఆమెకు కేటాయించిన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు కార్యకర్తల్ని కూడా ఆమె కలుసుకున్నారు. సుమారు 15 నిమిషాలపాటు ఆమె ఆఫీసులోనే ఉన్నారు. తొలిసారిగా కాంగ్రెస్ కార్యాలయానికి వచ్చిన ప్రియాంకను చూడ్డానికి అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో వారిని నియంత్రించడం సెక్యూరిటీ సిబ్బందికి కష్టమైంది. కార్యాలయానికి రాగానే పార్టీ కార్యకర్తలు ఆమెకు స్వాగతం పలికారు. కొత్త బాధ్యతలు ఇచ్చినందుకు కాంగ్రెస్ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీకి ఆమె కృతజ్ఞతలు చెప్పారు. తన భర్తపై ఈడీ కేసు రాజకీయ వేధింపులే అని ఆమె చెప్పారు. దీనిపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్ (ఈస్ట్) ఇన్‌చార్జి హోదాలో గురువారం జరగనున్న అధికారిక సమావేశంలో ప్రియాంక పాల్గొననున్నారు.

పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్ జనరల్ సెక్రటరీగా నియమితులైన జ్యోతిరాదిత్య సింధియా కూడా బుధవారమే బాధ్యతలు చేపట్టారు. యూపీలో పార్టీని పటిష్టం చేయాలని గణేశ్‌పూజ చేశానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో అధిక సీట్లు గెలవడం, 2022లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ఇది సరైన సమయమని అభిప్రాయపడ్డారు.

కొటగల్సినా పర్వాలే..

అలహాబాద్:

కాశ్మీర్‌కు చెందిన ముసలామె కుటుంబసభ్యులతో కలిసి ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న అర్ధ కుంభమేళకు వచ్చింది. లక్షలాదిమంది జనంలో ఆమె తప్పిపోయింది. ఆమెకు హిందీ రాదు. ఎక్కడికి వెళ్లాలో తెలియదు. తమవారు తప్పిపోవడంతో కన్నీరు మున్నీరవుతున్న ఆమెను చూసిన 'భూలే భట్కే' కార్యకర్తలు గంటలోనే తన వాళ్లకు దగ్గరకు చేర్చారు. ఆమె సంతోషానికి హద్దుల్లేవు. కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేసిన ఆమె పుణ్య స్నానాలు ఆచరించింది. ఇలా 'భూలే భట్కే' వాలంటీర్లు ఒక్క ఆ మహిళను మాత్రమే కాపాడి వారి కుటుంబ సభ్యులకు అప్పగించలేదు. కుంభమేళ మొదలైన జనవరి 15 నుంచి బుధవారం వరకు ఇలా తప్పిపోయిన సుమారు 20 వేల మందిని సురక్షితంగా వారి కుటుంబసభ్యులకు అప్పగించింది 'భూలే భట్కా' అనే ఈ సంస్థ.

- కుంభమేళా 'భూలే భట్కే' సేవల్ భేష్
- 1946 నుంచి సేవలు అందిస్తున్న సంస్థ
- తండ్రి ఆశయాన్ని కొనసాగిస్తున్న కొడుకు


తప్పిపోయిన వారి వివరాలను నమోదు చేస్తున్న భూలే భట్కే కార్యకర్త

సంస్థ ఏర్పాటు నేపథ్యం

కుంభమేళలో పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చే వారు.. ఒక్కోసారి అనుకోకుండా తప్పిపోతారు. భాషరాక ఇబ్బందులు పడతారు. అలా అంతమంది జనంలో తమ కుటుంబసభ్యుల నుంచి విడిపోయిన పిల్లలను, వృద్ధులను తమ వారి వద్దకు చేర్చేందుకు ప్రత్యేకంగా ఒక క్యాంప్‌ఉంది.. అదే 'భూలే భట్కే'. 1946 నుంచి కుంభమేళలో ఈ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. రాజారాం తివారీ అనే వ్యక్తి స్థాపిస్తే.. ఇప్పుడు దాని బాధ్యతలను ఆయన కుమారుడు ఉమేశ్‌చంద్ర చూస్తున్నారు. ఏర్పాటైనప్పటి నుంచి ఇంతవరకు దాదాపు 12.50 లక్షల మంది తప్పిపోయిన వారిని కాపాడి.. వాళ్ల కుటుంబసభ్యులకు సంస్థ అప్పగించింది. ఈ ఏడాది కుంభమేళ మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు 20 వేల మందిని సురక్షితంగా వారి కుటుంబసభ్యులకు అప్పగించామని ఉమేశ్‌తివారీ చెప్పారు. "1946లో జరిగిన మాఘ మేళకు వచ్చిన మా నాన్నకు ఒక ముసలామె తప్పిపోయి ఏడుస్తూ కనిపించింది. ఆమె దగ్గరకు వెళ్లి వివరాలు తెలుసుకొని తమవారి దగ్గరకు తీసుకెళ్లారు. ఈ సంఘటనే 'భూలే భట్కే' క్యాంప్‌ను (లాస్ట్‌అండ్ ఫౌండ్) ఏర్పాటుకు ప్రేరణ కలిగించింది. 1995 నుంచి నేను మా నాన్నకు సాయంగా ఉన్నాను. 2016లో ఆయన చనిపోయాక సంస్థ పూర్తబాధ్యతల్ని నేను తీసుకున్నాను" అని ఉమేశ్‌చెప్పారు. అంతే కాకుండా తప్పిపోయిన వారిని కేవలం రెండు మూడు గంటల్లో వారి కుటుంబ సభ్యుల వద్దకు చేరుస్తామని, ఒక వేళ వివరాలు తెలియకపోతే పోలీసుల సహాయం తీసుకుంటామని చెప్పారు. బాధితుల నుంచి ఒక రూపాయి కూడా తీసుకోమని ఉమేశ్ చెప్పారు.


భూలే భట్కే వ్యవస్థాపకుడు రాజారాం తివారీ


'భూలే భట్కే' ప్రత్యేకతలు

- 1946లో ఏర్పాటైంది.
- ఇంతవరకు తప్పిపోయిన 12.50 లక్షల మందిని సురక్షితంగా వాళ్ల కుటుంబ సభ్యులకు అప్పగించింది.
- 6 అర్ధకుంభమేళాలు, 6 కుంభమేళాల్లో, 60 మాఘ కుంభమేళాల్లో సేవలు.
- ఉచితంగానే బాధితులకు సాయం

"'చలో కుంభ్‌ఛలే' అనేది ప్రధాని మోడీ నినాదం. 'వాపసీ ఘర్‌సురక్షిత్' అనేది మా నినాదం.
- ఉమేశ్‌తివారీ"

నన్‌లపై లైంగిక వేధింపులు నిజమే!

వెల్లడించిన పోప్ ఫ్రాన్సిస్



వాటికన్ సిటీ: క్యాథలిక్ చర్చిలు, వాటి అనుబంధ సంస్థల్లో నన్‌లపై లైంగిక వేధింపులు నిజమేనని పోప్ ఫ్రాన్సిస్ వెల్లడించారు. కొందరు ప్రీస్ట్‌లు, బిషప్‌లు దురాగతాలకు ఒడిగట్టారని, వాళ్లపై చర్యలు తీసుకున్నామన్నారు. మూడురోజుల యూఏఈ పర్యటనను ముగించుకుని బుధవారం వాటికన్ సిటీకి తిరుగుపయనమైన ఆయన.. విమానంలో మీడియాతో మాట్లాడారు. 'నన్ లపై లైంగిక వేధింపులు అన్ని చోట్లా ఉన్నాయి. కొన్ని రీజియన్లు, కొత్తగా ఏర్పడుతున్న చర్చిల్లోనైతే ఈ తరహా నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇవన్నీ బయటపడ్డ పాపాలు. మనకు తెలియకుండా ఇంకా చాలా జరుగుతుండొచ్చు. ప్రతికూలతల దృష్ట్యా ఈ దురాగతాన్ని అంత తొందరగా అంతం చేయలేమని నా భావన. మత పెద్దలుగా మా దృష్టికి వచ్చిన అన్ని కేసుల్లో కఠినంగా వ్యవహరిస్తున్నాం. పాపాత్ముల పనిపడుతున్నాం. అయితే నన్‌లకు నూరుశాతం అభయమివ్వాలంటే ఈ మాత్రం చర్యలు సరిపోవు. ఇంకా చాలా చేయాల్సి ఉంది' అని పోప్ ఫ్రాన్సిస్ అన్నారు.

'కేరళ' ఘటనపై కదలికే ఈ ప్రకటన

చర్చిల్లో మత గురువుల లైంగిక అకృత్యాలపై పోప్ స్థాయి వ్యక్తి బహిరంగంగా మాట్లాడటం ఇదే మొదటిసారి. 'మీ టూ' ఉద్యమంలో భాగంగా చాలా మంది నన్‌లు బాధల్ని వెల్లడించారు. కేరళలోని క్యాథలిక్ చర్చిలో ఓ నన్‌పై బిషప్ ఫ్రాంకో ములక్కల్ అత్యాచారానికి పాల్పడ్డ ఘటనను హైలైట్ చేస్తూ 'విమెన్ చర్చి వరల్డ్'అనే అంతర్జాతీయ మ్యాగజైన్ ఇటీవల ప్రచురించిన కథనం దుమారం రేపింది. ఆ నేపథ్యంలోనే పోప్ నోరువిప్పాల్సివచ్చింది. చర్చిల్లో లైంగిక అకృత్యాల వల్ల నన్‌లు క్షోభ అనుభవించడమేకాదు, తండ్రి ఎవరో తెలియకుండా పుడుతున్న పిల్లల సంఖ్య పెరిగిపోతున్నదని 'విమెన్ చర్చి వరల్డ్' ఎడిటర్ లుసెట్టా స్కారఫ్ఫియా అన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న నాయిని, ఎమ్మెల్యే రమేష్‌బాబు

రూ. 400 కోట్లతో వేములవాడ అభివృద్ధి

- మాజీ హోంమంత్రి నాయిని
- భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం

వేములవాడ, వెలుగు : దేశంలోనే గొప్ప పుణ్య క్షేత్రంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల కోసం ఉచిత మినీ బస్సు, ఆలయంలో ఈ టికెట్ విధానం, కల్యాణం జరుపుకొనే భక్తుల కోసం ప్రత్యేకంగా అన్నదానం అదనపు భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబుతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. సీఎం కేసీఆర్ తెలంగాణలోని వేములవాడ, యాదాద్రి, భద్రాచలం, అలంపూర్ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వేములవాడ రాజన్న ఆలయం కోసం సీఎం కేసీఆర్ ఇప్పటికే రూ. 400 కోట్లు ప్రకటించారన్నారు. ఉమ్మడి జిల్లాలోనే అతి పెద్ద బస్‌స్టేషన్ భక్తుల సౌకర్యార్థం వేములవాడలో ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఈ టికెట్ విధానం అమలులోకి వచ్చిందని, అన్ని ఆర్జిత సేవల టిక్కెట్లు ఈ టికెట్‌ద్వారానే ఇస్తారన్నారు. వచ్చే మూడు నాలుగేళ్లలో వేములవాడ ప్రాంత రూపురేఖలే మారిపోతాయన్నారు.

దేశంలో ఫెడరల్ ఫ్రంట్

దేశంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో జగన్, మాయావతి, అఖిలేష్‌యాదవ్‌తో కలిసి ఫెడరల్ ఫ్రంట్ ఏర్పడబోతోందని నాయిని అన్నారు. తెలంగాణలో ఇప్పటికే సర్వేలు కొనసాగుతున్నాయని, గత ఎన్నికల్లోలానే తెలంగాణలోని 16 ఎంపీ స్థానాలు టీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ మాజీ కమిషనర్ అజయ్ కల్లం, ఆలయ ఈఓ దూస రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకు బాగుపడడమే ప్రగతి



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న హరీష్‌రావు

- మాజీమంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేటలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభం

సిద్దిపేట, వెలుగు: ప్రజల జీవన ప్రమాణాలు పెరగడమే అభివృద్ధి సూచిక అన్నది సీఎం కేసీఆర్ భావనఅని, ఆ దిశగానే రాష్ట్రంలో పథకాలను అమలు చేస్తున్నారని మాజీ మంత్రి టీ.హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేటలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. నిజాం కాలంలో కట్టిన మోండా మార్కెట్ ఇప్పటికి చెక్కుచెదరలేదన్న విషయాన్ని కేసీఆర్ ఎప్పుడూ చెప్తుంటారని, అదే స్థాయిలో సిద్దిపేట, సూర్యాపేట, గజ్వేల్ లలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఆరు ఎకరాల్లో 20 కోట్లు ఖర్చు చేసి, వెజ్, నాన్ వెజ్‌తో పాటు పండ్లు, పూలు, నిత్యావసరాల సరుకుల కోసం ఇక్కడ సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిఎం కేసీఆర్ విజన్‌కు తగ్గట్టు అన్ని వస్తువులు దొరికేలా ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. సిద్దిపేటలో త్వరలో నాలుగు కోట్లతో స్లాటర్ హౌజ్ నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్టు చెప్పారు. ఎంపీ ప్రభాకరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కలెక్టర్ క్రిష్ణభాస్కర్, జెసీ పద్మాకర్, మార్కెటింగ్ ఎడీ లక్ష్మారెడ్డి, ఎఎంసీ చైర్మన్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వెల్ఫేర్ స్టోర్ ప్రారంభం

సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సబ్సిడరీ పోలీస్ వెల్ఫేర్ స్టోర్‌ను, టాస్క్ ఫోర్సు కార్యాలయాన్ని మాజీ మంత్రి టీ.హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ జోయల్ డేవిస్, అడిషనల్ డిసిపి నరసింహారెడ్డి, ఎసిపి రామేశ్వర్, చైర్మన్ రాజనర్సులు పాల్గొన్నారు. అంతకు ముందు హరీశ్‌రావు పుల్లూరు బండ జాతరలో పాల్గొన్నారు.

సర్పంచ్‌కు కుర్చీ వేశారు



సెటిల్‌మెంట్ రికార్డు చేసుకుంటున్న అధికారులు

- 'వెలుగు' కథనానికి స్పందన

మహబూబ్‌నగర్, వెలుగు: మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలం పెదిరిపాడు సర్పంచ్‌ను అధికారులు కుర్చీలో కుర్చోబెట్టారు. బుధవారం గ్రామానికి చేరుకున్న సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ యాదయ్య సర్పంచ్ బాలప్పను గ్రామపంచాయతికి పిలిపించి కుర్చీలో కుర్చోబెట్టి జరిగిన ఘటనపై విచారం వ్యక్తం చేశారు. వీ6 వెలుగు దినపత్రికలో పెద్దల పంచాయతీ పేర వచ్చిన కథనం రాష్ట్ర వాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించిన 24 గంటల్లోనే అధికారులు విచారణ చేపట్టడం గమనార్హం. గ్రామానికి చేరుకున్న అధికారులు ఓ ప్రజాప్రతినిధిని ఎందుకు కింద కుర్చోబెట్టాల్సి వచ్చిందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఘటనకు కారణమైన పెద్దలను విచారించేందుకు ప్రయత్నించగా ఒక్కరే పంచాయతీ కార్యాలయానికి వచ్చి వివరణ ఇచ్చారు. చివరగా సర్పంచ్ బాలప్పతో మాట్లాడి ఆయన స్టేట్‌మెంట్ కూడా రికార్డు చేశారు.

పునరావృతం కాకుండా చూస్తాం


పెదిరిపాడులో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ యాదయ్య అన్నారు. గ్రామస్తులతో విచారణ జరిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందకరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎవరు భంగం కలిగించవద్దని సూచించారు.

జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

పెద్దల పంచాయతీపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు మిన్నంటుతున్నాయి. తాజాగా కొందరు ప్రజాసంఘాల నేతలు జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ జరిపి దళితుల ఆత్మగౌరవం దెబ్బతినకుండా చూడాలన్నారు. జరిగిన ఘటనను తీవ్రంగా పరిగణించాలని కులవివక్ష జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ గోవింద్ కోరారు. అయితే రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు కూడా 'వెలుగు' దినపత్రిక క్లిప్పింగ్‌తో కలిపి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

జలం.. గరళం

- విషపూరితమవుతున్న భూగర్భజలాలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తీవ్రమవుతున్న సమస్య



అపార నీటి వనరులున్న జిల్లాగా పేరున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జలకాలుష్యం పెరుగుతోంది. ప్రధానంగా పరిశ్రమల పరిసర ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంది. ఇటీవల భూగర్భజల శాఖ అధికారుల పరిశీలనలో ఈ విషయం వెల్లడైంది. ఇప్పటినుంచే దిద్దుబాటు చర్యలు ప్రారంభించకపోతే భవిష్యత్తులో తీవ్ర నష్టాలు తప్పవు.

భద్రాద్రి కొత్తగూడెం, వెలుగు

పారిశ్రామిక ప్రాంతమైన భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో భూగర్భ జలాలు విషపూరితంగా మారుతున్నాయి. ఇటీవల హెచ్‌ఆర్‌సీ ఆదేశాలతో భూగర్భ జలాలపై ఆ శాఖ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పరిశీలన చేసింది. ఈ సందర్భంగా విస్మయం కలిగించే అంశాలు వెల్లడయ్యాయి. జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, సారపాక, మణుగూరు ప్రాంతాల్లో భూగర్భ జల కాలుష్యం ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటివరకు జిల్లా ప్రజలు వాయు కాలుష్యంతోనే ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడు జలం కాలుష్యంతో మరో ముప్పు ప్రజల ముంగిటకు వచ్చింది.

చాపకింద నీరులా ఫ్లోరైడ్

జిల్లాలో ఫ్లోరైడ్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. సాధారణంగా బావులు, చేతి పంపుల నీరు సురక్షితమైనదని అధికారులు పేర్కొంటుంటారు. భూమి లోపల నుంచి ఉబికి వస్తున్న నీరు శుభ్రమైనదిగా ప్రజలు భావిస్తారు. కానీ భూగర్భ జలాలే విషంగా మారుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నైట్రైట్స్, రెసిడ్యూస్ సోడియం కార్బొనేట్ శాతం నిర్దేశించిన దానికన్నా ఎక్కువగా నమోదవుతోంది. జిల్లాలో టేకులపల్లి మండలం ముత్యాలంపాడు, మణుగూరు, ఇల్లెందు మండలంలో సుదిమళ్ల, కొమరారం, నారాయణపురం, పాల్వంచ మండలంలో యానంబైలు, అశ్వారావ్‌పేట మండలంలో గుమ్మడివల్లి, అశ్వాపురం, కొత్తగూడెం మండలంలో బంగారుచెలక, దుమ్ముగూడెం మండలంలో నర్సాపురం, కరకగూడెం మండలంలో కలవల నాగారాం, చర్ల, చంద్రుగొండ మండలంలో గుంపెన, జూలూరుపాడు మండలంలో గుండెపుడి, గుండాల, బూర్గంపాడు మండలంలో మోరంపల్లి బంజర తదితర ప్రాంతాల్లో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

103 గ్రామాల్లో పరిశీలన

జిల్లాలోని 103 గ్రామాల్లో పరిశీలించగా 17 ప్రాంతాల్లో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉందని తేలింది. సాధారణంగా ఉండే దానికన్నా 1.52 నుంచి 4.60 పీపీఎం ఎక్కువగా ఉంది. ఫ్లోరైడ్ వల్ల ఫ్లోరోసిస్, దంత సమస్యలు, ఎముకలు గుల్లబారడం వంటివి ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయి. నీటిలో నైట్రైట్స్ శాతం45 పీపీఎం/లీటర్‌గా ఉండాలి. కానీ జిల్లాలో పలు ప్రాంతాల్లో 500 పీపీఏ/లీటర్‌గా నమోదైంది. జిల్లాలోని రావికంపాడు ప్రాంతంలో నైట్రైట్స్ శాతం 609 పీపీఎం/లీగా నమోదైంది. ప్రధానంగా కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, సారపాక ప్రాంతాల్లో నైట్రైట్స్‌శాతం 400 నుంచి 600 పీపీఎం/లీ, కొత్తగూడెం నియోజకవర్గంలోని సర్వారంలో 233 పీపీఎం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. జూలూరుపాడు, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ మండలాల్లో 100 నుంచి 576 పీపీఎంగా ఉంది. నైట్రైట్స్ ఎక్కువగా ఉండడం వల్ల శరీరంలో ఆక్సిజన్ సరఫరా సామర్థ్యం తగ్గుతుందని, దీంతో చిన్నపిల్లలకు ప్రధానంగా ఇబ్బంది కలుగుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. మరోవైపు రెసిడ్యూస్ సోడియం కార్బొనేట్ ఎక్కువగా ఉంది. రెసిడ్యూస్ సోడియం కార్బొనేట్ ఎక్కువగా ఉండడం వల్ల భూముల్లో సారం తగ్గుతుంది. క్షార ధర్మాలు పెరుగుతాయి. పంటలకు ఇబ్బంది కలుగుతుంది. రెసిడ్యూస్ సోడియం కార్బొనేట్ సాధారణంగా 1.25 ఎంఈక్యూ/లీ గా ఉండాలి. అశ్వాపురంలో అత్యధికంగా 9.87ఎంఈక్యూ/లీ, సారపాక 6.57, అశ్వారావ్‌పేట 5.56, టేకులపల్లి 5.78, మణుగూరు ప్రాంతాల్లో 3.98 ఎంఈక్యూ/లీగా నమోదయ్యాయి. జిల్లాలో పలు ప్రాంతాల్లో 2.5 నుంచి 3.95 ఎంఈక్యూ(జీ)/లీ గా నమోదైంది. భూగర్భజలాల కాలుష్యంపై ఇప్పటికైనా దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. కంపెనీల నుంచి వచ్చే సెస్, మినరల్ ఫండ్ నిధులతో భూగర్భజలాలు కలుషితం కాకుండా అవసరమైన శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే భవిష్యత్‌లో జిల్లా ప్రజలు పలు వ్యాధుల బారినపడే ప్రమాదముందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

రసాయనాల వాడకం తగ్గించాలి

భూగర్భ జలాల కాలుష్యంపై ఇటీవల పరిశీలన చేసిన మాట వాస్తవమే. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం. రసాయనాలు, ఎరువుల వాడకం రైతులు తగ్గించాలి. సాధ్యమైనంత వరకు సేంద్రియ ఎరువులనే వాడాలి. కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాలి.

- రమేష్, జిల్లా భూగర్భజల శాఖాధికారి




రేలంగి నర్సింహారావుకు సన్మానం

నాటికను బతికించుకోవాలి

- సినీ హాస్య దర్శకుడు రేలంగి
- ముగిసిన నాటకోత్సవాలు

భద్రాచలం, వెలుగు : నాటిక బతకాలి, మనమంతా బతికించుకోవాలని సినీ హాస్య దర్శకులు రేలంగి నర్సింహారావు అన్నారు. భద్రాద్రి కళాభారతి 17వ అంతరాష్ట్ర తెలుగు నాటకోత్సవాల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరు ఉద్యోగులు విశాల హృదయంతో నాటికను బతికించుకునేందుకు పడుతున్న తాపత్రయం చూస్తుంటే ముచ్చటేస్తోందన్నారు. ఈ ప్రాంత ప్రజలు కూడా ఏటా ఒక పండుగగా ఈ నాటకోత్సవాల్లో భాగస్వాములు కావడం విశేషమన్నారు. భద్రాద్రి రాముని ఆశీస్సులతో, మీ మంచి హృదయాలతో నాటిక సజీవంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఆయనకు కళాభారతి నిర్వాహకులు సన్మానం చేశారు. హైదరాబాదు కళాంజలి వారి 'పంజరం' నాటిక విశేషంగా ఆకట్టుకుంది. ఆశ అనే పంజరంలో చిక్కుకుని నేటి మనిషి భావోద్వేగాలు, బంధాలూ, ప్రేమలూ, వాత్సల్యాలు, చివరకు తనకు తాను దహనమై పోతున్న తీరును దర్శకులు కొల్లా రాధాకృష్ణ చూపించారు. చిలకలూరిపేటకు చెందిన ది అమెచ్యూర్ డ్రమేటిక్ అసోషియేషన్ కళాకారులు ప్రదర్శించిన 'అక్క అలుగుడు.. చెల్లి సణుగుడు' నాటిక ఆద్యంతం నవ్వులు పండించింది. ముగింపు వేడుకల్లో కళాభారతి అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్, పంచాక్షరయ్య, అల్లం నాగేశ్వర రావు, పులి రాజారావు, నర్సింహారావు, తిప్పన సిద్ధులు, అడుసుమిల్లి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.





కాంగ్రెస్ నాయకురాలు రాణీబాయిని కండువా కప్పి టీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న వివేక్

ఆదర్శం కేసీఆర్ పాలన

- ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి
- కాటారం, మహాదేవపూర్, మహాముత్తారంలలో కొత్త సర్పంచులకు సన్మానం
- టీఆర్ఎస్‌లో చేరిన మహిళా కాంగ్రెస్ నేత రాణిబాయి

కాటారం, వెలుగు: కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రభుత్వ సలహాదారు జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ఇక్కడ కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలనే కేంద్రంతోపాటు అనేక రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. మంథని అసెంబ్లీ నియోజకవర్గంలోని మహాదేవపూర్, మహాముత్తారం, కాటారంలలో బుధవారం ఆయన పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుతో కలిసి కొత్తగా ఎన్నికైన సర్పంచులను సన్మానించారు. ఈ సందర్భంగా వివేక్, మధులకు టీఆర్ఎస్ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. మహాముత్తారంలో అంబేద్కర్ విగ్రహానికి వివేక్ పూలమాల వేసి నివాళి అర్పించారు. మహాదేవపూర్‌లో టీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాటారంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు రాణిబాయి తన అనుచరులతో కలిసి టీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ కండువా కప్పి ఆమెను వివేక్ పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్ జనరంజకపాలన వల్లనే రాణిబాయి లాంటి సీనియర్ నాయకులు టీఆర్ఎస్‌లోకి వస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్‌లో ఏకపక్షవిధానాలకు వ్యతిరేకంగా టీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు చెప్పిన రాణిబాయి, పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు.

కంపెనీలో కలకలం

- హైదరాబాద్‌లో సింగరేణి క్లర్క్ సంపత్ అరెస్టు
- కొత్తగూడెంలోని ఇంట్లో ఏసీబీ తనిఖీలు

భద్రాద్రికొత్తగూడెం, వెలుగు : సింగరేణి సంస్థలో ఒకరిని అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు బుధవారం అరెస్ట్ చేయడం కంపెనీలో సంచలనం సృష్టించింది. పలు మార్లు పలువురిపై వచ్చిన ఆరోపణల క్రమంలో ఏసీబీ అధికారులు విచారణ నిర్వహించారు, కానీ అరెస్టు చేసిన దాఖలాలు మాత్రం లేవు. కార్మిక సంఘం నేత, అసిస్టెంట్ సూపరింటెండెంట్ (క్లర్క్) సంపత్‌ను హైదరాబాద్‌లో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. కొత్తగూడెంలోని ఆయన సింగరేణి క్వార్టర్‌లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మెడికల్ బోర్డు అన్‌ఫిట్ కుంభకోణంలో సంపత్‌పై ఆరోపణల నేపథ్యంలోనే ఏసీబీ తనిఖీ నిర్వహించినట్టుగా ప్రచారం సాగుతోంది. ఖమ్మం ఏసీబీ సీఐ రమణమూర్తి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామన్నారు. పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సంపత్ విధులకు గైర్హాజరు, ఇతరత్రా ఆరోపణలతో యాజమాన్యం ఇటీవల ఆయనను విధులనుంచి డిస్మిస్ చేసింది. కొత్తగూడెంలోని ఆయన ఉంటున్న క్వార్టర్ ఖాళీ చేయాలని ఆదేశించింది. క్వార్టర్ ఖాళీ చేసే విషయంపై సంపత్ కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నట్టు సమాచారం. సింగరేణిలో మెడికల్ బోర్డు ద్వారా ఎవరైతే అన్‌ఫిట్ అవుతారో వాళ్ల వారసులకు కంపెనీలో యాజమాన్యం ఉద్యోగం కల్పిస్తుంది. ఈ క్రమంలోనే అర్హులు కాకున్నప్పటికీ కార్మికుల నుంచి డబ్బులు తీసుకుని అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో కొంత కాలంగా కొత్తగూడెంలోని హెడ్డాఫీస్‌లో ఓ వైపు ఏసీబీ అధికారులు మరోవైపు సింగరేణి విజిలెన్స్ ఆధ్వర్యంలో పలువురు రిటైరైన కార్మికులను విచారించారు. ఆ క్రమంలోనే సంపత్‌తో ఫోన్లో మాట్లాడారు, ఆయనతో సన్నిహితంగా ఉన్నారనే ఆరోపణలతో పలువురిని బదిలీలు చేసింది.

హైదరాబాద్‌లో సంపత్ అరెస్ట్

హైదరాబాద్‌లో సంపత్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. 2014 ప్రాంతంలో సంపత్‌పై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. కార్మికులను అన్‌ఫిట్ చేయించి ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఒక ఏరియా నుంచి మరో ఏరియాకు కార్మికులను బదిలీ చేయిస్తామని సంపత్ అవినీతికి పాల్పడ్డట్టూ ఆరోపణలున్నాయి. సంపత్‌తో చనువుగాఉన్నారనే ఆరోపణలతో పలువురిని యాజమాన్యం అరెస్టు చే సింది. సంపత్ అరెస్టుతో పలువురు అధికారుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. అంతేకాకుండా గతంలో డైరెక్టర్ గా పనిచేసిన ఓ అధికారి మెడకు చుట్టుకునే అవకాశంఉన్నట్టుగా ప్రచారం సాగుతోంది.



సంపత్ ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు

ఒకే కుటుంబంలో నలుగురి మృతి

బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

ఖమ్మం, వెలుగు: రెక్కాడితే డొక్కాడని ఆ కుటుంబానికి నిన్న మొన్నటి వరకు నిలువ నీడ లేదు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వడంతో చిన్నచిన్న పనులు చేసుకుంటూ సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. అర్ధరాత్రి జరిగిన ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. నలుగురిని బలి తీసుకుంది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన పాలపాటి వెంకటేశ్వర్లు(40), అతని తల్లి పిచ్చమ్మ(70), పిల్లలు కోదండరాం(10), ప్రణయ్(6) మంగళవారం బైక్ పై ముదిగొండ మండలం వెంకటాపురంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. రాత్రి 11.30 సమయంలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. కట్టలమ్మ చెరువు నక్కల తూము దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో నలుగురూ అక్కడికక్కడే మృతిచెందారు. వీరు ఎంతకీ గ్రామానికి చేరుకోకపోవడంతో వారితోపాటు మరో బైక్ పై వచ్చిన బంధువులు వెనక్కి వెళ్లి చూశారు. తూము దగ్గర నలుగురు నలువైపులా పడివున్నారు. ఖమ్మం ఏసీపీ వెంకట్రావు, కూసుమంచి సీఐ మురళి, నేలకొండపల్లి ఎస్ఐ గౌతమ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భర్త, పిల్లలను కోల్పోయి..

కుటుంబంలో నలుగురు మృత్యువాత పడడంతో ఇప్పుడు ఆ చిన్నారుల తల్లి విజయ ఒంటరిగా మిగిలింది. చీకట్లో చలికి వద్దని తల్లి వారించినా వినకుండా చిన్నారులు తండ్రితో బయలుదేరారు. బాయ్ మమ్మీ అంటూ చెప్పివెళ్లిన చిన్నారులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లి రోదన ఆపడం ఎవరితరం కాలేదు. ఒకే కుటుంబంలో నలుగురు మృత్యువాత పడడంతో నేలకొండపల్లిలో విషాదం అలముకుంది. మృతుడి భార్య విజయను ఆదుకోవాలంటూ బంధువులు, స్థానికులు నేలకొండపల్లి ఆందోళన నిర్వహించారు.



కోదండరామ్, ప్రణయ్ (ఫైల్)

మౌలిక వసతులకు ప్రాధాన్యమివ్వండి

జోనల్ జీఎంలతో రైల్వే బోర్డు చైర్మన్

హైదరాబాద్, వెలుగు: రైల్వేలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిచ్చి, ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు నిధులు ఉపయోగించాలని రైల్వే బోర్డు చైర్మన్ వినోద్ కుమార్ యాదవ్ సూచించారు. బుధవారం ఢిల్లీ నుంచి అన్ని జోన్ల జనరల్ మేనేజర్లతో పాటు ఆర్వీఎన్ఎల్, రైట్స్, కోర్ సంస్థ ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కొత్త రైలు మార్గాలు, డబ్లింగ్, ట్రిప్లింగ్, విద్యుద్దీకరణ తదితర పనులను మార్చిలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. భూసేకరణకు ముందస్తు ప్రణాళికలు వేసి ప్రాజెక్టుల నిర్మాణంలో ఆలస్యం జరగకుండా అవసరమైన నిధులను కేటాయించాలన్నారు. సరుకు రవాణా ఎగుమతులకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జోన్ పనితీరు, సాధించిన విజయాలకు సంబంధించిన నివేదికను జీఎం గజానన్ మాల్యా చైర్మన్‌కు అందజేశారు.

విద్యార్థినుల హెల్త్ కిట్లకు రూ.30కోట్లు విడుదల

వెలుగు కథనానికి స్పందన

హైదరాబాద్, వెలుగు: ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థినులకు ఇచ్చే హైజెనిక్ హెల్త్‌కిట్ల సరఫరా కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.30కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌మిశ్రా జీవో విడుదల చేశారు. 2018 19 విద్యాసంవత్సరానికి గానూ రెండు, మూడో విడతల్లో కిట్ల పంపిణీ కోసం ఈ నిధులు వినియోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యాశాఖ వద్ద నిధులు లేకపోవడంతో విద్యార్థినులకు హెల్త్ కిట్లు అందడం లేదన్న విషయాన్ని జనవరి 23న 'హెల్త్ కిట్లు అందుతలే' కథనంతో 'వెలుగు' పత్రిక ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చింది.

'మోడల్' స్టాఫ్ వేతనాలకు రూ.40.49కోట్లు

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న సిబ్బందికి జనవరి నుంచి మార్చి వరకు అందాల్సిన వేతనాలకు రూ.40.49కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు ఇస్తూ అజయ్‌మిశ్రా జీవో విడుదల చేశారు.

మే నెలాఖరుకు 'చనాఖా–కొరాటా'

సీఎం ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే

హైదరాబాద్, వెలుగు: చనాఖా-కొరాటా బ్యారేజీ పనులను మే నెలాఖరుకు పూర్తి చేస్తామని సీఎం ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే తెలిపారు. పనులు అనుకున్న సమయానికి పూర్తి చేసేలా రోజువారీ లక్ష్యాలు పెట్టుకున్నామని చెప్పారు. తొలిదశలో 20 వేల ఎకరాలకు సాగునీరిస్తామని తెలిపారు. మంగళవారం చనాఖా-కొరాటా, బుధవారం సదర్మట్, కాళేశ్వరం ప్యాకేజీ-27, 28 పనులను శ్రీధర్ పరిశీలించారు. సదర్మట్ పనులు 50 శాతం పూర్తయ్యాయని, సెప్టెంబర్ నెలాఖరుకు పనులు పూర్తి చేసేందుకు వర్క్ ఏజెన్సీ అంగీకరించిందని చెప్పారు. బ్యారేజీ పూర్తయితే 18 వేల ఎకరాలకు నీరందుతుందన్నారు. కాళేశ్వరం ప్యాకేజీ 27లో పంపుహౌస్, కాలువల పనులు జరుగుతున్నాయని, కాళేశ్వరం రివర్స్ పంపింగ్‌తో 15 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని, 20 చెరువులు నింపుతామని తెలిపారు. ప్యాకేజీ కింద నిర్మల్ నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు నీరందుతుందన్నారు. ఎస్సారెస్పీ ఎగువ వర్షాలు కురవకున్నా జూన్‌కు రివర్స్ పంపింగ్ ద్వారా కాళేశ్వరం నీటిని ఎత్తిపోస్తామని తెలిపారు.

బీఎస్సీలో సోషియాలజీ!



- డిఫరెంట్ కోర్సులు తీసుకొస్తున్న కళాశాల విద్యాశాఖ
- అందుబాటులోకి కొత్త తరహా చదువులు
- రెగ్యులర్ కోర్సుల్లో ఇష్టమైన సబ్జెక్టు మిక్స్ చేసుకునే అవకాశం
- ప్రస్తుతానికి ఆరు సబ్జెక్టులు ఎంచుకునే చాన్స్
- డిగ్రీలో వచ్చే ఏడాది నుంచే అమలు

హైదరాబాద్, వెలుగు:

బీకాంలో ఫిజిక్స్.. గుర్తుంది కదా. ఓ ఎమ్మెల్యే సీరియస్‌గా చెప్పిన పెద్ద జోక్!. ఇదేం కోర్సురా బాబూ.. అంటూ తెగ నవ్వుకున్నాం. కానీ ఆ నవ్వులాట నిజం కాబోతోంది. అలాంటి కోర్సులే వచ్చే ఏడాది నుంచి డిగ్రీలో అందుబాటులోకి రానున్నాయి. బీఎస్సీలో సోషియాలజీ, మ్యాథ్స్‌తో సైకాలజీ, జియాలజీ, బాటనీతో లిటరేచర్, జర్నలిజం.. ఇలా నచ్చిన సబ్జెక్టుల్ని మిక్స్ చేసుకుని చదువుకునే అవకాశాన్ని తీసుకొచ్చింది కళాశాల విద్యాశాఖ. అయితే ఇలా మిక్స్ చేసుకునే సబ్జెక్టులుగా కేవలం ఆరు మాత్రమే ఈ ఏడాది అందుబాటులోకి వస్తున్నాయి. భవిష్యత్‌లో వీటిని 15 వరకు పెంచే ఆలోచన చేస్తున్నారు.

డిగ్రీతోపాటే దీనికీ గుర్తింపు

ఈ కొత్త విధానం ద్వారా డిగ్రీలో ఒక కోర్సులో చేరిన విద్యార్థి.. ఆ కోర్సుతో సంబంధంలేని ఏదైనా ఒక సబ్జెక్టును ఆసక్తి మేరకు తన రెగ్యులర్ డిగ్రీతోపాటే చదువుకోవచ్చు. అందుకు సంబంధించిన సర్టిఫికేషన్ కూడా డిగ్రీ మెమోతోపాటే కలిపి వచ్చేస్తుంది. ఇప్పటివరకూ ఎంపీసీ అంటే గణితం, సైన్స్ సబ్జెక్టులు మాత్రమే. కానీ వచ్చే ఏడాది నుంచి సైన్స్, గణితం కోర్సుల్లోనూ ఆర్ట్స్ సబ్జెక్టును కలిపి చదువుకోవచ్చు. ఇప్పటికే కొన్ని కోర్సుల్లో చాయిస్ బేస్ట్ క్రెడిట్స్ సిస్టమ్ (సీబీసీఎస్) విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని మాదిరిగానే ఈ ఆన్‌లైన్ కోర్సు కొనసాగుతుంది.

అంతా ఆన్‌లైన్‌లోనే..

కేంద్రం అమలు చేస్తున్న స్వయం (స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ ఆస్పైరింగ్ మైండ్స్) పథకంలో భాగమైన మూక్స్ (మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్) విధానంలో ఈ కోర్సులను అందిస్తారు. తొలుత రాష్ట్రంలోని 125 సర్కారీ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు ఇది అందుబాటులోకి వస్తుంది. ఇది పూర్తిగా ఆన్‌లైన్ విధానం. డిగ్రీలో చేరిన రెగ్యులర్ కోర్సు విద్యార్థి తన కోర్సులోని ఒక సబ్జెక్టుకు బదులు సోషియాలజీ, సైకాలజీ, జియాలజీ, జాగ్రఫీ, లిటరేచర్, జర్నలిజం సబ్జెక్టుల్లోని ఏదో ఒక దాన్ని ఎంచుకోవచ్చు. ఆ సబ్జెక్టు చెప్పే లెక్చరర్ కాలేజీలో ఉంటే వారితో విద్యాబోధన చేయిస్తారు. లేకుంటే ఆన్‌లోన్‌లోనే మెటీరియల్, బోధనాంశాలు దొరుకుతాయి. పరీక్ష కూడా ఆన్‌లైన్‌లోనే. మార్కుల జాబితా కళాశాలకు వస్తుంది. దీన్ని సదరు విద్యార్థి రెగ్యులర్ మెమోకు కలిపి డిగ్రీ సర్టిఫికెట్‌ను కళాశాల జారీ చేస్తుంది. ఒక్కో కోర్సులో 120 మందికి ఆన్‌లైన్‌లో సబ్జెక్టులను ఎంచుకునే అవకాశం ఇస్తున్నారు.

సివిల్స్, గ్రూప్స్ రాసేవాళ్లకు ఉపయోగం

ప్రస్తుతానికి ఈ ఆరు సబ్జెక్టుల సిలబస్ రూపకల్పన జరుగుతోంది. వీటిని 15కు పెంచుతాం. సివిల్స్, గ్రూప్స్‌తోపాటు పలు పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఈ ఆన్‌లైన్ విధానం తీసుకొస్తున్నాం. వచ్చే ఏడాది నుంచే దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- నవీన్ మిట్టల్,
కళాశాల విద్యాశాఖ కమిషనర్

14.4 లక్షల ఎకరాలకు నీళ్లిస్తాం

- ఖరీఫ్ నుంచి ఎస్సారెస్పీ పూర్తి ఆయకట్టుకు సాగునీరు
- ఆలోగా డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేస్తాం: ఈటల
- ఎల్ఎండీ దిగువ ఆయకట్టు సమస్యలపై సమావేశం
- 10 నుంచి ఒక్క తడికి ఎల్ఎండీ నీరివ్వాలని నిర్ణయం
- సీఎం కేసీఆర్‌కు నివేదిక

హైదరాబాద్, వెలుగు:

వచ్చే ఖరీఫ్ నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి ఆయకట్టు 14.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందజేస్తామని మాజీ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. ఎస్సారెస్పీ ఆయకట్టు కింద రెండు పంటలకు పూర్తి స్థాయిలో నీళ్లు ఇస్తామని, ఎల్ఎండీకి ఎగువ పూర్తి ఆయకట్టుకు నీళ్లు అందజేస్తామన్నారు. లోయర్ మానేరు డ్యాం దిగువ ఆయకట్టు సమస్యలపై బుధవారం జలసౌధలో ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు సమావేశమై చర్చించారు. ఈఎన్సీ మురళీధర్ నేతృత్వంలో జరిగిన భేటీలో మాజీ మంత్రులు ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ బి. వినోద్, పలువురు ఎమ్మెల్యేలు, ఇంజనీర్లు పాల్గొన్నారు. రబీలో రైతులు సాగు చేసిన పంటలను కాపాడేందుకు ఈ నెల 10 నుంచి ఎల్ఎండీ దిగువ ఆయకట్టుకు ఒక్క తడికి నీటిని ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించామని ఈటల చెప్పారు. సమావేశం అనంతరం ఈఎన్సీ మురళీధర్‌తో కలిసి ఈటల మీడియాతో మాట్లాడారు.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం

ఉమ్మడి రాష్ట్రంలో 14.40 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చేందుకు పోచంపాడు ప్రాజెక్టును కట్టినా 6 లక్షల ఎకరాలకు మించి నీళ్లిచ్చింది లేదని, ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల రీ డిజైనింగ్ చేపట్టారని ఈటల చెప్పారు. వెయ్యి కోట్లతో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పనులు చేపట్టామన్నారు. లోయర్ మానేరు డ్యామ్ కింద ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని 9 లక్షల ఎకరాలకు వచ్చే జూన్‌లో సాగునీరందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. డిస్ట్రిబ్యూటరీ పనులు పెండింగ్ ఉన్నాయని, మరికొన్ని కొత్తవి నిర్మించాల్సి ఉందని, ఇందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించామని తెలిపారు. జూన్ 30లోగా అన్ని పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కాళేశ్వరంతో మిడ్ మానేరు అనుసంధానం జూన్‌లోగా పూర్తవుతుందని చెప్పారు. పోచంపాడు నుంచి ఖమ్మం వరకు అదనపు ఆయకట్టుకు నీళ్లిచ్చేలా ఎత్తిపోతల పథకాలకు రూపకల్పన చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వొడితెల సతీశ్‌కుమార్, ఆరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, సోలిపేట రామలింగారెడ్డి, సీతక్క, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, కరీంనగర్ ప్రాజెక్ట్స్ ఈఎన్సీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన ఈటల జలసౌధ సమావేశంలో చర్చించిన అంశాలు, క్షేత్ర స్థాయిలో ఉన్న ఇబ్బందులు, భూ సేకరణ, కొత్త లింక్‌ల ఏర్పాటు తదితర అంశాలపై ఆయనకు నివేదికను అందజేశారు.

60 శాతం విత్తనాలు రాష్ట్రం నుంచే

- వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పార్థసారథి

హైదరాబాద్, వెలుగు: దేశానికి కావాల్సిన 60శాతం విత్తనాలు రాష్ట్రం నుంచే సరఫరా అవుతున్నాయని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి అన్నారు. బుధవారం విత్తన ధృవీకరణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాజెక్ట్ ప్లానింగ్ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. వ్యవసాయం లాభసాటిగా మారి రైతు బాగుపడాలంటే విత్తనాలే కీలకమని, అలాంటి విత్తన రంగం అభివృద్ధిలో మరిన్ని సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రం విత్తనోత్పత్తి, విత్తన ధ్రువీకరణలో మోడల్‌గా నిలిచిందన్నారు. త్వరలో హైదరాబాద్‌లో జరుగనున్న విత్తనసదస్సుకు రావాలని జర్మనీ అధికారులను ఈ సందర్భంగా ఆహ్వానించారు. డ్రోన్, జీయో ట్యాగింగ్, బార్‌కోడెడ్, జీపీఎస్ టెక్నాలజీద్వారా విత్తనోత్పత్తి చేసి మార్కెట్‌లో కల్తీ విత్తనాలను అరికట్టాలని సూచించారు.

6775 కుటుంబాలకు రైతు బీమా

రాష్ట్రంలో ఇప్పటివరకు 6775 చనిపోయిన రైతు కుటుంబాలకు రైతు బీమా ద్వారా రూ.338.75కోట్ల పరిహారం అందించామని పార్థసారథి వెల్లడించారు. బుధవారం రైతుబీమాపై బీమా సంస్థ అధికారులు, వ్యవసాయ అధికారులతో సమీక్షించారు.

ఎస్జీటీలకు ప్రమోషన్లివ్వండి: పీఆర్టీయూ

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను కేటాయించి, ఆ పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేయాలని పీఆర్టీయూటీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారెడ్డి అంజిరెడ్డి, చెన్నయ్య ప్రభుత్వాన్ని కోరారు. భాషా పండితులు, పీఈటీలకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించడంతో కొందరు ఎస్జీటీలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఇప్పుడున్న ఎస్జీటీల్లో సీనియర్లకు హెడ్‌మాస్టర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని బుధవారం విజ్ఞప్తి చేశారు.

ఇకపై డిగ్రీకి పేపర్ లెస్ కౌన్సెలింగ్

హైదరాబాద్, వెలుగు: రానున్న విద్యా సంవత్సరం 2019-20 నుంచి డిగ్రీ అడ్మిషన్లలో పేపర్‌లెస్(ఆన్‌లైన్) కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ టి పాపిరెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని జేఎన్ఏఎఫ్‌యూలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్(దోస్త్) రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 74 దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్లను పటిష్టం చేయడం ద్వారా విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపించాలన్నారు. ఏపీ ఇంటర్‌బోర్డు, సీబీఎస్ఈ, ఐబీ సెలబస్‌కు సంబంధించిన సర్టిఫికేట్లు ఆన్‌లైన్‌లోనే పరిశీంచుకునే విధంగా ఆయా బోర్డులతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. డిగ్రీ అడ్మిషన్లను వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఎంసెట్ తరహాలో కౌన్సెలింగ్ నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

రోడ్ల రిపేర్‌కు ఐదేళ్ల యాక్షన్ ప్లాన్

- కసరత్తు చేస్తున్న రోడ్లు భవనాల శాఖ
- మూడు రకాలుగా పనుల విభజన
- హెచ్ఐసీసీలోని న్యాక్ లో అధికారులతో ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ భేటీ

హైదరాబాద్, వెలుగు:

“రోడ్లు అద్దాల్లా మెరవాలి. ప్రతి పంచాయతీకి బీటీ రోడ్ ఉండాలి. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసల రోడ్డు ఉండాలి. ఇందుకు ఎన్ని నిధులైనా విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నీటి పారుదల ప్రాజెక్టుల తర్వాత రోడ్లకే ప్రాధాన్యం ఇస్తున్నాం. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి. కొత్త రోడ్లు ఎక్కడ అవసరం, మరమ్మతులు చేయాల్సిన రోడ్లు ఎన్ని, వాటికయ్యే వ్యయం, బ్రిడ్జిల మరమ్మతులు, నిర్మాణం వంటి అంశాలపై జిల్లా అధికారుల నుంచి సమగ్ర నివేదిక తీసుకొని అందజేయండి”.. ఇటీవల రోడ్లు భవనాల శాఖ సమీక్షలో అధికారులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆదేశాలివి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లకు చేయాల్సిన పనులపై రోడ్లు భవనాల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పనులను మూడు రకాలు గా విభజించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. 15వ తేదీ కల్లా తమ యాక్షన్ ప్లాన్ అందజేయాలని 19 సర్కిళ్ల అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన కీలక సమావేశం బుధవారం హైదరాబాద్ లో జరిగింది. హెచ్ఐసీసీలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్(న్యాక్)లో అన్ని జిల్లాల రోడ్లు భవనాల శాఖ అధికారులతో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)లు గణపతి రెడ్డి, రవీందర్ రెడ్డి భేటీ అయ్యారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న జూనియర్ ఇంజనీర్ నుంచి చీఫ్ ఇంజనీర్ల వరకు సుమారు 950 మంది హాజరయ్యారు.



కనెక్టివిటీ ఉండాలి..

ప్రతి గ్రామానికి బీటీ రోడ్ వేయటంతోపాటు సమీప రోడ్లకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని అధికారులను రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ ఆదేశించారు. రోడ్ల విషయంలో సీఎం ఇస్తున్న ప్రాధాన్యానికి తగ్గట్లుగా పనిచేసి, ఆయన నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. ప్రభుత్వ చొరవను అందిపుచ్చుకోవాలన్నారు. నాలుగేళ్లలో 3,150 కిలోమీటర్ల జాతీయ రహదారులు సాధించామని, మరో 1,800 కిలోమీటర్ల నిర్మాణం కోసం కేంద్రానికి డీపీఆర్ లు పంపామని ఈఎన్సీ గణపతి రెడ్డి చెప్పారు. ఇటీవల 6,431 పంచాయతీ రోడ్లు ఆర్ అండ్ బీకి బదిలీ అయ్యాయని, వీటన్నింటిని బీటీ రోడ్లు గా మార్చేందుకు కృషి చేస్తున్నామని ఈఎన్సీ రవీందర్ రావు తెలిపారు. అలాగే 135 అసిస్టెంట్ ఏఈల భర్తీకి ప్రతిపాదనలు పంపామని, భర్తీకి ప్రభుత్వానికి సానుకూలంగా ఉందని ఇన్ చార్జ్ ఈఎన్సీ లింగయ్య తెలిపారు.

రోడ్డు భద్రతే ముఖ్యం: ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మ

హైదరాబాద్, వెలుగు: ఆర్టీసీలో ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మ చెప్పారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం ఆదేశాల మేరకు ఆర్టీసీలో సిబ్బంది, ప్రయాణికులకు అవగాహన పెంచేలా రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. గురువారం ఆర్టీసీ కళాభవన్‌లో అత్యల్ప ప్రమాదరహిత రికార్డు ఉన్న డ్రైవర్లను సన్మానిస్తామన్నారు. రాష్ట్ర, జోనల్, రీజియన్, డిపోల వారీగా సత్కరించనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ నేత నూతి శ్రీకాంత్‌కు నోటీసులు

హైదరాబాద్, వెలుగు: అంబర్‌పేట కాంగ్రెస్ నేత నూతి శ్రీకాంత్‌కు బుధవారం పీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీస్ జారీ చేసింది. ఈ నెల 2న గాంధీభవన్‌లో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సన్మాన కార్యక్రమంలో నూతి, కాంగ్రెస్ నేత వి. హన్మంతరావు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. దీనిపై బుధవారం నేతికి షోకాజ్ నోటీస్ జారీ చేసింది. వారంలోపు వివరణ ఇవ్వాలని పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కోదండరెడ్డి పేర్కొన్నారు.

క్విక్ బైట్స్



మనకూ ఓ మహిళా వర్సిటీ

వరంగల్ లేదా హైదరాబాద్‌లో నెలకొల్పే చాన్స్

వరంగల్, వెలుగు :

రాష్ట్రంలో మరో యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రత్యేకించి మహిళలకోసం ప్లాన్ చేస్తున్న ఆ యూనివర్సిటీని వరంగల్ లేదా హైదరాబాద్‌లో నెలకొల్పనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీని తిరుపతిలో, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీని విజయవాడలో ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ రెండూ ఏపీ వెళ్లాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వం రెండేళ్లలోనే వరంగల్‌లో కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది. కానీ మహిళా వర్సిటీని మాత్రం ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం దీనిపై కదలిక వచ్చిందని అంటున్నారు.

హైదరాబాదా.. వరంగల్లా?

ఓయూ పరిధిలో నడుస్తున్న కోఠి ఉమెన్స్ కాలేజీని మహిళా వర్సిటీగా అప్‌గ్రేడ్ చేసే అంశాన్ని ఏడాది క్రితం ప్రభుత్వం పరిశీలించింది. అప్పటి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి కోఠి ఉమెన్స్ కాలేజీని సందర్శించారు. కానీ ఆ తర్వాత ఈ అంశంపై కదలిక లేదు. అయితే సోమవారం కడియం శ్రీహరి వరంగల్‌లో మాట్లాడుతూ 'త్వరలో రాష్ట్రంలో మహిళా వర్సిటీ ఏర్పాటు చేస్తాం. గత ఏడాదే పెట్టాల్సింది. కానీ ఆగిపోయింది. ఈ విద్యాసంవత్సరంలో ప్రారంభిస్తాం. అది హైదరాబాదా.. వరంగల్లా అనేది స్పష్టత రావాల్సి ఉంది' అన్నారు.

'రాణి రుద్రమ' పేరుతో..

వరంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని అనేక సందర్భాల్లో సీఎం కేసీఆర్ ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే ప్రముఖ విద్యాసంస్థలను వరంగల్‌కు కేటాయిస్తూ వచ్చారు. కాళోజీ హెల్త్ వర్సిటీ, కేంద్ర గిరిజన యూనివర్సిటీ, వెటర్నటీ, అగ్రికల్చర్ కాలేజీలు మంజూరు చేశారు. వీటికి తోడు ప్రైవేట్ సంస్థలైన హైదరాబాద్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటయ్యాయి. వరంగల్ కేంద్రంగా 'రాణి రుద్రమ' పేరుతో మహిళా వర్సిటీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎన్నాళ్లుగానో ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభానికి నాలుగు నెలలే ఉంది. ఈ లోగా మహిళా వర్సిటీని వరంగల్‌కు మంజూరు చేయించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పీఈటీల పాలాభిషేకం

హైదరాబాద్, వెలుగు: ప్రభుత్వ స్కూళ్లలో పనిచేస్తున్న పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్ స్థాయి ప్రమోషన్ కల్పించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతగా పీఈటీలు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో బుధవారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ...పీఈటీల చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు. సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో 1,833మంది పీఈటీలకు లబ్ధి కలుగుతుందన్నారు. విద్యాశాఖ చరిత్రలో ఒకేసారి ఇంతమందికి పదోన్నతులు కల్పించడం ఇదే మొదటిసారి అని పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ సోమేశ్వర్ చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ సెక్రెటరీ రాఘవరెడ్డి, నాయకులు బాల్‌రాజు, వెంకటేశ్వర్లు, సమ్మయ్య పాల్గొన్నారు.

మంత్రివర్గం లేకనే ఈ సమస్యలు: మల్లు రవి

హైదరాబాద్, వెలుగు: ప్రభుత్వం మంత్రి వర్గాన్ని విస్తరించకపోవడంతో పరిపాలన స్తంభించిపోతోందని, అధికారులకు సమస్యలు ఎదురవుతున్నాయని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి బుధవారం గాంధీభవన్‌లో ఆరోపించారు. మహబూబ్‌నగర్ ఎత్తి పోతల పథకానికి కరెంట్ బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం బాధాకరమన్నారు. చాలా శాఖల్లో ఉన్న ఇలాంటి పరిస్థితిని సీఎం కేసీఆర్ చక్కదిద్దాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీపై విమర్శలు గుప్పించారు. పశ్చిమ బెంగాల్‌లో మమత బెనర్జీ సర్కార్‌ను బలహీన పరిచేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఫెడరల్ స్ఫూర్తిని మోడీ ప్రభుత్వం దెబ్బతీసేలా ఉందన్నారు.



బుధవారం కేంద్ర మంత్రి జావడేకర్‌ను కలిసిన కడియం శ్రీహరి, పెద్ది సుదర్శన్‌రెడ్డి

వచ్చే ఏడాది నుంచే గిరిజన వర్సిటీ

కేంద్ర మంత్రి జావడేకర్ హామీ: కడియం

న్యూఢిల్లీ:

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన వర్సిటీని ప్రారంభించనున్నట్లు కేంద్ర మంత్రి జావడేకర్ హామీ ఇచ్చారని కడియం శ్రీహరి చెప్పారు. యూనివర్సిటీ ఏర్పాటులో ఆలస్యాన్ని నివారించాలన్న విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈమేరకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి కడియం బుధవారం మంత్రి జావడేకర్ తో సమావేశమయ్యారు. గిరిజన వర్సిటీలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్న కోర్సులను ప్రవేశపెట్టాలని, గిరిజనులకు ప్రత్యేక కోటా ఏర్పాటు చేయాలని కోరామని కడియం చెప్పారు. తెలంగాణకు 13 నవోదయ, 21 కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ విషయంపై గతంలో సీఎం కేసీఆర్, విద్యా మంత్రి హోదాలో తాను చాలా సందర్భాల్లో కేంద్రానికి విజ్ఞప్తి చేశామన్నారు. వర్సిటీ ఏర్పాటుతో పాటు విద్యాలయాల మంజూరుకు మంత్రి జావడేకర్‌సానుకూలంగా స్పందించారని, వచ్చే విద్యాసంవత్సరంలో వర్సిటీని తప్పకుండా ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు.

ఎన్నికల్లో ఎక్సైజ్‌శాఖ పనితీరు భేష్

బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌రావు

హైదరాబాద్, వెలుగు: అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికల్లో ఆబ్కారీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేశారని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌రావు ప్రశంసించారు. హైదరాబాద్‌లో బుధవారం ఎక్సైజ్ కమిషనర్ సోమేష్‌కుమార్‌తో కలిసి రాష్ట్ర ఎక్సైజ్ సంఘం డైరీని ఆవిష్కరించారు. ఈ ఎన్నికల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడంతోనే ఎన్నికల సంఘం గుర్తింపు పొందామని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందన్నారు. రైతుబంధు, హరితహారం వంటి కార్యక్రమాల గురించి తెలుసుకునేందుకు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తెలంగాణ బాట పడుతున్నారన్నారు. ఎక్సైజ్ శాఖలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ సోమేష్‌కుమార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్, ఎక్సైజ్ శాఖ సీనియర్ అధికారులు అజయ్‌రావు, వివేకానంద, శ్రీనివాసరావు, ఖురేషి, దత్తరాజు గౌడ్, రమాదేవి, రాంసింగ్ పాల్గొన్నారు.

పొలిటికల్ పార్టీలకు పైసలెవరు ఇస్తుండ్రు?

రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే సంప్రదాయం కేవలం మన దేశానికే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ ఉన్నదే. అయితే మిగతా దేశాల్లో పరిస్థితి వేరు. ఏ రాజకీయ పార్టీకి ఎవరు డొనేషన్లు ఇచ్చారు? ఎంత అమౌంట్ ఇచ్చారు? అనేవి అక్కడ ఓపెన్ గానే ఉంటాయి. మన దేశంలో పరిస్థితి భిన్నం. రాజకీయ పార్టీలకు డొనేషన్లు ఇక్కడ ఓ మిస్టరీ. మాయల ఫకీరు ప్రాణం ఏ చిలకలో ఉందో తెలుసుకోవచ్చు. కానీ పొలిటికల్ పార్టీలకు అందే నిధుల వివరాలు మాత్రం ఎవరికీ తెలియవు.

సంస్కరణలు చర్చలకే పరిమితం

ఎన్నికల సంస్కరణలపై చాలా ఏళ్లుగా చర్చ జరుగుతోంది. అయితే అవి కేవలం చర్చలకే పరిమితమవుతున్నాయి. ఎన్నికల వ్యవస్థలో చేయాల్సిన సంస్కరణలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) 2016 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వానికి చాంతాడంత జాబితా ఇచ్చింది. అందులో ఒకే ఒక్క సిఫారసును కేంద్రం అమలు చేసింది. అదే.. రాజకీయ పార్టీలకు నగదు రూపంలో ఇచ్చే డొనేషన్ల పరిమితిని ఇరవై వేల నుంచి రెండు వేలకు తగ్గించడం. జాబితాలోని మిగతా సిఫారసులన్నీ అటూ ఇటుగా బుట్టదాఖలయ్యాయి. 2004-05 నుంచి 2011-12 వరకు రాజకీయ పార్టీల ఆదాయంపై నిర్వహించిన అధ్యయనం కొన్ని చేదు నిజాలను బయటపెట్టింది. పార్టీలకు వస్తున్న విరాళాల్లో 75 నుంచి 80 శాతం వరకు అసలు ఎక్కడి నుంచి వస్తున్నాయో ఎవరికీ తెలియదు. దేశవ్యాప్తంగా అనేక జాతీయ పార్టీల పరిస్థితి ఇది.

బాండ్లలో బీజేపీ నంబర్–1

2017-18 ఆర్థిక సంవత్సరంలో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా నిధులు పోగేసుకున్న జాతీయ పార్టీల్లో బీజేపీ నంబర్-1గా నిలిచింది. 95 శాతం బాండ్లకు లబ్దిదారు బీజేపీయేనని వార్షిక ఆడిట్ నివేదిక లెక్కలు తేల్చి చెప్పాయి. ఆ ఏడాది ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అన్ని జాతీయ పార్టీలకు మొత్తం రూ.222 కోట్ల విరాళాలు అందాయి. వీటిలో ఒక్క బీజేపీకే రూ.210 కోట్లు అందినట్లు ఆడిట్ నివేదిక స్పష్టం చేసింది.

నోటిఫికేషన్ రాగానే నిధుల వరద

ఎన్నికల నోటిఫికేషన్ రాగానే రాజకీయ పార్టీలకు ఎడాపెడా నిధులు అందచేసే కార్యక్రమాలు మొదలవుతాయి. డొనేషన్ల విషయంలో అధికారంలో ఉన్న పార్టీదే సహజంగా అగ్రతాంబూలంగా ఉంటుంది. పవర్‌లో ఉన్న పార్టీకి ఫండ్స్ ఇవ్వడానికి బడా కార్పొరేట్ సంస్థలు తెగ ఉత్సాహం చూపుతాయి. అలాగని ప్రతిపక్ష పార్టీలను కూడా నిరుత్సాహపరచవు. అధికారంలో ఉన్న పార్టీ అయితే అవసరమైన పనులు చేయించుకోవడానికి ఉపయోగపడుతుంది. అదే అపోజిషన్ పార్టీలైతే భవిష్యత్తులో ఏమైనా లొసుగుల బయటపడ్డా రచ్చ చేయకుండా చూసుకోవచ్చు.



చిన్నాచితకా వ్యాపారాలు చేసుకునేవారు కూడా తాము సంపాదించుకున్న ప్రతి రూపాయికి సర్కారుకు లెక్కలు చూపించాలి. ఏ కారోబార్(పని)లో ఎన్ని రూపాయలొచ్చాయో వివరించాలి. అయితే, రాజకీయ పార్టీలకు వచ్చే విరాళాలకైతే లెక్కాపత్రం ఉండదు. ఆ వివరాలన్నీ చెప్పాల్సిన అవసరమే ఉండదు. ప్రజల భవిష్యత్‌ని మార్చే పవరున్న పొలిటికల్ పార్టీలకు చట్టం ఇచ్చిన మినహాయింపు ఇది. దీంతో వాటికి సొమ్ములెవరు ఇస్తున్నారనేది మిస్టరీగా మారింది.


2017–18లో వివిధ రాజకీయ పార్టీలకు విరాళాలు (రూ. కోట్లలో)	
బీజేపీకి	210
కాంగ్రెస్‌కి/ఎన్‌సీపీకి	26.66
ఇతర పార్టీలకు	12
నోట్ .. ఆరు నేషనల్ పార్టీల్లో సీపీఐ(ఎం)ని మినహాయించారు.	
తెలిసినవారు (నోన్ సోర్సెస్) ఇచ్చిన మొత్తం	467
తెలియనివారు (అన్నోన్ సోర్సెస్) ఇచ్చిన మొత్తం	689

1967 నుంచి పెరిగిన ధన ప్రభావం

1967 వరకు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పెద్దగా ధన ప్రభావం కనపడదు. 70ల నుంచి ఎన్నికల్లో మనీ పవర్ కీలకంగా మారింది. కోట్ల రూపాయలను మంచి నీళ్లలా ఖర్చుపెట్టగల శ్రీమంతులే ఎన్నికల బరిలో నిలవడం మొదలెట్టారు. పార్టీలకు నిధులు అవసరమయ్యాయి. ఈ దశలోనే పార్టీలకు ఇబ్బడిముబ్బడిగా నిధులు సేకరించి పెట్టగల 'ఫండ్ రైజర్స్' కావాల్సి వచ్చింది. కార్పొరేట్ శక్తుల నుంచి భారీగా విరాళాలను పోగు చేయగల వారే రాజకీయ పార్టీల్లో మొనగాళ్లయిపోయారు. రాజకీయ పార్టీలకు ఎవరి దగ్గరి నుంచి ఎంతెంత మొత్తంలో విరాళాలు అందుతున్నాయో సామాన్య ప్రజలు తెలుసుకునే వీలు కల్పించాలి. అప్పుడే ఎన్నికల్లో ధన ప్రభావానికి కాస్తయినా అడ్డుకట్ట వేయగలుగుతాం.

–'స్క్రోల్' సౌజన్యంతో

ఎలక్టోరల్ బాండ్లతో దిగజారిన పరిస్థితి



2018 జనవరిలో ఈ ఎపిసోడ్‌లో ఎలక్టోరల్ బాండ్లు ప్రవేశించాయి. దీంతో పరిస్థితి మరింత దిగజారింది. ఎలక్టోరల్ బాండ్ ఒక బేరర్ చెక్కులాంటిది. ఏ ఎస్‌బీఐ బ్రాంచ్‌లోనైనా దొరుకుతుంది. ఈ చెక్ సాయంతో ఇవ్వదలచుకున్న మొత్తాన్ని ఇష్టమైన రాజకీయ పార్టీ బ్యాంక్ ఖాతాలోకి చాలా సులభంగా ట్రాన్స్‌ఫర్ చేయొచ్చు. ఈ బాండ్‌పై దాత పేరు ఉండదు. దీనివల్ల ఎన్నికల నిధులకు సంబంధించి గోప్యత మరింత పెరుగుతుంది. డొనేషన్లు అందచేసే దాతలను వేధింపుల నుంచి రక్షించడం కోసం ఎలక్టోరల్ బాండ్ల ఎంట్రీకి అనుమతిచ్చినట్లు కేంద్రం తన చర్యను సమర్థించుకుంది. నిజానికి డబ్బులిచ్చిన దాతలెవరో? ఏ పొలిటికల్ పార్టీలకు ఇచ్చారో సంబంధిత బ్యాంకులకు తెలుస్తుంది. ఈ సమాచారం బ్యాంకులను, కేంద్రాన్ని కంట్రోల్ చేసే పార్టీ చేతుల్లోకి వెళ్తుంది. చివరాఖరికి ఈ డేటా రాజకీయ ప్రత్యర్థులకు పెద్ద మొత్తంలో డొనేషన్లు ఇచ్చినవారిని వేధించడానికి పవర్‌లో ఉన్న పార్టీలకు ఉపయోగపడుతుంది. ఎలక్టోరల్ బాండ్‌ను ఎవరైనా కొనుగోలు చేయొచ్చు. బాండ్ల ఎంట్రీతో ఎన్నికల్లో బ్లాక్ మనీ ప్రవేశానికి తలుపులు బార్లా తెరిచినట్లే భావించాలి.


ఏమన్నారంటే



పెళ్లికొడుకులేని విందు

ప్రతిపక్షాల మహాకూటమి గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. అది పెళ్లికొడుకు లేని వివాహ విందు లాంటిది.

– శివరాజ్ సింగ్ చౌహాన్, బీజేపీ లీడర్



దొందూ దొందే

బీజేపీకి, కాంగ్రెస్‌కి పెద్ద తేడా లేదు. రెండిటిదీ ఒకే ఫార్ములా. హిందుత్వ అజెండా ఆధారంగానే రాజకీయాలు చేస్తున్నాయి.


– మెహబూబా, జమ్మూకాశ్మీర్ మాజీ సీఎం



ఖురాన్ వ్యతిరేక చర్య

పాక్‌లోని సింధ్ రాష్ట్రంలో హిందూ ఆలయాన్ని కూల్చివేయడం దారుణం. ఈ ఘటనపై విచారణ చేపట్టాలి. ఖురాన్ ఈ చర్యను వ్యతిరేకిస్తుంది.

– ఇమ్రాన్ ఖాన్, పాకిస్థాన్ ప్రధాని



కొనితెచ్చుకోవద్దు

అమెరికాకు ఎవరైనా రావచ్చు. అది చట్ట ప్రకారం అయితేనే సుమా. అక్రమంగా వస్తే సమస్యలను కొనితెచ్చుకున్నట్లే.

– డొనాల్డ్ ట్రంప్, అమెరికా ప్రెసిడెంట్



అది నాకు నచ్చదు

తెలుగు సినిమా డైరెక్టర్ల దృష్టిలో హీరోయిన్లు వస్తువులు. వాళ్లను అలాగే చూపిస్తారు. అది నాకు నచ్చదు. అందుకే టాలీవుడ్ మూవీలు చేయట్లేదు.

– అమృతారావు, నటి



వరల్డ్ కప్ మాదే

ఈ ఏడాది ప్రపంచ కప్ మాదే. అయితే.. కండిషన్స్ అప్లై. నేను అనుకుంటున్న టీం వస్తేనే సాధ్యం. ఇండియా కూడా ఫేవరెట్టే.

– షేన్ వార్న్, ఆసీస్ మాజీ క్రికెటర్

మీరూ రాయొచ్చు!

సమాజాన్ని ప్రభావితం చేసే వేర్వేరు అంశాలమీద మీ అభిప్రాయాలను ఆర్టికల్ రూపంలో పంపవచ్చు. openpage@v6velugu.com



వాడిపోని పుష్పం.. ఓడుతున్న బాల్యం..

ఈ చిన్నోడు అమ్ముతున్న పూలు వాడిపోయేవి కావు. ఎందుకంటే అవి ప్లాస్టిక్ ఫ్లవర్స్. ఈ కృత్రిమ పువ్వులు మన దేశంలో బాగా పాపులర్. ఎక్కువగా డెకరేషన్‌కి వాడుతుంటారు. అలంకరించిన తెల్లారే ఎండిపోయాయని తీసేయాల్సిన అవసరం లేదు. అయితే పుస్తకాల సంచిని భుజాలకు తగిలించుకొని బడికి పోవాల్సిన వయసులో కుటుంబానికి ఇలా చేదోడుగా ఉండాల్సిన పరిస్థితుల్లో బాల్యం ఓడిపోతోంది. ముక్కుపచ్చలారని ఈ బాలుడు బుధవారం హైదరాబాద్ పాత బస్తీలో కనిపించాడు.

లైన్ ఆఫ్ 'కంట్రోల్' తప్పొద్దు

ఇండియా, పాకిస్థాన్‌లను వేరుచేస్తున్న నియంత్రణ రేఖ (లైన్ ఆఫ్ కంట్రోల్-ఎల్‌ఓసీ) వెంబడి నెలకొంటున్న ఉద్రిక్త పరిస్థితులు రెండు దేశాల మధ్య మరోసారి యుద్ధానికి దారితీసేలా ఉన్నాయి. అది న్యూక్లియర్ వార్‌గా మారినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఎల్‌ఓసీ పొడవునా చోటుచేసుకుంటున్న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనలు, ఆయుధ సామగ్రి చేరవేతలు, స్థానికంగా జరుగుతున్న ఫిరంగుల మార్పిళ్లు తదితరాలను బట్టి చూస్తుంటే ఇదే అనిపిస్తోంది. మిలటరీ కల్చర్‌ని, లైఫ్‌ని ఈ టెన్షన్లు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

70 ఏళ్ల నుంచి కాశ్మీర్ వివాదం

ఇండియా, పాక్ మధ్య కాశ్మీర్ సమస్య 70 ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉంది. ఇది గత 30 ఏళ్లుగా మరింత ముదురుతోంది. ఇరు దేశాల నడుమ చిన్న చిన్న ఎన్‌కౌంటర్లు మొదలుకొని భారీ టెర్రర్ ఇన్సిడెంట్ల వరకు అంతు లేకుండా పోతోంది . ఈ దాడులు ఇండియా సహనానికి పరీక్ష పెడుతున్నాయి. ఎప్పుడూ శాంతిని కోరుకునే మన దేశం ఈ కవ్వింపు చర్యలకు ఒకవేళ ఓపిక నశించి సీరియస్‌గా స్పందిస్తే పరిస్థితి చేయిదాటుతుంది. పాకిస్థాన్ ఏక పక్షంగా అణు యుద్ధానికైనా కాలు దువ్వుతుంది. బదులు తీర్చుకునేందుకు ఇండియా సైతం వెనకాడదు.



మన దేశం ఇచ్చే రియాక్షన్‌కి ప్రపంచ పటంలో పాకిస్థాన్‌కి చోటే లేకుండా పోతుందనటంలో అతిశయోక్తిలేదు. అణు యుద్ధం వల్ల దక్షిణాసియా పర్యావరణపరంగా బంజరు భూమి(వేస్ట్ ల్యాండ్) లా మారతుంది. కాశ్మీర్ సమస్య పరిష్కారానికి ఇరు పక్షాలు ముందుకు రాకపోతే జరిగే పరిణామాలు ఇంత భయంకరంగా ఉంటాయి. అందువల్ల కనీసం ఎల్‌ఓసీ విషయంలో ఇప్పటికే రెండు దేశాలు అంగీకరించిన పరస్పర విశ్వాస నిర్మాణ చర్యలను కట్టుదిట్టంగా అమలుచేయాలి. 2003 నాటి కాల్పుల విరమణ ఒప్పందానికి, స్ఫూర్తికి కట్టుబడి ఉండాలి.

కామన్ బోర్డర్ అంశంపై బోర్డర్ గ్రౌండ్ రూల్స్ కమిటీ చివరిసారిగా 1987లో సమావేశమైంది. కానీ అది అసంపూర్తిగా ముగిసింది. తర్వాత ఇరు దేశాల నిపుణుల స్థాయి మూడో రౌండ్ చర్చలు 2006లో జరిగాయి. ఈ సమావేశంలో పరస్పర విశ్వాస నిర్మాణానికి సంబంధించి ఒక ఒప్పందం కుదిరింది. కానీ దాన్ని రెండు దేశాల్లో ఒక్కటీ సక్రమంగా పాటిస్తున్న దాఖలాలు కనపడట్లేదు. ఎల్‌ఓసీకి ఇరువైపులా మోహరిస్తున్న రక్షణ బలగాలు ఒకదానిపైఒకటి ఫైరింగ్‌కి పాల్పడుతున్నాయి.

ఆపరేషన్ కబడ్డీ


వాజ్ పేయి హయాంలో (2001 సెప్టెంబర్‌లో) 'ఆపరేషన్ కబడ్డీ' నిర్వహించేందుకు ప్లాన్ వేశారు. 25 పాకిస్థానీ మిలటరీ పోస్టులను ధ్వంసం చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు. కానీ '9/11 ఎటాక్' నేపథ్యంలో నిలిపేశారు. సరిహద్దు యుద్ధం విషయంలో సైన్యానికి పరిమిత అవకాశాలే ఉంటాయి. 'ఆపరేషన్ కబడ్డీ'ని ఇండియా అమలు చేసి ఉంటే దాయాది దేశం పాకిస్థాన్ మన దేశాన్ని ఛాలెంజ్ చేయలేకపోయేది. పక్క దేశంతో దీర్ఘకాలంగా ఉన్న బోర్డర్ సమస్యను పరిష్కరించే శక్తి ఉన్న పార్టీకే ప్రజలు ఓట్లు వేయాలి.

ఇండియాకి రెండు పొరుగు దేశాలతో ఐదు వేల కిలోమీటర్లకుపైగా పరిష్కారం కాని సరిహద్దు వివాదాలు ఉన్నాయి. ఆ రెండు దేశాలకూ అణ్వాయుధాలు పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి బోర్డర్ ఇష్యూస్‌ని ఇండియా సాధ్యమైనంత శాంతియుతంగా పరిష్కరించుకోవాలి.

– ది వైర్ సౌజన్యంతో

బోర్డర్‌లో ఇదీ పరిస్థితి..

ఎల్‌ఓసీ వెంబడి ప్రతికూల పరిస్థితులను, వాటిని చక్కబెట్టే విషయంలో సైన్యాలకు, ప్రజా ప్రభుత్వాలకు ఉన్న పరిమితులను, బోర్డర్‌లో కాల్పుల వల్ల నాన్ మిలటరీ ఏరియాలు ప్రభావితమవుతున్న వైనాన్ని హ్యాపీమాన్ జాకబ్ 400 పేజీలున్న తన పుస్తకం 'లైన్ ఆఫ్ ఫైర్'లో కళ్లకు కట్టారు. సరిహద్దు సమస్యల పరిష్కారానికి పాలకులు చిత్తశుద్ధితో ప్రయత్నించాలని సూచించారు. అణుయుద్ధాల దిశగా ఆలోచనలు సాగించే రాజకీయ పార్టీలకు ఓటు వేయొద్దని రెండు దేశాల పౌరులకు సందేశమిచ్చారు. 'సర్జికల్ స్ట్రైక్స్' ఇతివృత్తంగా తీసిన 'ఉరీ' సినిమా రిలీజైన కొద్ది రోజులకే ఈ బుక్ రావటం, అందులోనూ మెరుపుదాడుల ప్రస్తావన ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేస్తున్న జాకబ్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పనిలేదు. దేశ వ్యూహాత్మక వ్యవహారాలపై ప్రముఖ ఆంగ్ల పత్రికలో ఆయన రెగ్యులర్‌గా కాలమ్స్ రాస్తారు.



Young India Adhikar March

7th Feb, 2019

మన యూత్‌లో ఫైర్ ఉంది

యువత గళమెత్తుతోంది. సామాజిక అసమానతలను ప్రశ్నిస్తోంది. బూటకపు ప్రచారంలోని అబద్ధాలను నిలదీస్తోంది. పాలకుల శుష్క వాగ్దానాల అంతు చూడటానికి రెడీ అవుతోంది. జనం సమస్యలపై దండు కదులుతోంది. దేశం రాజకీయంగా, సాంస్కృతికంగా సంధి దశలో పయనిస్తున్న సమయంలో యువతరం తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి ఢిల్లీ గల్లీలను వేదికగా చేసుకుంది. 'యంగ్ ఇండియా అధికార్ మార్చ్' పేరుతో జరిగే ఈ నిరసన ప్రదర్శన నేటి తరం యువత గుండె గొంతుకలా మారింది. వారి ఆశయాలకు, ఆకాంక్షలకు నిలువెత్తు ప్రతీకయింది.

యువతరం పిడికిలి బిగిస్తోంది. ఎక్కడో కాదు దేశ రాజధానిలోనే. 'యంగ్ ఇండియా అధికార్ మార్చ్' పేరుతో గురువారం జరిగే ఈ ప్రదర్శన నేటి యువత ఆశయాలకు, ఆకాంక్షలకు అద్దం పట్టబోతోంది. రకరకాల భావజాలాల మధ్య, అనేకానేక ఒత్తిడుల మధ్య, పేరెంట్స్ కోటి ఆశల మధ్య ఇవాల్టి యూత్ ఎదుగుతోంది. ఎల్‌కేజీ చదువుల నుంచే ఫలానా కోర్సు అంటూ తల్లిదండ్రులు టార్గెట్ ఫిక్స్ చేస్తున్నారు. వాటిని చేరుకోవడానికి పిల్లలు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కాదు. ప్లే గ్రౌండ్స్‌లో ఆటలు మరచిపోతారు. వీడియో గేమ్స్‌తోనే సంతృప్తి పడుతుంటారు. పదో తరగతి దాటితే అన్నీ 'సెట్'లే. సెట్‌ల మీద సెట్‌లు రాసుకుంటూ, అన్నిట్లోనూ మంచి పర్సంటేజీ తెచ్చుకుంటూ ఎడ్యుకేషన్‌లో బ్రైట్ అనిపించుకుంటారు.

సమాజాన్ని పట్టించుకోని చదువులు

అన్నీ అనుకున్నట్లు జరిగితే అమెరికా పోయి డాలర్ల వేటలో పడతారు. అగ్రరాజ్యం యోగం లేక ఇక్కడే ఉంటే నెల తిరిగేసరికి లక్షకు పైగా జీతం. గేటెడ్ కమ్యూనిటీలో ట్రిబుల్ బెడ్ రూం ఫ్లాట్. ఖరీదైన కారు. బిజీ లైఫ్‌లో ఏదైనా నచ్చిన ప్లేస్‌కు వెళ్లి సేదతీరడం. సమ్మర్ వస్తే ఊటీకో, కొడైకెనాల్‌కో కాకుండా స్విట్జర్లాండ్‌కో మరో యూరోపియన్ కంట్రీకో వెళ్లగలిగే ఆర్థిక స్థితి. ఇవే సక్సెస్‌కు కొలమానంగా మారాయి. సక్సెస్ ముసుగులో మనిషి స్వార్థపరుడిగా మారాలని చుట్టూ ఉన్న సమాజమే చెవి లో ఇల్లు కట్టుకొని అనుక్షణం చెబుతూ ఉంటుంది.

మార్క్సిజం, అంబేద్కరిజం వంటి సమాజం గురించి ఆలోచించే సిద్ధాంతాలు అటకెక్కి చాలా కాలమైంది. సగటు యువతకు కెరీరే జీవితమైంది. మనిషి.. మార్కెట్‌లో ముడి సరుకులా మారాడు. అయితే, ఇదంతా నాణేనికి ఒక వైపే. రెండో వైపు పూర్తి భిన్నమైన యువతరం కనిపిస్తుంది. వీళ్లు వాస్తవాల్లో బతుకుతారు. ప్రశ్నించడం నేర్చుకున్నవాళ్లు. చుట్టూ ఉన్న పరిస్థితులపై వీరికి సోయ కూడా ఎక్కువే. శుష్క రాజకీయ నినాదాలకు జై కొట్టడం వీరికి చేతకాదు. మందిర్-మసీద్ వివాదం వీరికి అక్కర్లేదు. 'అచ్చే దిన్' అని ఎవరైనా అంటే ఎప్పుడు వస్తాయి అని టక్కున ప్రశ్నిస్తారు. వీరి డిమాండ్లు కూడా డిఫరెంట్‌గానే ఉంటాయి. బతకడానికి స్థిరమైన ఆదాయం వచ్చే కొలువులు కోరుకుంటారు. చదువుతోపాటు సమాజం పట్ల బాధ్యతను నేర్పే యూనివర్సిటీలు కావాలంటారు. జాతి వివక్ష, వర్ణ వివక్ష, లైంగిక వివక్షలేని సొసైటీ కోసం అర్రులు చాస్తారు. కొత్త ఆలోచనలను స్వాగతించే మనసున్న మనుషులను ప్రేమిస్తారు. ఈ డిమాండ్ల కోసమే 'యంగ్ ఇండియా' ఇవాళ గళమెత్తుతోంది.



ఇదో తిరుగుబాటు

'యంగ్ ఇండియా అధికార్ మార్చ్'ను కేవలం ప్రదర్శనగానో సాదాసీదా నిరసన కార్యక్రమంగానో చూడటం సరికాదు. సమాజంలోని అసమానతలపై ఇదో తిరుగుబాటు బావుటా. పాలన వ్యవస్థను మరింత ప్రజాస్వామ్యీకరించాలన్న ఆకాంక్షలకు ఉద్యమ రూపం. కొత్తదనానికి స్వాగతం పలకలేని పాత విలువలపై నేటి తరం చేస్తున్న పోరాటం. సమాజం పట్ల సెన్సిబుల్‌గా ఆలోచించే అన్ని వర్గాల ప్రజలను, ప్రముఖులను, సిద్ధాంతవేత్తలను యువత కలుపుకొని పోవాలి. వాళ్లు మార్క్సిస్టులు కావచ్చు.. అంబేద్కరిస్టులు కావచ్చు. సోషలిస్టులు కావచ్చు.. ఫెమినిస్టులు కావచ్చు. యువతరంలో ఒక్కొక్కరూ ఒక్కో స్పార్టకస్. మనం చిటికెన వేలు అందిస్తే చాలు స్పార్టకస్ విజృంభిస్తాడు. పోరాటంలో చెలరేగిపోతాడు.

– అవ్ జిత్ పథక్,
సోషియాలజీ ప్రొఫెసర్,
జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ

ప్రభాత
వెలుగు
గురువారం | హైదరాబాద్
07.02.2019
www.v6velugu.com

టాకీస్

Follow:
v6velugu

కంటెంట్ బాగుంది



జయప్రద, పూర్ణ, సాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'సువర్ణ సుందరి'. ఎస్.ఎన్.సూర్య దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ హైదరాబాద్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు బి.గోపాల్ మాట్లాడుతూ... 'ట్రైలర్ చూశాను. చాలా బాగుంది. అన్ని షాట్స్ బాగా తీశారు. కంటెంట్ బాగుంది. విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. సాక్షి మాట్లాడుతూ... 'ఇది అద్భుతమైన చిత్రం. చాలా బాగా వచ్చింది. పాటలు, ఫైట్స్ చాలా బాగుంటాయి' అని చెప్పింది. పూర్ణ మాట్లాడుతూ... 'డైరెక్టర్ సూర్యకి సహనం చాలా ఎక్కువ. ప్రతి ఒక్కరి నుంచి తనకెలా కావాలో అలా ఔట్‌పుట్ రప్పించుకున్నారు. సాక్షికి నాకు మధ్య జరిగే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి' అని చెప్పింది. హీరోల్లో ఒకరైన ఇంద్ర మాట్లాడుతూ... 'ఈ సినిమా ఇంత లేటయ్యిందేంటని ఎవరూ అనుకోవద్దు. చాలా బాగా రావాలని డైరెక్టర్ ప్రతి చిన్న విషయంలోనూ శ్రద్ధ తీసుకుని కష్టపడ్డారు. వీఎఫ్ఎక్స్ కోసం పడిన కష్టం సామాన్యమైనది కాదు' అన్నాడు. ఇది తన మొదటి చిత్రమని, మొదటి సినిమాలోనే పూర్ణలాంటి అనుభవం ఉన్న నటితో చేయడం తన అదృష్టమని మరో హీరో రామ్ అన్నాడు. డైరెక్టర్ సూర్య మాట్లాడుతూ... 'సినిమాని చాలా స్పెషల్‌గా తీశాం. ప్రతి ఆర్టిస్ట్ అద్భుతంగా నటించారు. విజువల్ ఎఫెక్ట్స్ ఎక్కువ ఉండటం వల్ల లేటయ్యింది. వీఎఫ్ఎక్స్‌పై సంవత్సరం పాటు వర్క్ జరిగింది. ఫలితం కూడా బాగా వచ్చింది' అని చెప్పారు. డైరెక్టర్ కథ బాగా రాసుకున్నాడని, తప్పకుండా మంచి సినిమా అవుతుందని, ఇలాంటి సినిమాలు మరిన్ని రావడం వల్ల కొత్త టెక్నీషియన్స్ పరిచయమవుతారని తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో విజయేంద్ర ప్రసాద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కోరిక నెరవేరేనా ?



'మహానటి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైంది కీర్తి సురేష్. ఈ సినిమా తర్వాత ఆమె నుంచి సామి 2, 'పందెంకోడి 2, సర్కార్ వంటి చిత్రాలు వచ్చాయి. అయితే అవన్నీ తెలుగుకు అనువాద చిత్రాలే. ఇన్ని రోజులకు మళ్లీ ఓ తెలుగు సినిమా అంగీకరించింది. గత నెల రెండో వారంలో లాంఛనంగా ప్రారంభమైన ఈ లేడీ ఓరియంటెడ్ మూవీ షూటింగ్ ఈ నెల పది నుంచి రెగ్యులర్‌గా జరగనుంది. నరేంద్ర అనే కొత్త దర్శకుడు రూపొందిస్తున్నాడు. ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మహేష్ కోనేరు నిర్మిస్తున్నారు. కీర్తి సురేష్‌ను 'మహానటి'లా చూపించిన డానీ సంచేజ్ లోపెజ్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తున్నాడు. ఎక్కువ భాగం అమెరికాలోనే చిత్రీకరణ జరుగుతుంది. హైదరాబాద్‌తో పాటు కేరళలో కొంతభాగం చిత్రీకరించి... ఆపై అమెరికాకు వెళ్లనుందట చిత్రబృందం. ఇదిలా ఉంటే రజనీకాంత్ హీరోగా మురుగదాస్ తీసే చిత్రంలో కూడా హీరోయిన్‌గా కీర్తి సురేష్ పేరే వినిపిస్తోంది. మురుగదాస్ గత చిత్రం 'సర్కార్'లోనూ కీర్తి నటించింది. మార్చి నెలాఖరులో ఇది సెట్స్‌కు వెళ్లనుంది. లేడీ ఓరియెంటెడ్ సినిమాతో బిజీ అవుతోన్న కీర్తి.. రజనీకాంత్ సినిమాకి ఎలా డేట్స్ సర్దుబాటు చేయనుందో. పైగా ఆయనతో నటించాలనేది తన చిరకాల కోరిక అంటూ చాలాసార్లు చెప్పింది కూడా. మొత్తానికి 'మహనటి' స్థాయిలో మహిళా ప్రధాన సినిమాతో మెప్పిద్దామనుకున్న కీర్తి కెరీర్‌లో భలే ట్విస్ట్ ఎదురైంది. మరి తన కోరిక నెరవేరుతుందో లేదో!

విలన్‌గా వస్తాడట



హీరోలు విలన్లుగా నటించడం మనకు కొత్తేమీ కాదు. 'బాహుబలి'లో భల్లాలదేవగా రానా అద్భుతంగా నటించాడు. ఆది పినిశెట్టి హీరోగా ఎంట్రీ ఇచ్చినా... సరైనోడు, అజ్ఞాతవాసి లాంటి చిత్రాల్లో విలనిజం ప్రదర్శించి మార్కులు కొట్టేశాడు. ఈ తరహాలోనే మరి కొందరు హీరోలు కూడా నెగిటివ్ రోల్స్‌తో మెప్పించారు. ఇప్పుడు కార్తికేయ కూడా వారి బాటలోనే నడవనున్నట్లు తెలుస్తోంది. నాని హీరోగా నటించే సినిమాతో విలన్‌గా ఎంట్రీ ఇస్తున్నాడట కార్తికేయ. ప్రస్తుతం 'జెర్సీ' షూటింగ్‌లో ఉన్న నాని, తర్వాత విక్రమ్ కుమార్ డైరెక్షన్లో సినిమా చేయనున్నాడు. ఆ మూవీలో ఒక హ్యాండ్సమ్ యంగ్ విలన్ ఉండాలని భావించిన విక్రమ్... కార్తికేయను తీసుకుంటే బాగుంటుందని అతణ్ని సంప్రదించాడట. కార్తికేయ కూడా ఎస్ అన్నాడని సమాచారం. నిజానికి 'ఆర్ ఎక్స్ 100'లో తాను చేసిన పాత్రలో కోపం, ఆవేశం వంటి నెగిటివ్ ఎక్స్‌ప్రెషన్స్‌ని బాగానే ప్రదర్శించాడు కార్తికేయ. కాబట్టి విలన్‌గా ఇంప్రెస్ చేసే చాన్స్ లేకపోలేదు. అధికారిక ప్రకటనైతే వెలువడలేదు కానీ... ఈ వార్త కనుక నిజమైతే కార్తికేయను త్వరలో విలన్‌గా చూడొచ్చు.



టీజర్ టాక్



విశాల్ కథానాయకుడిగా నటిస్తోన్న తమిళ చిత్రం 'అయోగ్య'. ఎన్టీఆర్ హీరోగా నటించిన 'టెంపర్' సినిమాకి ఇది రీమేక్. లైట్ హౌస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఠాగూర్ మధు నిర్మిస్తున్నారు. వెంకట్ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. పూర్తి స్థాయి యాక్షన్ మార్క్‌తో టీజర్ కట్ చేశారు. తెలుగులో సెన్సార్ కట్‌కు గురైన 'దేశంలో జరిగే ప్రతి అవినీతికీ మొదటి సాక్షి ఈ గాంధీ' అనే డైలాగ్‌నే టీజర్‌లో హైలైట్ చేశారు. ఈ చిత్రంలో విశాల్ పాత్ర పేరు కర్ణ. కాజల్ స్థానంలో రాశిఖన్నా నటిస్తోంది. ప్రకాశ్‌రాజ్ పాత్రలో పార్తీబన్ విలన్‌గా నటిస్తున్నాడు. తెలుగులో డాక్టర్‌గా నటించిన సోనియా అగర్వాల్ తమిళంలోనూ అదే పాత్ర పోషిస్తోంది. రీమేక్ విషయంలో విశాల్ ఎక్కడా ఎన్టీఆర్‌ని ఇమిటేట్ చేయకుండా తనదైన శైలిని ప్రదర్శిస్తున్నట్టు టీజర్‌లో అర్థమవుతోంది. ఏప్రిల్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. హిందీలోనూ ఈ సినిమా మెప్పించిన నేపథ్యంలో తమిళంలో ఫలితం ఎలా ఉండబోతుందా అనే ఆసక్తి నెలకొంది.

ఫస్ట్ లుక్



టాలీవుడ్ టైగర్ ?

దక్షిణాదిన ఎప్పుడెప్పుడు హిట్ పడుతుందా.. ఎత్తుకెళ్లి రీమేక్ చేసేద్దామా అని ఎదురు చూస్తుంటాయి బాలీవుడ్ వర్గాలు. రీసెంట్‌గా 'టెంపర్' రీమేక్ 'సింబా' రూపంలో బాలీవుడ్‌కి మరో హిట్ ఇచ్చింది. 'అర్జున్ రెడ్డి' సెట్స్‌పై ఉంది. అయితే ఇది వన్ వే ట్రాఫిక్ కాదు. అప్పుడప్పుడూ మన సౌత్ సినీ జనాలు కూడా బాలీవుడ్ సినిమాలపై ముచ్చట పడుతుంటారు. గోపీచంద్ కూడా అదే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్ హీరోగా వచ్చిన 'టైగర్ జిందా హై' సినిమా రీమేక్‌లో గోపీచంద్ నటించనున్నాడనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. కత్రినా పాత్రను తమన్నా పోషించనుందట. ఇదే నిజమైతే గోపీచంద్ తన యాక్షన్ ఇమేజ్‌కి సరితూగే సబ్జెక్ట్‌ను ఎంచుకున్నట్టే. ఎందుకంటే 'టైగర్ జిందా హై' పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్. మరి తిరు దర్శకత్వంలో ఇటీవలే కొత్త చిత్రం ఆరంభించిన గోపీచంద్.. ఈ రీమేక్ వార్తలపై ఏమంటాడో!



అరుదైన అవకాశం

బాలీవుడ్‌లో ఉన్న వెర్సటైల్ యాక్టర్స్‌లో రిచా చద్దా మొదటి వరుసలోనే ఉంటుంది. గ్యాంగ్స్ ఆఫ్ వసేపూర్, సరబ్‌జిత్, ఫక్రీ, మసాన్ వంటి వైవిధ్యభరిత చిత్రాలతో తనేంటో ప్రూవ్ చేసింది. ప్రస్తుతం షకీలా బయోపిక్‌లో నటిస్తోంది. రీసెంట్‌గా రిచాకి ఓ అరుదైన అవకాశం లభించింది. నెల్సన్ మండేలాపై రానున్న ఓ ఇంగ్లిష్ పుస్తకంలో ఆర్టికల్ రాసే చాన్స్ లభించింది. కొద్ది రోజుల క్రితం 'లవ్ సోనియా' మూవీ ప్రమోషన్స్‌కి యూకే వెళ్లింది రిచా. అక్కడ ఓ చానెల్ వారి ఆహ్వానం మేరకు ఒక ప్రముఖ షోలో కూడా పాల్గొంది. అది చూసిన పబ్లిషర్ నిక్ కరీమ్ తన 'ద హౌస్ ఆఫ్ కామన్స్ బుక్ ఆఫ్ ట్రిబ్యూట్ టు ద లేట్ నెల్సన్ మండేలా' పుస్తకం కోసం ఒక మెసేజ్ రాసివ్వాల్సిందిగా రిచాను కోరాడట. యువతను జాగృతం చేసే లక్ష్యంతో రూపొందిస్తోన్న ఈ పుస్తకంపై వచ్చే లాభాలను ఆఫ్రికా ఖండంలో పేదరిక నిర్మూలనకు ఉపయోగించనున్నారట. దాంతో ఆనందంగా సరేనంది రిచా. ఈ పుస్తకంలో డేవిడ్ బెక్‌హామ్, రిచర్డ్ బ్రాన్సన్, రసెల్ క్రో, విల్ స్మిత్ లాంటి వారంతా కూడా మండేలా గురించి రాస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏడువందల మంది ప్రముఖులతో ఇలా రాయించి, వాటన్నిటినీ పుస్తకంగా తీసుకు రానున్నారు. అంత గొప్ప వారి స్థాయిలో రిచా నిలబడటం మనకి గర్వకారణం అని బాలీవుడ్ వారంతా ఆమెను ఎంతగానో ప్రశంసిస్తున్నారు.

మీసం తిప్పితే...

రొటీన్ పాత్రల వెంట పడకుండా వైవిధ్యమైన పాత్రలకు మాత్రమే ఎస్ చెప్పే శ్రీవిష్ణు... డిఫరెంట్ గెటప్స్ కూడా ట్రై చేస్తున్నాడు. ఆ మధ్య 'వీర భోగ వసంత రాయలు'లో కొత్త రకం హెయిర్ స్టయిల్‌తో, మంచి ఫిజిక్‌తో వైవిధ్యంగా కనిపించాడు. ఇప్పుడు మరో న్యూ లుక్‌తో వచ్చాడు. అతడు హీరోగా నటిస్తున్న 'తిప్పరా మీసం' సినిమా ఫస్ట్ లుక్ విడుదలైంది. మీసం, గడ్డం, పొడవాటి జుట్టుతో చాలా కొత్తగా ఉన్నాడు శ్రీవిష్ణు. కాస్త నెగిటివ్ ఛాయలు కూడా కనిపిస్తున్నాయి. 'అసుర' ఫేమ్ ఎల్.కృష్ణ విజయ్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ డ్రామాలో నిక్కి తంబోలీ, రోహిణి హీరోయిన్లు. అచ్యుత్ రామారావు, బెనర్జీ, రవిప్రకాష్, రవి వర్మ, నవీన్ నేని, ప్రవీణ్, నేహా దేశ్ పాండే తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. రిజ్వాన్ ఎంటర్టైన్మెంట్స్, శ్రీ ఓం సినిమా బ్యానర్స్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వేసవిలో విడుదల చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ట్విటర్ టాక్



"కమ్యునికేషన్ అనేది చాలా అవసరం. దానివల్ల మనమేంటో ఇతరులకు బాగా అర్థమవుతుంది. అంతకంటే ముఖ్యంగా... నువ్వేంటో నీకు తెలుస్తుంది. మనసు విప్పి మాట్లాడటం అలవర్చుకుంటే జీవించడం తేలికవుతుంది. నిజానికి మౌనం కూడా చాలా విషయాలు చెబుతుంది. కానీ దాన్ని అవసరమైనప్పుడు మాత్రమే వాడాలి."

– సుస్మితాసేన్

ఆన్ లొకేషన్



లక్ష్మీరాయ్ పోలీసాఫీరుగా నటిస్తున్న కన్నడ చిత్రం 'ఝాన్సీ'. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రంలో లక్ష్మి చాలా కష్టమైన ఫైట్స్ చేస్తుందట. ఆ షూటింగ్ లొకేషన్లో యాక్షన్ డైరెక్టర్ థ్రిల్లర్ మంజుతో లక్ష్మి.

గప్‌చుప్

గీత గోవిందం, దేవదాస్ చిత్రాలు సక్సెస్ కావడంతో సక్సెస్‌ఫుల్ హీరోయిన్ల జాబితాలో చేరిపోయింది రశ్మిక మందాన్న. ప్రస్తుతం డియర్ కామ్రేడ్, భీష్మ చిత్రాలు వరుసలో ఉన్నాయి. మరోవైపు తమిళం, కన్నడ సినిమాల్లోనూ నటిస్తోంది. రీసెంట్‌గా ఆమె మరో తెలుగు సినిమాకి సెలెక్టయ్యిందని టాలీవుడ్ టాక్. అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్లో ఒక సినిమా రానున్న సంగతి తెలిసిందే. ఈ మూవీలో రశ్మికను హీరోయిన్‌గా తీసుకున్నారనే వార్తలు టాలీవుడ్లో చక్కర్లు కొడుతున్నాయి. అదే నిజమైతే రశ్మిక మరింత బిజీ అయిపోతుందేమో.



ఫొటో ఫీస్ట్



ఆమె బ్యూటీ క్వీన్. అతడు యాక్షన్ కింగ్. ఇద్దరూ కలిసి గతంలో 'కుంగ్ ఫూ యోగా' చిత్రంలో నటించారు. ఇప్పుడు సరదాగా కలిసి నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. జాకీచాన్‌తో దిగిన ఈ ఫొటోని దిశా పటానియే స్వయంగా పోస్ట్ చేసింది.



వడ్డీ రేట్లు తగ్గిస్తారా?

నేడే పాలసీ ప్రకటన

ముంబై : కొత్త గవర్నర్ శక్తికాంత దాస్ నాయకత్వం లో తొలిసారిగా సమావేశమైన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) వడ్డీ రేట్లను పాతవే కొన సాగిస్తుందా లేక తగ్గింపుతో మార్కెట్లను ఆశ్చర్య పరుస్తుందా అనేది నేడు తేలనుంది. పాత గవర్నర్ ఉర్జిత్ పటేల్‌ను సాగనంపిన ప్రభుత్వానికి వడ్డీ రేట్లు తగ్గాలనే కోరిక ఉంది. ద్రవ్యోల్బణం గత అయిదు నెలలుగా టార్గెట్ కంటే తక్కువగానే ఉంటున్న నేపథ్యంలో రెపో రేటు తగ్గించొచ్చనే అభిప్రాయం కొంత మంది నిపుణులలో వ్యక్తమవుతోంది. కాకపోతే కోర్ ద్రవ్యోల్బణం 5 శాతాన్ని అంటిపెట్టుకుండటంతో ఈ సారి రెపో రేటును తగ్గించకపోవచ్చనేది మరికొంతమంది ఆర్థిక నిపుణుల భావన. ద్రవ్యోల్బణం తగ్గినా, ముడి చమురు ధరల పెరుగుదల, ద్రవ్యపరమైన సవాళ్ల ఒత్తిడి కారణంగా వడ్డీ రేట్లను ఇప్పుడున్న చోటే కొనసాగించొచ్చనేదే ఎక్కువ మంది అభిప్రాయం. కనీస ఆదాయ మద్దతు వంటి కొత్త స్కీములను తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించడంతో, భవిష్యత్‌లో మళ్లీ ద్రవ్యోల్బణం పెరుగుతుందని రేటింగ్ ఏజెన్సీ కేర్ అభిప్రాయపడుతోంది. కాబట్టి వడ్డీ రేట్లలో మార్పులు ఉండకపోవచ్చని సమాచారం.



ప్రకటన ఉదయం 11.45 కే

గవర్నర్‌తోపాటు ఆరుగురు సభ్యుల మానిటరీ కమిటీ సమావేశం మంగళవారం నాడే మొదలైంది. గతంలోలా కాకుండా గురువారం (నేడు) ఉదయం 11.45 కే విధానపరమైన ప్రకటన చేయాలని ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయించింది.

ఇంటరిమ్ డివిడెండ్ మీటింగ్ 18 న

మరోవైపు ఆర్‌బీఐ నుంచి మధ్యంతర డివిడెండ్ కోసం కేంద్ర ప్రభుత్వం ఉవ్విళ్లూరుతోంది. ఈ మధ్యంతర డివిడెండ్ ప్రతిపాదనను పోస్ట్ బడ్జెట్ ఆర్‌బీఐ బోర్డు మీటింగ్ (ఈనెల 9న)లో పరిశీలిస్తారని అనుకున్నారు. కానీ, మీటింగ్‌ను ఈ నెల 18 కి వాయిదా వేసినట్లు అధికార వర్గాల సమాచారం. బడ్జెట్ తర్వాత జరిగే ఈ సమావేశంలో సాధారణంగా ఆర్థిక మంత్రి పాల్గొని, ప్రసంగిస్తారు. ఐతే, ఇంటరిమ్ డివిడెండ్ చెల్లింపు ప్రతిపాదనను మీటింగ్‌లక్ష బోర్డు పరిశీలించనుందని ఆర్‌బీఐ వర్గాలు తెలిపాయి. తొలి ఆరు నెలల ఆర్థిక ఫలితాల ఆధారంగా ఇంటరిమ్ డివిడెండ్ మీద బోర్డు ఒక నిర్ణయం తీసుకుంటుదని వెల్లడించాయి. మును పెన్నడూ లేని విధంగా ఆర్‌బీఐ ఖాతాలను మొదటిసారిగా ఆరు నెలలకే ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఇంటరిమ్ డివిడెండ్ చెల్లింపు కోసమే ఇలా ఆడిట్ నిర్వహిస్తున్నట్లు కూడా ఆ వర్గాలు చెబుతున్నాయి.

వోడాఫోన్ ఐడియాకు

5 వేల కోట్ల నష్టం

ముంబై :

రిలయన్స్ జియో సెగ, పన్ను భారం వోడాఫోన్ ఐడియా లిమిటెడ్‌కు గట్టిగానే తగిలింది. డిసెంబర్ 2018 తో ముగిసిన మూడో క్వార్టర్‌కు రూ. 5,005 కోట్ల భారీ నష్టాన్ని వోడాఫోన్ ఐడియా ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన రెండో క్వార్టర్‌లోనూ కంపెనీ రూ. 4,974 కోట్ల నష్టాన్నే ప్రకటించిన విషయం తెలిసిందే. విలీనానికి సంబంధించిన పన్నుల బరువు అధికమై రూ.2,000 వేల కోట్లు చేరినట్లు వోడాఫోన్ ఐడియా తెలిపింది. ఈ భారం జులైసెప్టెంబర్ 2018 క్వార్టర్‌లో రూ.45 కోట్లు మాత్రమే. బుధవారం సమావేశమైన డైరెక్టర్ల బోర్డు ఆర్థిక ఫలితాలతోపాటు, రూ. 25 వేల కోట్ల రైట్స్ ఇష్యూకు ఆమోదం తెలిపింది.



రూ.1 పెరిగిన ఏఆర్‌పీయూ...

రెండో క్వార్టర్‌తో పోలిస్తే మూడో క్వార్టర్‌లో ఏవరేజ్ రెవెన్యూ పెర్ యూనిట్ (ఏఆర్‌పీయూ) రూ.1 పెరిగి రూ.89 కి చేరిందని కంపెనీ వెల్లడించింది. డిసెంబర్ 2018 చివరి నాటికి మొత్తం రుణ భారం ఏకంగా రూ.1,23,660 కోట్లకు చేరినట్లు చెబుతూ, ఇందులో కేంద్ర ప్రభుత్వానికి స్పెక్ట్రమ్ కోసం చెల్లించాల్సిన రూ. 91,480 కోట్ల బకాయిలు కూడా ఉన్నాయని పేర్కొంది. నగదు నిల్వలు రూ. 8,900 కోట్లని, ఇవి మినహాయిస్తే నికరంగా అప్పులు రూ.1,14,760 కోట్లని వోడాఫోన్ ఐడియా వివరించింది. అంతకు ముందు క్వార్టర్ (జులైసెప్టెంబర్ 2018) లో ఈ రుణ భారం రూ. 1,12,510 కోట్లు. రెండో క్వార్టర్‌తో పోలిస్తే తాజా క్వార్టర్‌లో ఈబీఐటీడీఏ 146 శాతం పెరిగి రూ. 1,137 కోట్లకు చేరింది. రెండో క్వార్టల్ ఇది రూ. 461 కోట్లు మాత్రమే. ఇదే కాలానికి ఈబీఐటీడీఏ మార్జిన్ కూడా 9.70 శాతానికి వృద్ధి చెందినట్లు కంపెనీ తెలిపింది. తాజా క్వార్టర్‌లో టారిఫ్‌లు స్థిరంగా ఉన్నాయని, ఆర్థిక ఫలితాల ప్రకటనలో కంపెనీ తెలిపింది. తక్కు ఏఆర్‌పీయూ ప్లాన్‌లకు కస్టమర్ల వలస కొనసాగుతోందని, దీంతో ఆదాయం, లాభదాయకత పెంచుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని వోడాఫోన్ ఐడియా పేర్కొంది. మూడో క్వార్టర్ చివరినాటికి ఈ చొరవ కొంత ఫలితాలను ఇచ్చిందని, క్వార్టర్ నుంచి క్వార్టర్ ఆదాయ క్షీణత 2.2 శాతానికే పరిమితమైందని, రెండో క్వార్టర్‌లో ఈ క్షీణత 7.1 శాతమని వివరించింది. డిసెంబర్‌లో దినసరి ఆదాయంలో వృద్ధి సాధించామని, జనవరి లోనూ ఇదే కొనసాగుతోందని కంపెనీ వెల్లడించింది.



డాలర్ @78

కార్వీ అంచనా

- పత్తి పర్లేదు. క్రూడ్ మళ్లీ పెరగొచ్చు
- బంగారం, వెండే మెరుస్తాయ్

హైదరాబాద్, వెలుగు:

డాలర్ తో పోలిస్తే రూపాయి మారకపు విలువ రూ.78 కి క్షీణిస్తుందని కార్వీ రిపోర్ట్ వెల్లడించింది. 2019 సంవత్సరానికి గాను కమోడిటీ అండ్ కరెన్సీ రిపోర్ట్ ను విడుదల చేసిన కార్వీ, ద్రవ్యలోటు, కరెంటు ఖాతాలోటు వంటివి దేశీయ కరెన్సీని ఒత్తిడికి గురిచేస్తాయని వెల్లడించింది. వీటి కారణంగా రూపాయి మరింత పతనమై రూ.78 స్థాయికి పడిపోతుందని తెలిపింది. ఈ యేడాది కమోడిటీ మార్కెట్ కు మిశ్రమ ఫలితాలు ఉండవచ్చని వెల్లడించింది. రూపాయి విలువ డౌన్‌సైడ్ రూ.68-69.50 మధ్య ఉండవచ్చని, ఇక అప్‌సైడ్ రూ.73-74.50 వరకు ఉంటుందని కార్వీ కమోడిటీస్ అండ్ కరెన్సీస్ సీఈవో రమేష్ వరఖేడ్కర్ తెలిపారు. ఒకవేళ రూపాయి మారకపు విలువ రూ.74.50 స్థాయిని దాటితే మరింత ఒత్తిడికి లోనై రూ.78 స్థాయివరకు వెళ్లే అవకాశాలున్నాయని అన్నారు. అమెరికాలో ఈ ఏడాది వడ్డీ రేట్ల పెంపుదల సూచనలుండటంతో, బులియన్‌లో పెట్టుబడులు పెరిగే అవకాశాలున్నాయని తెలిపారు. ఇండియాలో అగ్రి కమోడిటీస్ ధరలు ప్రధానంగా దేశీయ డిమాండ్‌సప్లై ఆధారంగానే నిర్ణయమైనప్పటికీ, అమెరికాచైనా ట్రేడ్ వార్ ప్రభావం ఇప్పుడు మూడో కోణంగా వచ్చి చేరుతుందని అభిప్రాయపడ్డారు.

రాబోయే సాధారణ ఎన్నికల కారణంగా అనిశ్చితి ఏర్పడే దృష్ట్యా ఫారిన్ ఇన్స్టిట్యూషనల్, ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్టర్లు ఇండియన్ మార్కెట్లలో పెట్టుబడులను వాయిదా వేసుకుంటున్నారని, ఎన్నికల సమయంలో ప్రైవేట్ పెట్టుబడులు నెమ్మదిస్తాయని వెల్లడించారు. సెకండ్ హాఫ్ లో కూడా కరెంటు ఖాతాలోటు, బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ మెరుగయ్యే సూచనలు కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు. ఇక 2019 సంవత్సరాన్ని బులియన్ యేడాదిగా అభివర్ణించింది కార్వీ. బంగారం, వెండి మంచి పనితీరును కనబరచడంతో పాటు కొనుగోళ్లకు సంబంధించి సురక్షితమైన పెట్టుబడులుగా నిలుస్తాయని తెలిపింది. ఇక క్రూడ్ ఆయిల్ ధరలు గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి. ఒపెక్, రష్యా దేశాలు ఇప్పటికే తమ ఉత్పత్తిని తగ్గించగా, యూఎస్ తమ ఉత్పత్తిని పెంచింది. డిమాండ్ తగ్గిన కారణంగా కాపర్, అల్యూమినియం ధరలు తగ్గవచ్చు. కష్టతరంగా మారిన సప్లై కారణంగా ఈ యేడాది కూడా పత్తి నిలకడగానే ఉండవచ్చు. సెకండ్ హాఫ్ లో సోయాబీన్ మార్కెట్‌కు అమ్మకాల ఒత్తిడి ఉండవచ్చని కార్వీ రిపోర్టు వెల్లడించింది.

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.406	రూ.4.65
వరంగల్	రూ.408	రూ.4.65

సెన్సెక్స్ 358 ↑ 36,975

నిఫ్టీ 128 ↑ 11,062

ఐఫోన్ యూజర్లకు వాట్సప్ కొత్త ఫీచర్లు

న్యూఢిల్లీ : ఐఫోన్ యూజర్ల కోసం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ వాట్సాప్ రెండు సరికొత్త ఫీచర్లను యాడ్ చేసింది. ఐఫోన్ యూజర్లకు డేటా ప్రైవసీ, సెక్యూరిటీ కోసం ముఖ గుర్తింపు, టచ్ ఐడీ ఫీచర్లను ప్రవేశపెడుతున్నట్టు వాట్సాప్ ప్రకటించింది. 'వాట్సాప్‌లో, ప్రైవేట్ మెసేజింగ్‌ను తాము ఎంతో లోతుగా సురక్షిస్తుంటాం. వేరే వ్యక్తులు మీ ఐఫోన్ తీసుకుని, మెసెజ్‌లు చదవకుండా ఉండేందుకు టచ్ ఐడీ, ఫేస్ ఐడీ ఫీచర్లను ప్రవేశపెట్టడం ఎంతో ఆనందదాయకంగా ఉంది' అని ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ తెలిపింది.

ఎయిర్‌టెల్‌కు షోకాజు నోటీసు

డీటీహెచ్ కస్టమర్లు ఫిర్యాదు

న్యూఢిల్లీ : ఎయిర్‌టెల్‌కు టెలికాం రెగ్యులేటరీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) షోకాజు నోటీసు జారీ చేసింది. బ్రాడ్‌కాస్ట్, కేబుల్ సెక్టార్ కోసం తీసుకొచ్చిన కొత్త విధానంలోకి మారే క్రమంలో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొంతమంది ఎయిర్‌టెల్ డీటీహెచ్ కస్టమర్లు ట్రాయ్‌కి ఫిర్యాదు చేశారు. కస్టమర్ల ఫిర్యాదు మేరకు ఎయిర్‌టెల్‌కు ట్రాయ్ నోటీసు పంపింది. ఈ విషయంపై మూడు రోజుల్లో స్పందించాలని ఎయిర్‌టెల్‌ను ఆదేశించింది. చివరి నిమిషంలో కొత్త విధానంలోకి మారే క్రమంలో కస్టమర్లు ఈ ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చిందేమోనని ఎయిర్‌టెల్ అధికార ప్రతినిధి అన్నారు.

రిటర్నులకు ఆధార్, పాన్ లింక్ తప్పనిసరి



ఢిల్లీ హైకోర్టు తీర్పును కొట్టివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ఆదాయపు పన్ను రిటర్నులను దాఖలు చేసేందుకు ఆధార్, పాన్ అనుసంధానం తప్పనిసరి అని బుధవారం సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఆధార్, పాన్ అనుసంధానం లేకుండా ఆదాయపు పన్ను రిటర్నులను దాఖలు చేయొచ్చని ఢిల్లీ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆర్డర్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. 2019-20 అసెస్‌మెంట్ ఇయర్ నుంచి కచ్చితంగా పన్ను రిటర్నులకు ఆధార్, పాన్ అనుసంధానం తప్పనిసరి అని సుప్రీంకోర్టు పేర్కొంది.

'201819 అసెస్‌మెంట్ ఇయర్‌ను తీసుకుంటే, హైకోర్టు ఆర్డర్ ప్రకారం రెస్పాడెంట్లు తమ ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులను దాఖలు చేసేశారు. ఆ అసెస్‌మెంట్ ఇయర్ కూడా పూర్తయింది. ప్రస్తుత అసెస్‌మెంట్ ఇయర్ 201920ను తీసుకుంటే, సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే ఆదాయపు పన్ను రిటర్నులను దాఖలు చేయాలి' అని జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది.

శ్రేయ సేన్ అనే పన్నుచెల్లింపుదారునికి, ఆధార్, పాన్ అనుసంధానం లేకుండా అసెస్‌మెంట్ ఇయర్ 2018-19కు చెందిన ఆదాయపు పన్ను రిటర్నులను దాఖలు చేసుకునేలా ఢిల్లీ హైకోర్టు 2018 ఫిబ్రవరి 24న అనుమతి ఇచ్చింది. అదేవిధంగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సంఖ్యను సమర్పించాలని ఆదాయపు పన్ను శాఖ బలవంతం చేయకర్లేదని కూడా తీర్పునిచ్చింది. ఈ ఆర్డర్‌కు వ్యతిరేకంగా ఆదాయపు పన్ను శాఖ అప్పీల్‌కు వెళ్లింది. ఈ అప్పీల్‌ను జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ అబ్దుల్ నజీర్‌ల బెంచ్ విచారించింది. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ.. ఆధార్, పాన్ లింక్ తప్పనిసరి అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అంతేకాక ఐటీ చట్టంలోని సెక్షన్ 139ఏఏను సమర్థించింది. సెక్షన్ 139ఏఏ ను ఆదాయపు పన్ను చట్టంలోకి 'ఫైనాన్స్ యాక్ట్ 2017' చేర్చింది.

ఎన్ఎండీసీలో పెరిగిన జీతాలు



హైదరాబాద్, వెలుగు : ఎన్ఎండీసీ లో పదవ వేతన సవరణ ఒప్పందం జరిగింది. ఎన్ఎండీసీలో ప్రతీ ఐదేళ్లకు ఒకసారి ఉద్యోగుల పే స్కేల్స్, ఇతర బెనిఫిట్స్ ను మారుస్తారు. చివరి సారిగా 2012 జనవరి లో వేతన సవరణ అమలులోకి రాగా, మళ్లీ 2017 జనవరి లో ఈ వేతన సవరణ జరగాల్సి ఉంది. అయితే ఎన్ఎండీసీ మేనేజ్‌మెంట్, ఆల్ ఇండియా ఎన్ఎండీసీ వర్కర్స్ ఫెడరేషన్ మధ్య పేస్కేల్స్, ఇతర బెనిఫిట్స్ గురించి గత కొంతకాలంగా బేరసారాలు జరుగుతున్నాయి. గతయేడాది నవంబర్ లో ద్వైపాక్షిక కమిటీ ముందుకు ఈ ఒప్పందం రాగా, బుధవారం త్రైపాక్షిక ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ పూర్తైంది. ఈ వేతన సవరణతో ఉద్యోగులు మరింత ఉత్సాహంతో పనిచేసి సంస్థను లాభాల బాటలో పయనించేలా చేస్తారని ఎన్ఎండీసీ సీఎండి బైజేంద్ర కుమార్ తెలిపారు.

ఆర్‌బీఐపై ఆశలతో దూసుకెళ్లిన సెన్సెక్స్



మళ్లీ 11 వేల మార్కును దాటిన నిఫ్టీ

ముంబై: స్టాక్ మార్కెట్లు భారీ లాభాలను మూటగట్టుకున్నాయి. బుధవారం సెషన్‌లో సెన్సెక్స్ 358 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ మళ్లీ 11 వేల మార్కును దాటి పరుగులు పెట్టింది. అంతర్జాతీయంగా సానుకూల వాతావరణం ఉండడంతో పాటు, గురువారం ఆర్‌బిఐ కొత్త గవర్నర్ శక్తికాంతదాస్ ఆధ్వర్యంలో మానిటరీ పాలసీ రివ్యూ ఉండడంతో మార్కెట్లు ఆశావాదంగా స్పందించాయి. దీనికి తోడు కొనుగోళ్ల మద్దతు కూడా తోడవడంతో సూచీలు భారీ లాభాలవైపు దూసుకెళ్లాయి. మార్కెట్ ముగిసేసమయానికి సెన్సెక్స్ 358.42 పాయింట్లు లాభపడి 36,975.23 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 128.10 పాయింట్లు పుంజుకుని 11,062.45 వద్ద ముగిసింది. పెరుగుతున్న క్రూడ్ ఆయిల్, ద్రవ్యలోటు కారణాలతో మానిటరీ పాలసీలో వడ్డీరేట్ల తగ్గింపు జోలికి వెళ్లకున్నా, కాస్త సులభతరంగా ఉండవచ్చనే వార్తలు మార్కెట్ సెంటిమెంట్ ను ప్రభావితం చేసాయి. దేశీయ, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు కూడా మార్కెట్ ట్రేడింగ్ సెంటిమెంట్ ను బలపరిచింది. సెన్సెక్స్ లో బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, ఓఎన్‌జీసీ, సన్ ఫార్మా, ఎన్‌టీపీసీ, కోల్ ఇండియా, మారుతి షేర్లు 4.34 % లాభపడగా, ఆక్సిస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ లు నష్టోపోయాయి.

డాక్టర్ రెడ్డీస్‌పై యుఎస్‌లో

ధరల కుమ్మక్కు ఆరోపణ

- ఫిర్యాదు చేసిన ఇన్సూరెన్స్ కంపెనీ
- ప్రభావం ఉండదంటున్న డాక్టర్ రెడ్డీస్

హైదరాబాద్, వెలుగు : 30 ఔషధాల ధరల నిర్ణయంలో కార్టెల్ అవుతున్నారని ఆరోపిస్తూ యునైటెడ్ హెల్త్‌కేర్ సర్వీసెస్ యుఎస్‌లోని తమ సబ్సిడరీతోపాటు, మరికొన్ని సంస్థలపై ఫిర్యాదు దాఖలు చేసినట్లు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ తెలిపింది. డాక్టర్ రెడ్డీస్‌తోపాటు, మరో 42 కంపెనీలపైనా ధరల నిర్ణయంలో కుమ్మక్కవుతున్నారని ఆరోపిస్తూ యుఎస్ ఇన్సూరెన్స్ కంపెనీ యునైటెడ్ హెల్త్‌కేర్ సర్వీసెస్ ఈ ఫిర్యాదు దాఖలు చేసిందని పేర్కొంది. 30 జెనరిక్ ఔషధాల బిడ్‌లలో ధరలలో ఈ విధంగా కుమ్మక్కైనట్లు యునైటెడ్ హెల్త్‌కేర్ ఫిర్యాదు చేసిందని, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు పంపిన వివరణలో తెలిపింది. అమెరికాలోని పలు రాష్ట్రాలలో అమలులో ఉన్న నిబంధనలకు విరుద్ధంగా ఈ కంపెనీలు వ్యవహరించినట్లు ఆరోపణ. ఐతే, ఈ విషయంలో తామెలాంటి తప్పూ చేయలేదని, ఈ ఆరోపణల మీద గట్టిగా తమను సమర్థించుకుంటామని పేర్కొంది. కార్యకలాపాలు, ఆర్థిక ఫలితాల మీద ఈ ఆరోపణల ప్రభావం ఏమీ ఉండదని కూడా డాక్టర్ రెడ్డీస్ ఈ సందర్భంగా స్పష్టం చేసింది. బుధవారం బీఎస్ఈలో డాక్టర్ రెడ్డీస్ షేర్ 1.47 శాతం తగ్గి రూ. 2,784.70 వద్ద ముగిసింది.

డాక్టర్ రెడ్డీస్‌కు ఊరట

డాక్టర్ రెడ్డీస్ సుబోక్జోన్ జెనిరిక్ ఔషధంపై కేసును మరోసారి విచారించి, డాక్టర్ రెడ్డీస్‌కు వ్యతిరేకంగా ఇంజంక్షన్‌ను ఎత్తివేయడానికి యుఎస్ అప్పీల్స్ కోర్టు తిరస్కరించినట్లు యుకె కంపెనీ ఇండివర్ పీఎల్‌సీ తెలిపింది. డాక్టర్ రెడ్డీస్ సహా మరికొన్ని కంపెనీలపై అమెరికా కోర్టులలో ఈ ఔషధం పేటెంట్‌పై ఇండివర్ కేసులు దాఖలు చేసింది. దాంతో గతంలో సుబోక్జోన్ జెనిరిక్ ఔషధం విక్రయించరాదంటూ డాక్టర్ రెడ్డీస్‌పై కోర్టు ఆంక్షలు విధించింది. ఈ నెల 11 న తీర్పును ఖరారు చేయనున్నట్లు కోర్టు తాజాగా తెలిపింది. ఫలితంగా డాక్టర్ రెడ్డీస్ జెనిరిక్ ఔషధ అమ్మకాలను నిలిపివేసే అవకాశం ఉండదు. యుఎస్ కోర్టు తీర్పు తమను నిరుత్సాహపరిచినట్లు ఇండివర్ సీఈఓ షాన్ థాక్సర్ చెప్పారు. ఐతే, డాక్టర్ రెడ్డీస్‌కు వ్యతిరేకంగా పేటెంట్ ఉల్లంఘన కేసులను కొనసాగించనున్నట్లు వెల్లడించారు.

జొమాటోకి ₹28 కోట్లు



- గ్లేడ్ బ్రూక్ ప్రైవేట్ ఇన్వెస్టర్ల నుంచి రూ.28 కోట్లు
- వంద కోట్ల డాలర్ల నిధుల సేకరణకు కసరత్తు

ముంబై: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో 40 మిలియన్ డాలర్ల (రూ.28 కోట్లకు పైగా) నిధులను సేకరించింది. అమెరికాకు చెందిన గ్లేడ్ బ్రూక్ ప్రైవేట్ ఇన్వెస్టర్స్ నుంచి ఈ నిధులను పొందినట్లు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ) వద్ద జొమాటో డాక్యుమెంట్స్ నమోదు చేసింది. మొత్తం 100 కోట్ల డాలర్ల నిధులు సేకరించేందుకు జొమాటో తీవ్ర కసరత్తులు చేస్తోంది. జొమాటో ప్రత్యర్థి స్విగ్గీ ఇటీవలే 100 కోట్ల డాలర్ల నిధులను నాస్పర్స్, ఇతర ఇన్వెస్టర్ల నుంచి సేకరించింది. స్విగ్గీకి పోటీగా జొమాటో కూడా నిధుల వేట బాట పట్టింది. ఫిబ్రవరి 5న గ్లేడ్ బ్రూక్ ప్రైవేట్ ఇన్వెస్టర్స్‌తో కుదుర్చుకున్న డీల్‌పై సంతకాలు చేసినట్టు జొమాటో ప్రకటించింది. మిగతా మొత్తం కోసం చైనీస్ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం ప్రైమవీర క్యాపిటల్, యాంట్ ఫైనాన్సియల్, ఇతర ఇన్వెస్టర్లతో జొమాటో చర్చలు జరుపుతోంది. జొమాటో అంతకముందు అలీబాబాకు చెందిన చెల్లింపుల అనుబంధ సంస్థ యాంట్ ఫైనాన్సియల్ నుంచి 21 కోట్ల డాలర్ల నిధులను సేకరించింది. స్విగ్గీ సేకరించిన 100 కోట్ల డాలర్ల నిధులు, ఇతర ప్లేయర్లు ఎవరూ మార్కెట్లోకి ఎక్కిరాకుండా అడ్డుకట్ట వేసేందుకు దోహదం చేయనున్నాయి. ప్రస్తుతం స్విగ్గీ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో టాప్ ప్లేస్‌లో ఉంది. జొమాటో సేకరిస్తున్న ఈ నిధులు, స్విగ్గీ వేసే ప్లాన్లకు బ్రేక్ ఇచ్చేందుకు సాయపడనున్నాయి.

చెత్తగా.. చిత్తుగా!

తొలి టీ20లో ఇండియా రికార్డు ఓటమి | 80 రన్స్‌తో కివీస్ గ్రాండ్ విక్టరీ

చెలరేగిన సీఫర్ట్.. సత్తా చాటిన బౌలర్లు

1

పరుగుల పరంగా ఇండియాకు ఇదే అతి పెద్ద ఓటమి. 2010లో ఆస్ట్రేలియా చేతిలో 49 రన్స్ తేడాతో ఓడిపోవడమే ఇప్పటివరకు చెత్త పరాజయం. తాజా మ్యాచ్‌తో ఆ రికార్డు బద్దలైంది

1

ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేసిన పరుగులు.. ఇండియాపై ఆ జట్టుకు అత్యధిక స్కోరు. 2017లో రాజ్‌కోట్‌లో చేసిన 196 పరుగుల స్కోరును కివీస్ మెరుగుపరుచుకుంది



రోహిత్ (1)

వన్డే సిరీస్ నెగ్గిన జోష్‌లో ఉన్న టీమిండియాకు దిమ్మతిరిగే షాక్...! పొట్టి ఫార్మాట్‌లో ఇండియాపై మెరుగైన రికార్డును కివీస్ కొనసాగించింది..! వన్డేల్లో చిత్తుగా ఓడిన హోమ్‌టీమ్ టీ20ల్లో దెబ్బతిన్న పులిలా పంజా విసిరింది టిమ్ సీఫర్ట్ మెరుపు బ్యాటింగ్‌కు తోడు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో చెలరేగిన విలియమ్సన్‌సేన తొలి టీ20లో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది..! బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ అన్నింటా తేలిపోయిన ఇండియా ఈ ఫార్మాట్‌లో పరుగుల పరంగా అతి పెద్ద ఓటమిని మూటగట్టుకుంది..!

వెల్లింగ్టన్: టీ20 ఫార్మాట్‌లో న్యూజిలాండ్ గడ్డపై బోణీ కొట్టాలని ఆశించిన ఇండియాకు మళ్లీ భంగపాటే. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం ఇక్కడి వెస్ట్‌ప్యాక్ స్టేడియంలో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో రోహిత్‌సేన చిత్తుగా ఓడిపోయింది. పలువురు కొత్త ఆటగాళ్లతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి 80 రన్స్ తేడాతో ఘన విజయాన్ని ఖాతాలో వేసుకుంది. సిరీస్‌లో అద్భుత బోణీ కొట్టింది. మొదట యువ వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ టిమ్ సీఫర్ట్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 84) హాఫ్ సెంచరీలతో చెలరేగడంతో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 219 పరుగుల భారీ స్కోరు చేసింది. కొలిన్ మన్రో (20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 34); విలియమ్సన్ (22 బంతుల్లో 3 సిక్సర్లతో 34) కూడా రాణించారు. అనంతరం భారీ టార్గెట్ ఛేజింగ్‌లో వరుసపెట్టి వికెట్లు కోల్పోయిన ఇండియా 19.2 ఓవర్లలో 139 రన్స్‌కే ఆలౌటైంది. ధోనీ (31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 39) టాప్ స్కోరర్. సీఫర్ట్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

మూకుమ్మడి వైఫల్యం..

భారీ టార్గెట్ ఛేజింగ్‌లో ఇండియా ఏ దశలోనూ కివీస్‌కు పోటీ ఇవ్వలేకపోయింది. పేసర్ టిమ్ సౌథీ (3/17), స్పిన్ ద్వయం శాంట్నర్ (2/24), ఇష్ సోధి (2/26) కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి మన బ్యాట్స్‌మెన్‌పై ఒత్తిడి తెచ్చారు. పవర్‌ప్లేలోనే ఓపెనర్లు రోహిత్ శర్మ (1), ధవన్ (18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 29) వికెట్లు కోల్పోయిన ఇండియా డీలా పడింది. ధోనీ కాస్త పోరాడినా అతనికి సహకారం అందించేవారు కరువయ్యారు. చివరి రెండు వన్డేల్లో నిరాశ పరిచిన కెప్టెన్ రోహిత్ ఈ మ్యాచ్ మూడో ఓవర్లో డీప్ స్క్వేర్‌లెగ్‌లో ఫెర్గూసన్‌కు క్యాచ్ ఇచ్చాడు. ధవన్, వన్‌డౌన్‌లో వచ్చిన ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ (18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు 27) కొద్దిసేపు బాగానే ఆడారు. కుగిలైన్‌ను లక్ష్యంగా చేసుకున్న ఈ ఇద్దరు భారీ షాట్లు కొట్టారు. కానీ ధవన్‌ను ఫెర్గూసన్ బౌల్డ్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. రిషభ్ పంత్ (4)తో పాటు శంకర్‌ను అవుట్ చేసిన స్పిన్నర్ శాంట్నర్ ఇండియాను కోలుకోలేని దెబ్బకొట్టాడు. కొద్దిసేపటికే దినేశ్ కార్తీక్ (5), హార్దిక్ పాండ్యా (4)ను సోధి అవుట్ చేయడంతో 77/6తో నిలిచిన ఇండియా వందలోపే ఆలౌటయ్యేలా కనిపించింది. ఈ దశలో ధోనీ, క్రునాల్ కాసేపు ప్రతిఘటించారు. ఇష్ సోధి బౌలింగ్‌లో క్రునాల్ ఫోర్, సిక్సర్, సౌథీ బౌలింగ్‌లో ధోనీ రెండు బౌండ్రీలు కొట్టి ఛేజింగ్‌కు ఊపు తెచ్చే ప్రయత్నం చేశారు. కానీ, వరుస ఓవర్లలో సౌథీ ఈ ఇద్దరినీ అవుట్ చేశాడు. భువనేశ్వర్ (1)ను ఫెర్గూసన్, చహల్ (1)ను మిచెల్ పెవిలియన్ చేర్చడంతో ఇండియా కథ ముగిసింది.

సూపర్ సీఫర్ట్..

4.4 ఓవర్లకే యాభై.. 10.2 ఓవర్లలోనే వంద.. 18.5 ఓవర్లలో రెండొందలు..! న్యూజిలాండ్ బ్యాటింగ్ జోరు సాగిన తీరిది. కివీస్ అంత భారీ స్కోరు చేసిందంటే కారణం టిమ్ సీఫర్ట్ మెరుపు బ్యాటింగే. ఈ మ్యాచ్‌కు ముందు టీ20ల్లో సీఫర్ట్ టాప్ స్కోరు 14 రన్స్ మాత్రమే. కానీ, ఈసారి ఓపెనర్‌గా ప్రమోషన్ దక్కించుకున్న యువ వికెట్ కీపర్ జట్టు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. 17 రన్స్ వద్ద ధోనీ, 71 రన్స్ వద్ద దినేశ్ కార్తీక్ క్యాచ్‌లు వదిలేసి ఇచ్చిన లైఫ్‌లను సద్వినియోగం చేసుకొని భారీ ఇన్నింగ్స్ ఆడాడు. వికెట్లకు అటు ఇటూ కదులుతూ.. స్వీప్ షాట్లు, రివర్స్ స్వీప్ షాట్లతో స్వేచ్ఛగా బౌండ్రీలు కొట్టిన సీఫర్ట్.. కివీస్ లెజెండ్ బ్రెండన్ మెకల్లమ్‌ను తలపించాడు. మరో ఓపెనర్ కొలిన్ మన్రోతో తొలి వికెట్‌కు 8.2 ఓవర్లలోనే 86 రన్స్ జోడించి భారీస్కోరుకు గట్టి పునాది వేశాడు. హార్దిక్ వరుస ఓవర్లలో మూడు ఫోర్లు, ఒక సిక్సర్ బాదిన అతను 30 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో ధాటిగా ఆడుతున్న మన్రోను క్రునాల్ అవుట్ చేసినా.. విలియమ్సన్‌తో కలిసి సీఫర్ట్ జోరు కొనసాగించాడు. చహల్ బౌలింగ్‌లో 4, 6 బాది సెంచరీ దిశగా దూసుకెళ్తున్న అతడిని ఎట్టకేలకు ఖలీల్ బౌల్డ్ చేశాడు. అప్పటికే క్రీజులో కుదురుకున్న కేన్.. హార్దిక్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లతో స్కోరు 150 దాటించాడు. స్లాగ్ ఓవర్లలో ఇండియా బౌలర్లు వరుసగా వికెట్లు తీసినా పరుగులు నియంత్రించలేకపోయారు. రాస్ టేలర్ (14 బంతుల్లో 2 సిక్సర్లతో 23) తో పాటుచివర్లో కుగిలైన్ (7 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్‌తో 20 నాటౌట్) మెరుపు బ్యాటింగ్‌తో కివీస్ 200 ప్లస్ స్కోరు చేసింది. బౌలర్లలో చహల్ (1/35) కాస్త పొదుపుగా బౌలింగ్ చేయగా.. హార్దిక్ (2/51), భువీ (1/47), ఖలీల్ (1/48) ధారాళంగా పరుగులు ఇచ్చారు.

స్కోరుబోర్డు


న్యూజిలాండ్: సీఫర్ట్ (బి) ఖలీల్ 84, మన్రో (సి) శంకర్ (బి) క్రునాల్ 34, విలియమ్సన్ (సి) హార్దిక్ (బి) చహల్ 34, మిచెల్ (సి) కార్తీక్ (బి) హార్దిక్ 8, టేలర్ (సి) ఖలీల్ (బి) భువనేశ్వర్ 23, గ్రాండ్‌హోమ్ (సి) సబ్/సిరాజ్ (బి) హార్దిక్ 3, శాంట్నర్ (నాటౌట్) 7, కుగిలైన్ (నాటౌట్) 20; **ఎక్స్‌ట్రాలు:** 6; **మొత్తం:** 20 ఓవర్లలో 219/6; **వికెట్ల పతనం:** 1-86, 2-134, 3-164, 4-1 64, 5-189, 6-191; **బౌలింగ్:** భువీ 4-0-47-1, ఖలీల్ 4-0-48-1, క్రునాల్ 4-0-37-1, హార్దిక్ 4-0-51-2, చహల్ 4-0-35-1; **ఇండియా:** రోహిత్ (సి) ఫెర్గూసన్ (బి) సౌథీ 1, ధవన్ (బి) ఫెర్గూసన్ 29, శంకర్ (సి) గ్రాండ్‌హోమ్ (బి) శాంట్నర్ 27, రిషభ్ (బి) శాంట్నర్ 4, ధోనీ (సి) ఫెర్గూసన్ (బి) సౌథీ 39, కార్తీక్ (సి) సౌథీ (బి) సోధి 5, హార్దిక్ (సి) మిచెల్ (బి) సోధి 4, క్రునాల్ (సి) సీఫర్ట్ (బి) సౌథీ 20, భువీ (సి) సీఫర్ట్ (బి) ఫెర్గూసన్ 1, చహల్ (బి) మిచెల్ 1, ఖలీల్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు:** 7; **మొత్తం:** 19.2 ఓవర్లలో 139 ఆలౌట్; **వికెట్ల పతనం:** 1-18, 2-51, 3-64, 4-65, 5-72, 6-77, 7-129, 8-132, 9-136, 10-139; **బౌలింగ్:** సౌథీ 4-0-17-3, కుగిలైన్ 2-0-34-0, ఫెర్గూసన్ 4-0-22-2, శాంట్నర్ 4-0-24-2, మిచెల్ 2.2-0-13-1, సోధి 3-0-26-2;



జనగామ జట్టు ఆటగాళ్ల విజయోత్సాహం

జనగామను ఓడించిన వరంగల్ వెస్ట్

ఉత్సాహంగా వెలుగు క్రికెట్



వరంగల్/ జయశంకర్ భూపాలపల్లి, నిజామాబాద్, వెలుగు: వెలుగు, వీ6 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం వరంగల్, భూపాలపల్లి, నిజామాబాద్ జిల్లాలో మ్యాచ్‌లు జరిగాయి. హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన మొదటి మ్యాచ్‌లో జనగామపై వరంగల్ వెస్ట్ ఐదు పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన వరంగల్ వెస్ట్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన జనగామ జట్టు నిర్ణీత ఓవర్లలో 146 పరుగులే చేసి ఓడిపోయింది. బ్యాటింగ్‌లో 33 రన్స్‌తో పాటు ఒక స్టంపౌట్ చేసి, మరో క్యాచ్ పట్టిన వరంగల్ వెస్ట్ వికెట్ కీపర్ గణేశ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. మరోమ్యాచ్‌లో స్టేషన్ ఘన్‌పూర్‌పై జనగామ 79 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జనగామ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కిరణ్ (56) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఛేజింగ్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ 16.5 ఓవర్లలో 86 పరుగులకే ఆలౌటైంది.



మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అందుకుంటున్న వరంగల్ వెస్ట్ ఆటగాడు గణేశ్

ఫైనల్‌లో కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్

నిజామాబాద్ జిల్లా స్థాయి పోటీల్లో కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్ జట్లు ఫైనల్‌కు దూసుకెళ్లాయి. నిజామాబాద్‌లోని సీఎస్ఐ గ్రౌండ్‌లో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో నిజామాబాద్ అర్బన్ ఎనిమిది వికెట్ల తేడాతో ఎల్లారెడ్డి టీమ్‌పై ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఎల్లారెడ్డి జట్టు 20 ఓవర్లలో 110 పరుగులు చేసింది. అనంతరం అర్బన్ జట్టు 9.5 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసి గెలిచింది. మరో సెమీఫైనల్ పోరులో కామారెడ్డి 66 పరుగుల తేడాతో ఆర్మూర్‌ను చిత్తుగా ఓడించింది. మొదట కామారెడ్డి 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 136 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఆర్మూర్ జట్టు 9 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేసింది. గురువారం కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది.



నిజామాబాద్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న అంకిత్ రెడ్డి

సెమీస్‌కు పరకాల

పరకాల జట్టు సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. భూపాలపల్లిలో జరిగిన మ్యాచ్‌లో పరకాల 44 పరుగుల తేడాతో భూపాలపల్లి టీమ్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పరకాల 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేయగా, ఛేజింగ్‌లో భూపాలపల్లి జట్టు 9 వికెట్లు కోల్పోయి 130 పరుగులే చేసింది. హాఫ్ సెంచరీ చేసిన శ్రీకాంత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. భూపాలపల్లి, ములుగు, పరకాల జట్లు ఒక్కో మ్యాచ్ గెలువగా రన్‌రేట్ ఆధారంగా పరకాల జట్టు సెమీస్‌కు చేరింది.



భూపాలపల్లిలో గెలిచిన పరకాల టీం సెలబ్రేషన్స్

మంధాన మెరిసినా..



వెల్లింగ్టన్: స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన (34 బాల్స్‌లో 7ఫోర్లు, 3సిక్సర్లతో 58) రికార్డు హాఫ్ సెంచరీతో చెలరేగినా మిగిలిన వారంతా విఫలమవడంతో న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన తొలి టీ20లో ఇండియా విమెన్స్ టీమ్ 23 పరుగుల తేడాతో ఓడిపోయింది. వరల్డ్ టీ20 సెమీఫైనల్ తర్వాత ఆడిన తొలి టీ20 మ్యాచ్‌లో మన జట్టు అదే రిజల్ట్‌ను పునరావృతం చేసింది. ఓపెనర్ సోఫియా డివైన్ (48 బాల్స్‌లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 62) హాఫ్ సెంచరీ చేయడంతో వెస్ట్‌పాక్ స్టేడియంలో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 159 రన్స్ చేసింది. కెప్టెన్ సాటర్‌త్‌వైట్ (33), కాటీ మార్టిన్(27 నాటౌట్) రాణించారు. అరుంధతి, రాధ యాదవ్ చెరో వికెట్ తీశారు. అనంతరం ఛేజింగ్‌లో కివీస్ బౌలర్లు తహుహు(3/20), కెర్(2/28) దెబ్బకు టీమిండియా 19.1 ఓవర్లలో 136 రన్స్‌కే ఆలౌటైంది. టీమ్ స్కోరు 102 వద్ద స్మృతి ఔటైన తర్వాత ఇండియా బ్యాటింగ్ లైనప్ కుప్పకూలింది. మంధాన, జెమీమా రోడ్రిగ్స్ (39) మెరుపులతో ఒకదశలో 101/1తో నిలిచి టీమ్.. మిడిలార్డర్ వైఫల్యంతో ఒక్కసారిగా 117/6 స్కోరుతో కష్టాల్లో పడిపోయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (17) కాసేపు ఆశలు రేకెత్తించిన మరో ఎండ్‌లో ఎవరూ క్రీజులో నిలవలేకపోయారు. కాగా, ఈ మ్యాచ్‌లో 24 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్కును చేరుకున్న మంధాన టీ20ల్లో ఇండియా తరఫున తన పేరిటే ఉన్న ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డును సవరించింది. గతేడాది ఇంగ్లండ్‌పై 25 బంతుల్లోనే యాభై రన్స్ చేసింది.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్: సుజీ బేట్స్ (సి) తానియా(బి) రాధ 7, డివైన్(సి) దీప్తి(బి) అరుంధతి 62 , గురే(బి) పూనమ్ 15, సాటర్‌త్‌వైట్(సి) రోడ్రిగ్స్ (బి) దీప్తి 33, కాటీ మార్టిన్ (నాటౌట్)27, ఫ్రాన్సిస్ (నాటౌట్)10, **ఎక్స్‌ట్రాలు** :5, మొత్తం 20 ఓవర్లలో 159/4; **వికెట్ల పతనం:** 1-11,2-47,3-116,4-121: **బౌలింగ్:** అరుంధతి 4-0-38-1, రాధ 4-0-38-1, దీప్తి 4-0-19-1, అనుజా 4-0-33-0, పూనమ్ 4-0-30-1.

ఇండియా: ప్రియా పునియా (సి)కాస్పిరిక్ (బి) సాటర్‌త్‌వైట్ 4, మంధాన(సి) రోవ్ (బి) కెర్ 58, రోడ్రిగ్స్ (సి) మార్టిన్(బి) తహుహు39, హేమలత(సి)కెర్(బి) తహుహు3, హర్మన్‌ప్రీత్ (స్టంప్డ్) (బి)కెర్ 17, అనుజా(సి) కెర్(బి)తహుహు 0, అరుంధతి(ఎల్బీ)(బి)మెయిర్ 2, దీప్తి(సి)సాటర్‌త్‌వైట్ (బి)డివైన్ 5, తానియా(సి అండ్ బి)కాస్పిరిక్ 1, రాధ(సి)మార్టిన్(బి)కాస్పిరిక్ 3, పూనమ్(నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు:**4, **మొత్తం:** 19.1ఓవర్లలో 136 ఆలౌట్; **వికెట్ల పతనం:** 1-4,2-102,3-103,4-111,5-111,6-117,7-129,8-132,9-136,10-136; **బౌలింగ్:** ఫ్రాన్సిస్ 0.3-0-4-0, సాటర్‌త్‌వైట్ 1.3-0-3-1, తహుహు 4-1-20-3, కాస్పిరిక్ 3-0-25-2, మెయిర్ 3-0-31-1, డివైన్ 3.1-0-24-1, కెర్ 4-0-28-2.

విదర్భ గెలుపుబాట

నాగ్‌పూర్: స్టార్ ప్లేయర్ పుజారా(0) మరోసారి నిరాశపరచడంతో విదర్భతో జరుగుతున్న రంజీ చాంపియన్‌షిప్ ఫైనల్లో సౌరాష్ట్ర వెనుకంజలో ఉంది. సౌరాష్ట్ర రెండో ఇన్నింగ్స్‌లో 58 రన్స్‌కే ఐదు వికెట్లు నష్టపోవడంతో డిఫెండింగ్ చాంపియన్ విదర్భ విజయం దాదాపు ఖాయమైంది. బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 55/2తో నాలుగో రోజు బ్యాటింగ్ కొనసాగించిన విదర్భ 200 రన్స్‌కు ఆలౌటైంది. దీంతో సౌరాష్ట విజయం కోసం 206 రన్స్ చేయాల్సి వచ్చింది. అయితే లెఫ్టార్మ్ స్పిన్నర్ ఆదిత్య సర్వాతె (3/13) మరో సారి విజృంభించడంతో సౌరాష్ట్ర జట్టు ఆట ముగిసే సమయానికి 58 రన్స్‌కే 5 వికెట్లు నష్టపోయింది. సౌరాష్ట్ర జట్టును సర్వాతే దెబ్బతీశాడు. ఓపెనర్లిద్దరినీ పెవిలియన్ పంపిన సర్వాతెకు పుజారా కూడా దొరికిపోయాడు. దీంతో 22 రన్స్‌కే సౌరాష్ట్ర మూడు వికెట్లు నష్టపోయింది. ఆ తర్వాత ఉమేశ్ యాదవ్ (1/37), అక్షయ్ (1/18) దెబ్బకు సౌరాష్ట్ర వెంటవెంటనే మరో రెండు వికెట్లు నష్టపోయింది. ఐదు వికెట్లు చేతిలో ఉన్న సౌరాష్ట్ర ఓటమి తప్పించుకోవాలంటే చివరి రోజు 148 రన్స్ చేయాల్సి ఉంది.

సంక్షిప్త స్కోర్లు: విదర్భ ఫస్ట్ ఇన్నింగ్స్: 312, సౌరాష్ట్ర ఫస్ట్ ఇన్నింగ్స్: 307, విదర్భ సెకండ్ ఇన్నింగ్స్: 200, సౌరాష్ట్ర సెకండ్ ఇన్నింగ్స్ : 58/5 (వీఎం. జడేజా 23 నాటౌట్, సర్వాతె 3/13)

కొచ్చి స్పైకర్స్ దూకుడు




కొచ్చి: ప్రొ వాలీబాల్ లీగ్‌లో కొచ్చి బ్లూ స్పైకర్స్ దూకుడు కొనసాగుతోంది. ప్రారంభ మ్యాచ్‌లో యు ముంబాను చిత్తు చేసిన కొచ్చి బుధవారం 3-2తో అహ్మదాబాద్ డిఫెండర్స్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌ను 10-15తో కోల్పోయిన కొచ్చి, రెండో సెట్‌ను 15-11తో గెలిచి అహ్మదాబాద్ ఆధిక్యాన్ని సమం చేసింది. అయితే మూడో సెట్‌ను 15-11తో గెలిచిన అహ్మదాబాద్ ఆధిక్యాన్ని పెంచుకోగా, నాలుగో సెట్‌ను 15-12తో గెలిచిన కొచ్చి మ్యాచ్ హీట్‌ను పెంచేసింది. నిర్ణయాత్మక ఐదో సెట్‌లో 15- 12తో గెలిచిన కొచ్చి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. అహ్మదాబాద్ ప్లేయర్ విక్టర్ 13(11 స్పైక్‌లు, 2 బ్లాక్‌లు)తో అదరగొట్టగా, కొచ్చి ప్లేయర్ డేవిడ్ లీ 10(7 స్పైక్స్, 2 బ్లాక్స్, 1 సర్వ్)పాయింట్లు సాధించాడు.



పదునైన చూపు

బాగా లోతులో ఈదే చేపను ఆకాశం నుంచి చూస్తే, పైపైనే తిరుగుతున్నట్లు కనిపిస్తుంది. అదే పైన తిరిగే చేప, అట్టడుగున తిరుగుతున్నట్లు కనిపిస్తూ మాయ చేస్తుంది. ఈ లాజిక్ సముద్రపు డేగలకు బాగా ఎరుక. చేపలు ఎప్పుడు పైకొస్తాయా అని కాచుకుర్చున్న ఓ డేగ, ఎట్టకేలకు తాను సాధించానని చాటిచెబుతున్న చిత్రమిది. ఈ సందర్భంగా తనను ఫొటో తీస్తున్న కెమెరాను పదునైన చూపుతో గుచ్చింది.




గోల్కొండ ఖిల్లా ప్రపంచ సంపద?

త్వరలో కోటకు యునెస్కో ఆఫీసర్లు వస్తారనే ఊహాగానాలు ● పరిసరాలు క్లీన్ చేస్తున్న జీహెచ్ఎంసీ

దాదాపు 8 వేల టన్నుల చెత్త గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) ఆఫీసర్లను ఉరుకులు పరుగులు పెట్టిస్తోంది. మన గోల్కొండ కోటను చూడ్డానికి త్వరలో యునెస్కో(యునైటెడ్ నేషన్స్ ఫర్ సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్) ఆఫీసర్లు వస్తున్నారనే ఊహాగానాలతోనే ఈ హడావుడి మొదలైంది. గత దశాబ్ద కాలంగా కోట చుట్టూ పెరిగిన చెట్లు, పేరుకుపోయిన చెత్త, కూలిన గోడల్ని మళ్లీ కట్టేందుకు జీహెచ్ఎంసీ ఆఫీసర్లు తంటాలు పడుతున్నారు.

గోల్కొండకు 'వారసత్వ' ట్యాగ్?

యునెస్కో ఆఫీసర్ల పర్యటనలో కోటను ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చెత్తను యుద్ధ ప్రాతిపదికన క్లీన్ చేసేందుకు జీహెచ్ఎంసీ యత్నిస్తోంది. కోట లోపలంతా బాగానే ఉంది. అయితే, వెలుపల ఉన్న దర్వాజాలు తదితర ప్రాంతాల్లో చెట్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగి జీహెచ్ఎంసీ ఆఫీసర్లకు సవాలు విసురుతున్నాయి. ఇప్పటిదాకా దాదాపు 400 టన్నుల చెత్తను కోట పరిసరాల నుంచి తొలగించినట్లు జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ ఫారుఖీ చెప్పారు. దాదాపు పదేళ్లుగా శుభ్రం చేయకపోవడంతో కోటలోని చాలా ప్రాంతాలకు దారులు మూసుకుపోయాయని తెలిపారు. కొన్ని చోట్ల నేల చిత్తడిగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లోని చెత్తను తొలగించడం చాలా కష్టంగా ఉందన్నారు. ప్రస్తుతం నాలుగు బ్యాచుల్లో ఎర్త్ మూవర్స్, వర్కర్స్ కోట పరిసరాలను క్లీన్ చేస్తున్నట్లు వెల్లడించారు. కోట గోడలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా వాటిపైగా ఎదిగిన చెట్లను, కొమ్మలను తొలగించడం మరో పెద్ద సవాలుగా తయారైందని చెప్పారు.



నములుడుకు పళ్లూడినయ్!

డైనోసార్ల జాతికి చెందిన స్మాక్ వొవెల్స్ కీ.. ఆహారంలో ఎముకలొస్తే వదిలేది కాదట. చూరచూరా నమిలేసేదట. అలా ఒక్కోసారి దాని దంతాలూ ఊడిపోయేవట. అయినా ఎముకల్ని మాత్రం వదిలేది కాదట. హై ఎనర్జీ ఎక్స్‌రే స్కాన్ ద్వారా ఆ డైనోసార్ల శిలాజ విసర్జితాలను పరిశీలించిన స్వీడన్‌లోని ఉప్సలా యూనివర్సిటీ సైంటిస్టులు ఈ వివరాలు వెల్లడించారు. వాటి విసర్జితాల్లో సుమారు 50 శాతం వరకు ఎముకల ఆనవాళ్లు ఉన్నాయని చెప్పారు.

గుడ్లు పెట్టే రకం

రెండు కాళ్ల ఈ డైనోసార్ గుడ్లు పెట్టేదట. ఆకారంలో టీ.రెక్స్ డైనోసార్‌లా ఉన్నా, దాని కంటే 14 కోట్ల ఏళ్ల ముందు జీవించిందని సైంటిస్టులు తెలిపారు. భూమిపైన, నీటిలో ఉండే ఏ జంతువునూ స్మాక్ వదిలేది కాదట. పెద్ద పెద్ద ఎముకలను నములుతున్నపుడు స్మాక్‌ల దంతాలూ అప్పుడప్పుడు ఊడిపోయుంటాయని, అందుకే వాటి విసర్జితాల్లో అవశేషాలు కనిపించాయని వివరించారు. టీ.రెక్స్ కూడా అచ్చం ఇలానే ఎముకలను నమిలి మింగేస్తుందన్నారు. రెండూ పెద్ద తల, భారీ శరీరం గల జీవులేనని, అయితే టీ.రెక్స్ కన్నా స్మాక్ చిన్నదని చెప్పారు. స్మాక్ ఆరు మీటర్ల వరకు పెరిగితే టీ.రెక్స్ దానికి రెండింతలు ఉంటుందన్నారు. ఇంకో విషయమేంటంటే ఈ రెండు జంతువులూ ఒకే ప్రాంతంలో నివసించేవంట. అదే ప్రస్తుత యూరప్.

సలామ్ వెబ్.. ముస్లింలకు ప్రత్యేకం



గూగుల్‌క్రోమ్, ఫైర్‌ఫాక్స్, ఒపేరా, యూసీ బ్రౌజర్, ఇంటర్నెట్ ఎక్స్ ప్లోరర్, సఫారీ, మైక్రోసాఫ్ట్ ఎడ్జ్.. ప్రపంచవ్యాప్తంగా వినియోగిస్తున్న వెబ్ బ్రౌజర్లలో ఇవి కొన్ని. మతం, ప్రాంతం, దేశం.. వంటి పరిమితులేవీ వీటికి ఉండవు. ఎవరైనా బ్రౌజ్ చేయొచ్చు. ఎలాంటి సమాచారమైనా వాటిలో దొరుకుతుంది. అయితే కత్తికి రెండు వైపులా పదును ఉన్నట్లే.. ఇంటర్నెట్ వల్ల మంచి ఎంత జరుగుతున్నదో చెడు కూడా అంతే జరుగుతోంది. ఈ నేపథ్యంలో మొత్తం ఫిల్టర్ చేసిన కంటెంట్‌ను అందించేందుకు మలేసియన్ స్టార్టప్ కంపెనీ ఒకటి ప్రయత్నిస్తోంది. అది కూడా ప్రత్యేకంగా ముస్లింల కోసం బ్రౌజర్ ప్రారంభించింది. ముస్లింలను మాత్రమే టార్గెట్ చేసి బ్రౌజర్‌ను ప్రారంభించామని, అయితే ఎవరైనా బ్రౌజ్ చేయవచ్చని చెబుతోంది.

మెసేజ్‌లు, వార్తలు

ఇస్లాం విలువలు, ముస్లిం కార్యక్రమాలు, ప్రార్థనా సమయాలు తదితర అంశాలతోపాటు మొత్తం కమ్యూనిటీకి చెందిన, ఫిల్టర్ చేసిన సమాచారం అందుబాటులో ఉంచేందుకు కొత్త బ్రౌజర్ ప్రారంభమైంది. ముస్లిం ఫ్రెండ్లీ వెబ్ ఎక్స్ పీరియన్స్ ను తమ కమ్యూనిటీలోకి తీసుకెళ్లేందుకు 'సలామ్ వెబ్'ను ప్రారంభించినట్లు సలామ్ వెబ్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ హస్నీ జరీనా మొహమ్మద్ ఖాన్ వెల్లడించారు. మొబైల్ తోపాటు డెస్క్ టాప్‌లోనూ పని చేసే ఈ బ్రౌజర్ ద్వారా మెసేజ్‌లు చేసుకోవచ్చని, వార్తలు చదవొచ్చని చెప్పారు. ఈ యాప్ కు ప్రధానంగా మలేసియా, ఇండోనేసియాలో ఇప్పటికే యూజర్లు ఉన్నట్లు తెలిపారు.

కనీసం 10 శాతం చాలు

"ప్రపంచవ్యాప్తంగా 1.8 బిలియన్ల (180 కోట్లు) మంది ముస్లింలు ఉన్నారు. వారిలో 10 శాతం మందికి మా బ్రౌజర్‌ను చేరువ చేయాలన్నదే ప్రస్తుతం మా లక్ష్యం" అని జరీనా చెప్పారు. అయితే ప్రముఖ టెక్నాలజీ కంపెనీలు గూగుల్, ఫేస్‌బుక్ వంటి వాటితో గట్టి పోటీ ఉంటుందని చెప్పారు. ఇటీవల హానికరమైన కంటెంట్, తప్పుడు సమాచారాన్ని సరి చేసేందుకు ప్రయత్నిస్తే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందని చెప్పారు. వ్యక్తి గత దూషణలు ఎక్కువయ్యాయని, ఈ పరిస్థితి మహిళల విషయంలో ఇంకా ఎక్కువ ఉందని అన్నారు. 'మహిళలకు చాలా ప్రమాదకరమైన ప్రదేశం' అని ట్విట్టర్‌ను ఉద్దేశిస్తూ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.


ఫిల్టర్ చేసిన సమాచారం

కమ్యూనిటీ కంటెంట్ ఫిల్టర్స్ పై ఆధారపడి సలామ్ వెబ్ పని చేస్తుంది. ఓపెన్ చేసిన వెబ్ పేజీ మీకు తగినదేనా? సరైనదేనా? సరైనది కాదా? వంటి విషయాలను సూచిస్తుంది. పొరపాటున గ్యాంబ్లింగ్, పోర్నోగ్రఫీ సైట్లలోకి వెళ్తే యూజర్లను హెచ్చరిస్తుంది. ముస్లింల పండుగలు, ఫంక్షన్లు, ప్రార్థనా సమయాలు, ఖిబ్లా ఇండికేటర్, ప్రార్థన చేస్తున్న సమయంలో పాటించాల్సిన నియమాలు తదితరాలను గురించి స్పష్టంగా తెలియజేస్తుంది. గ్యాంబ్లింగ్, వ్యభిచారం, మద్యం, పందులకు సంబంధించిన వ్యాపారాలు, వడ్డీతో నడిపే ఆర్థిక వ్యవహారాలు షరియా చట్టం నిషేధిత కార్యకలాపాల కిందకి వస్తాయి. ఇలాంటివే కాక, అందులో ఉన్న ప్రతి ప్రొడక్టును 'అమానీ షరియా సూపర్వైజరీ బోర్డు' పరిశీలించి, సర్టిఫై చేస్తుంది.

> ఇంటర్నెట్ లో మంచి ఉంది, చెడూ ఉంది. నెట్‌ను మరింత మంచి ప్రదేశంగా మార్చాలని మేం భావిస్తున్నాం. మంచిని చూడటానికి మాత్రమే ఇంటర్నెట్‌ను ఆశ్రయించే సాధనంగా మీకు సలామ్ వెబ్‌ను అందిస్తున్నాం. మేం యూనివర్సల్ వ్యాల్యూస్ ను ప్రమోట్‌చేస్తున్నాం. సలామ్ వెబ్ టార్గెట్‌ముస్లింలే.. కానీ ఎవరైనా బ్రౌజ్ చేయొచ్చు.
>
> - సలామ్ వెబ్ టెక్నాలజీస్ మేనేజింగ్‌డైరెక్టర్ హస్నీ జరీనా మొహమ్మద్ ఖాన్

నింగిని చేరిన జీశాట్ 31

ఇక దీవుల్లోనూ డీటీహెచ్ సర్వీసులు



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఖాతాలో మరో ఘన విజయం వచ్చి చేరింది. కమ్యూనికేషన్ శాటిలైట్ జీశాట్ 31ను యూరోపియన్ స్పేస్ సెంటర్ కు చెందిన ఏరియన్5 రాకెట్ నింగిలోకి తీసుకెళ్లింది. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారు జామున 2.31 గంటలకు ఫ్రెంచ్ గయానాలోని కౌరు లాంచ్ కాంప్లెక్స్ నుంచి ఈ ప్రయోగం జరిగింది. దాదాపు 42 నిమిషాల్లో శాటిలైట్ నిర్ణీత కక్ష్యలో చేరింది. రానున్న రోజుల్లో కర్ణాటకలోని మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ(ఎంసీఎఫ్) ద్వారా సైంటిస్టులు ఉపగ్రహాన్ని జియో స్టేషనరీ ఆర్బిట్ లో వదులుతారు. ఏరియన్ శాటిలైట్ ను నిర్ణీత ప్రాంతంలో వదలగానే ఎంసీఎఫ్ దాన్ని అదుపులోకి తీసుకుంది.

జీశాట్ 31తో పాటు సౌదీ అరేబియాకు చెందిన హెల్లాస్ శాట్4 ఉపగ్రహన్ని కూడా ఏరియన్ 5 అంతరిక్షంలోకి చేర్చింది. జీశాట్ 31 ఇండియా 40వ కమ్యూనికేషన్ శాటిలైట్. దీని బరువు 2,535 కేజీలు. 15 ఏళ్ల పాటు వీశాట్ నెట్‌వర్క్స్, టెలివిజన్ అప్ లింక్స్, డిజిటల్ శాటిలైట్, డీటీహెచ్ టెలివిజన్ సర్వీసులు, సెల్యులార్ బ్యాక్ హౌల్ తదితర అప్లికేషన్లకు సర్వీసులు అందిస్తుంది. ఇకపై భారత ఉపఖండంలో ఎక్కడో విసిరేసినట్లు ఉండే దీవుల్లో కూడా డీటీహెచ్ సహా అనేక సర్వీసులు అందించే వీలవుతుందని ఇస్రో పేర్కొంది. అరేబియా సముద్రం, బంగాళాఖాతం, హిందూ మహా సముద్రాలపై వైడ్ బ్యాండ్ ట్రాన్స్‌పాండర్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఇది సాధ్యమవుతోందని సైంటిస్టులు వివరించారు. వచ్చే జూన్ లేదా జులై నెలలో మరో సమాచార ఉపగ్రహం జీశాట్ 30ని ఇస్రో కౌరు నుంచే ప్రయోగించనుంది.

'రాజర్' రాజు వస్తున్నాడట



మోటోరోలా ఐకానిక్ ఫోన్ మళ్లీ రాబోతోంది. ఈ నెలలోగా లెనోవో, మోటోరోలా రాజర్ ఫోన్ ను మార్కెట్లోకి తెస్తుందని రిపోర్టులు వస్తున్నాయి. ఫోన్ కు సంబంధించిన ఫొటోలూ కూడా ఇంటర్నెట్ లో హల్ చల్ చేస్తున్నాయి. ఫోన్ ధర రూ.1.04 లక్షలు ఉంటుందని అంచనా. అయితే లెనోవో దీనిపై నేటి వరకూ ఎలాంటి ప్రకటనా చేయలేదు. వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ లో రాజర్ కు సంబంధించిన డిజైన్ రిజిస్ట్రేషన్ వివరాలు గత నెలలోనే బయటకు వచ్చాయి. 19:8 డిస్ ప్లే. సింగిల్ లెన్స్ కెమెరా తదితర ఫీచర్లు మాత్రమే ప్రస్తుతం వైరల్ అవుతున్న ఫొటోల్లో కనిపిస్తున్నాయి. సౌండ్‌ను పెంచుకునే బటన్స్ లేవు. ఈ ఫోన్ తొలుత అమెరికాలో రిలీజ్ అవుతుందని వాల్ స్ట్రీట్ జర్నల్ తన రిపోర్టులో పేర్కొంది.

రియల్ హీరో

గాయపడ్డ నక్సలైటుకు రక్తమిచ్చిన జవాను



అటువైపు నక్సలైట్లు.. ఇటువైపు సీఆర్పీఎఫ్ జవాన్లు. అప్పటి వరకు ఇరు వర్గాల మధ్య భారీగా ఎదురు కాల్పులు జరిగాయి. ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకు ప్రయత్నించారు. కాల్పుల్లో కొందరు నక్సల్స్ చనిపోయారు. కొందరు పారిపోయారు. ఇద్దరు ప్రాణాలతో పట్టుబడ్డారు. కానీ తీవ్ర గాయాలయ్యాయి. కొన్ని రోజుల తర్వాత వారిలో ఒకరికి అత్యవసరంగా రక్తం కావాలి. 'బీ+ బ్లడ్' గ్రూపు. విషయం తెలుసుకున్నాడు రాజ్‌కమల్. ఇక ఒక్క నిమిషం కూడా ఆగలేదతడు. ఆపదలో ఉంటే ప్రజలనే కాదు శత్రువునైనా కాపాడే గొప్ప మనసు తమకుందని చాటాడు.

జనవరి 29న జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భమ్, ఖుంతి జిల్లాల సరిహద్దుల్లో జవాన్లకు, నక్సలైట్లకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. 133వ బెటాలియన్‌కు చెందిన యాంటీ నక్సల్ యూనిట్ '209 కోబ్రా' జవాన్లు ఇందులో పాల్గొన్నారు. కాల్పుల్లో ఐదుగురు నక్సలైట్లు చనిపోయారు. సోమపర్తి సహా ఇద్దరు నక్సలైట్లు తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి వరకు తమతో పోరాడిన ఆ నక్సల్స్, ఇంకా ప్రాణాలతో ఉండటంతో వారిద్దరినీ సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు జవాన్లు. మృతదేహాలు, రెండు ఏకే 47 తుపాకులు, ఐదు పిస్టల్స్, రెండు పాయింట్ 303 రైఫిళ్లు స్వాధీనం చేసుకున్నారు. తీవ్రంగా గాయపడిన నక్సల్స్ ను రాంచీలోని రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌మెడికల్ సైన్సెస్ లో చేర్పించారు పోలీసులు.

మాకే ఫోన్‌చేస్తారు: సీఆర్పీఎఫ్ ఐజీపీ సంజయ్

"4వ తేదీన ఆస్పత్రి నుంచి ఫోన్‌వచ్చింది. బీ+ రక్తం కావాలని అడిగారు . రాజ్ కమల్ కు చెప్పగానే వెళ్లి రక్తదానం చేసి వచ్చాడు" అని జార్ఖండ్ సెక్టార్ సీఆర్పీఎఫ్ ఐజీపీ సంజయ్ ఆనంద్ లాథ్కర్ చెప్పారు. తర్వాత రాజ్ కమల్ కు నగదు రివార్డు అందజేసినట్లు తెలిపారు. "జార్ఖండ్‌లో అతిపెద్ద బ్లడ్ డోనర్ సీఆర్పీఎఫ్. గత ఏడాది కాలంలో 3 వేల యూనిట్ల రక్తాన్ని మా సిబ్బంది డొనేట్ చేశారు. ఎప్పుడైనా రక్తం అత్యవసరంగా కావాల్సి వస్తే, ముందు మాకే ఫోన్ చేస్తారు" అని చెప్పారు.

గతంలో కూడా..

సీఆర్పీఎఫ్‌సిబ్బంది ఇలా నక్సల్స్ కు రక్తదామివ్వడం ఇది తొలిసారేం కాదు. ఇంతకుముందు కూడా గాయపడ్డ నక్సలైట్ల ప్రాణాలు నిలిపారు. 2018 ఫిబ్రవరి 8న 134 బెటాలియన్‌కు, నక్సలైట్లకు జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా నక్సల్ మంజు బైగా తీవ్రంగా గాయపడింది. తర్వాత కొన్ని రోజులకు అత్యవసరంగా రక్తం అవసరమైతే అదే బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ గుల్జార్ డొనేట్‌చేశారు.


మ్యాగ్నటిక్ నార్త్ పరుగులు

కంపాస్ ముల్లులో మార్పులు ● కొత్త మ్యాప్ విడుదల చేసిన ఎన్ఓఏఏ

మ్యాగ్నటిక్ నార్త్ (ఉత్తర అయస్కాంత క్షేత్రం) భూమ్మీద నావిగేషన్ కు ఆధారం. అది ఎప్పుడూ కదులుతూనే ఉంటుంది. గడచిన వందేళ్లలో దాదాపు 1800 మైళ్ల దూరం పరిగెట్టింది. నేటికీ ఆ పరుగు ఆగలేదు. గతంలో కంటే అతి వేగంగా మ్యాగ్నటిక్ నార్త్ కదులుతున్నట్లు సైంటిస్టులు గుర్తించారు. దీని వెనుకున్న కారణాన్ని వాళ్లు చెప్పలేకపోతున్నారు. మ్యాగ్నటిక్ నార్త్ లో భారీ మార్పులు చోటు చేసుకోవడంతో కొత్త 'వరల్డ్ మ్యాగ్నటిక్ మోడల్'ను సిద్ధం చేశారు. మ్యాగ్నటిక్ మోడల్ ఆధారంగానే సెల్ ఫోన్లు, నౌకలు, విమానయానం జరుగుతోంది. అమెరికా షట్ డౌన్ కారణంగా ఎప్పుడో రిలీజ్ కావాల్సిన నూతన మోడల్, సోమవారం ఆలస్యంగా విడుదలైంది. కానీ దీనిపై ప్రపంచవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. మ్యాగ్నటిక్ నార్త్ ఎందుకంత వేగంగా కదులుతోంది? కొత్త మోడల్ అప్ డేట్ చేయకపోతే ఏం జరుగుతుంది లాంటి ప్రశ్నలు ప్రజల మెదళ్లను తొలుస్తున్నాయి.


ఏంటీ వరల్డ్ మ్యాగ్నటిక్ మోడల్?

1831లో తొలిసారి జేమ్స్ క్లార్క్ రాస్ కెనడాలో మ్యాగ్నటిక్ నార్త్ కదలికలను గుర్తించారు. అప్పటినుంచి మెల్లిమెల్లిగా కదులుతున్న ధ్రువం 2000 సంవత్సరానికి కెనడా ఆర్కిటిక్ నుంచి సైబీరియా వైపు 2300 కిలోమీటర్లు ప్రయాణించింది. ఈ మార్పుల్ని ఎప్పటికప్పుడు ప్రపంచానికి తెలియజేయడానికి అమెరికాకు చెందిన ఎన్ఓఏఏ సైంటిస్టులు, బ్రిటీష్ జియోలాజికల్ సర్వే వరల్డ్ మ్యాగ్నటిక్ మోడల్ పేరుతో ఓ మ్యాప్‌ను రూపొందిస్తుంది. దీని ఆధారంగా విమానాలు, నౌకలు దిశను మార్చుకుని గమ్యాన్ని చేరుకుంటాయి. చివరగా 2015లో మ్యాగ్నటిక్ నార్త్ ఎక్కడుందో గుర్తించారు. 2020లో ఎక్కడికి వెళ్తుందో ఓ అంచనాకు వచ్చారు. కానీ సైంటిస్టుల ఊహ తలకిందులైంది. ఓ ఏడాది ముందే మ్యాగ్నటిక్ నార్త్ ఊహించిన స్థానాన్ని చేరి ఆశ్చర్యపర్చింది. దీంతో 2020లో మళ్లీ మ్యాప్‌ను అప్ డేట్ చేయాలని సైంటిస్టులు నిర్ణయించారు.



భవిష్యత్ లో మ్యాగ్నటిక్ నార్త్ ఎటు వెళ్తుంది?

మ్యాగ్నటిక్ నార్త్ ఎప్పుడు ఎటు వెళ్తుందో చెప్పడం చాలా కష్టం. ప్రస్తుతం కదులుతున్న వేగంతోనే నడుస్తుందా అన్నది కూడా చెప్పలేం. దీని కంటే ఇంకా వేగంగానూ, అతి నెమ్మదిగానూ ప్రయాణించొచ్చు. ఇప్పటికైతే రష్యాకు చేరువలోని సైబీరియా వైపు సాగుతోంది. ఉత్తర, దక్షిణ ధ్రువాలు ఇటుది అటు, అటుది ఇటు మారిపోయిన సందర్భాలూ ఉన్నాయి. ప్రతి 2 లక్షల ఏళ్ల నుంచి 3 లక్షల ఏళ్ల మధ్య ఇది జరుగుతోందని సైంటిస్టులు చెబుతున్నారు. వచ్చే 1000 సంవత్సరాల్లో ఇది జరగొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన వేగం ధ్రువాలు మారిపోయేంత శక్తిమంతమైనదైతే కాదని అంటున్నారు.



ఏంటీ మ్యాగ్నటిక్ నార్త్?

భూమ్మీదున్న మూడు ఉత్తర ధ్రువాల్లో మ్యాగ్నటిక్ నార్త్ ఒకటి. అదేంటి మనకు మూడు ఉత్తర ధ్రువాలు ఉన్నాయా అనుకోవద్దు. నిజమైన ఉత్తర ధ్రువం ఒకటే ఉంది. దీని ఆధారంగా మన భూమి గుండ్రంగా తిరుగుతుంటుంది. కానీ మన భూమిని రక్షిస్తున్న మాగ్నటోస్పియర్, అసలైన ఉత్తర ధ్రువంతో పాటు కలిసి ఏకకాలంలో తిరగదు. ఇది రెండోది. ఇకపోతే మూడోది మన భూకేంద్రం వల్ల ఉత్పత్తి అయ్యే మ్యాగ్నటిక్ ఫీల్డ్. దీని పొజిషన్ కూడా అసలైన ఉత్తర ధ్రువంతో సరిసమానంగా ఉండదు. దీని ఉత్తర భాగాన్నే మ్యాగ్నటిక్ నార్త్ అంటారు. భూ కేంద్రంలో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి భూ కేంద్ర అంతర్భాగం, రెండు భూ కేంద్ర ఉపరితలం. దీనిలో జారుడు పదార్థాలు ఉంటాయి. దీని వల్ల మ్యాగ్నటిక్ నార్త్ ఎప్పుడూ కదులుతూనే ఉంటుంది. మన మ్యాగ్నటిక్ కంపాస్, మ్యాగ్నటిక్ నార్త్ పైన ఆధారపడి పని చేస్తుంది. మ్యాగ్నటిక్ నార్త్ ఎక్కడైతే ఉంటుందో, అటుగానే కంపాస్ ఉత్తర దిశను చూపుతుంది.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.